# మూసీ

# MUSI

◆ Samputi : 28 ◆ Sanchika : 03 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ January 2025

- తెలంగాణలో తొలి ముద్రాక్షర శాల 'వనపర్తి సంస్థానం' వారిదే !
- రావిశాస్త్రి బాకీ కథలు - తాత్త్విక అన్వేషణ
- వెండితెరకెక్కిన మహాకవుల జీవిత గాథలు
- నాదమయం - త్యాగరాజ హృదయం
- తెలుగునాట జోగిని వ్యవస్థ - పూర్వాపరాలు
- కుందుర్తి విమర్శ దర్శనం
- భైరవ కవి 'రత్నశాస్త్రం'
- అత్యాధునిక కవితా రూపం 'నానీ'

UGC CARE List
Approved Journal




Scanned with OKEN Scanner





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 3
జనవరి - 2025
'క్రోధి' పుష్య మాసం

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. MANOHARI

*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

తెలంగాణలో తొలి ముద్రాక్షర శాల 'వనపర్తి సంస్థానం' వారిదే!.. డా. భీంపల్లి శ్రీకాంత్ 7
రావిశాస్త్రి బాకీ కథలు - తాత్త్విక అన్వేషణ ... డా. జరుపుల రమేష్ 11
వెండితెరకెక్కిన మహాకవుల జీవిత గాథలు ... డా. తిరునగరి శరత్ చంద్ర 17
నాదమయం - త్యాగరాజ హృదయం ... పి.ఎల్. శాంతకుమారి 23
తెలుగునాట జోగిని వ్యవస్థ - పూర్వాపరాలు ... పేరం అమృత రావు 27
దక్షిణ కాశీ ప్రశస్తి - ధర్మపురి ... యం. సంతు 31
కుందుర్తి విమర్శ దర్శనం ... డా. బోయినపల్లి ప్రభాకర్ 35
నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము... డా. గండ్ర లక్ష్మణరావు 39
భైరవ కవి 'రత్నశాస్త్రం' - పరిశీలన ... మెరుగు ఆంజనేయులు 41
అత్యాధునిక కవితా రూపం 'నానీ' ... డా. వెల్దండి శ్రీధర్ 47

### సమీక్షలు

వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాస ఘట్టాలు - మరికొన్ని విశేషాంశాలు ... మాచవోలు శివరామ ప్రసాద్ 51
ప్రామాణిక కవి జీవిత చరిత్ర - వంగూరి 'వేమన' ... డా. కొల్లు వెంకటేశ్వర రావు 53
బతుకు బండి - దళిత కథల ఒడి ... డా. ముత్యంపేట గంగాధర్ 55
వైభవంగా సాగిన శ్రీ బి.ఎన్.శాస్త్రి అభినందన సభ - డా. మంత్రి శ్రీనివాస్ 57
'దివాకర్ల జీవితం - సాహిత్యం'పై సభ ... డా. మంత్రి శ్రీనివాస్ - 59.
స్వీకృతి... 61

### కవితలు

ప్రేమలేఖ ... అమరవాది రాజశేఖర శర్మ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; పద్యమే చిరునామా ... డా. ఎన్.గోపి - 16; సంస్కృతీ విరిశ్రుతి ... వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు - 30; ఎదురు చూస్తుంది ... బింగి శ్రీకాంత్ - 38; వెలుతురు ఖడ్గం ... శోభన్‌బాబు బొలుగాని - 46; కవితా స్రవంతి ... గుండ్లపల్లి రాజేంద్ర ప్రపసాద్ - 46; పరవశించు మేను ప్రకృతి గాంచి - నరసింహా రావు - 50; మహితత్త్వం - డా. ఒజ్జల శరత్‌బాబు - 62.

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**




# దృష్టి

నయనానికి సంబంధించినది దృష్టి. ఈ నయనం భౌతిక శరీరానికి సంబంధించినదే కాకుండా మానసికానికి కూడా చెంది ఉంటుంది. భౌతిక దృష్టి కన్నా మనోదృష్టికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. కన్ను పనిచేసే విధానాన్ని అనుసరించి కొంత పరిమితితో కూడుకున్న దృష్టి ఉంటుంది. అంతవరకే చూడగలిగితే ప్రత్యక్షం అని అంటారు. కన్ను చూడాలన్నా మనస్సు పనిచేయాల్సి ఉంటుంది. మనస్సు పనిచేయాలంటే శరీరంలో చైతన్యం ఉండితీరాలి. చైతన్యం అనేది మనస్సు ద్వారా వ్యక్తమై కంటితో చూసేటట్లు చేస్తుంది. కళ్ళు మూసుకుంటే కూడా దృశ్యమానం అయ్యేది పరోక్ష దృష్టి. ఈ దృష్టికి బలం ఎక్కువ, ప్రాధాన్యమూ ఎక్కువే. శక్తితో ఎక్కువ దగ్గరి సంబంధాన్ని పొంది ఉండేది కూడా ఇదే దృష్టి. ఇంద్రియాలలో దృష్టికి ప్రాధాన్యం అధికం కావడం వల్ల అన్నింటిలోనూ చూడడానికి ప్రాధాన్యం ఇస్తూ ఉంటారు. రుచిచూడడం, వాసన చూడడం, స్పర్శించి చూడడం మొదలైన ఇతర ఇంద్రియాలకు కూడా చూడటమనే శబ్దాన్ని వినియోగిస్తుంటాం. 'కనుట' అనే మాట, 'సాక్షి' మొదలైన శబ్దాలన్నీ కూడా తత్సంబంధాలే.

బాహ్య దృష్టి కన్నా అంతర దృష్టికి శక్తి ఎక్కువ. పరిమితి కూడా చాలా ఎక్కువ. తెలిసిన జ్ఞానం ఎంత ఉందో అంత చూసేందుకు అంతర దృష్టికి అవకాశం ఉంది. తెలియని దానిని ఊహించే ప్రయత్నం కూడా ఈ దృష్టివల్లనే జరుగుతుంది. దీనివల్లనే అనేక విషయాలకు సంబంధించిన జ్ఞానం కలుగుతుంది. అన్వేషణలన్నీ ఈ అంతర దృష్టివల్లనే సాధ్యం అవుతాయి. నిశిత పరిశీలన అంతా అంతర దృష్టియొక్క ప్రత్యేకతల వల్లనే జరుగుతుంది.


మనోదృష్టిని దేనిపైన కేటాయిస్తే దానికి సంబంధించిన జ్ఞానం వ్యక్తికి కలుగుతుంది. లోకం, సమాజం, గుణదోషాలు, పుట్టుపూర్వోత్తరాలు మొదలైన అంశాలపై దృష్టిసారిస్తే అవే అంశాలకు సంబంధించిన లోక పరిజ్ఞానం ఏర్పడుతుంది. మనో దృష్టిని ఖగోళం, భూగోళం, పంచభూతాలు, ప్రకృతి, శక్తి, గ్రహగోళాలు, ఆకాశం, నక్షత్రాలు, వృక్షజాతులు, సూర్యుడు, చంద్రుడు, ఇతర గ్రహాలు వాటి ప్రభావాలపై దృష్టి కేంద్రీకరిస్తే సృష్టి పరిజ్ఞానం కలుగుతుంది. అదే దృష్టిని ఈ గోళాలన్నీ కదలడానికి, చైతన్యశీలం అవడానికి కారణమైన శక్తిపైన కేంద్రీకరిస్తే శక్తికి సంబంధించిన మూల స్వరూపం అర్థమై, వ్యక్తి మరింత శక్తివంతుడవుతాడు.

మనో దృష్టి ద్వారా సాంగత్యం ఏర్పరచుకోవడం ముఖ్యం. లోకం, ప్రకృతి, శక్తి అనే మూడు అంశాలలో మొదటిది క్రింది స్థాయికి సంబంధించినది. ఇది సమాజాన్ని చెపుతుంది. రెండవది మధ్యస్థాయి. దీనిలో శాస్త్ర విజ్ఞానం తెలుస్తుంది. మూడవది వ్యక్తిని శక్తిగా మార్చేందుకు సహకరిస్తుంది. ఈ లోకంలోకి వ్యక్తి వచ్చాడంటే శక్తిగా మారడానికే. భౌతిక దృష్టిని క్రమంగా తగ్గించుకుంటూ, ఆత్మిక స్థాయికి చేరడానికే. అణురూపంగా వికసించేందుకే. ఘనం నుండి ద్రవం, ద్రవం నుండి వాయురూపానికి పదార్థాన్ని మార్చడం వల్ల అణువుల విస్తారం ఈ ప్రకృతిలో ఏ విధంగా జరుగుతుందో వ్యక్తి యొక్క వికాసమూ ఇదేవిధంగా ఉంటుంది.

అందుకే దృష్టి ఎప్పుడూ క్రింది స్థాయి వ్యవహారాలపై ఉండకూడదు. దానివల్ల శక్తిని త్వరగా కోల్పోయే అవకాశం ఉంటుంది. నిరంతరం అన్ని పనుల్లో ఉండి కూడా ఊర్ధ్వ దృష్టి కోసం ప్రయత్నించడం మంచిది. దానివల్ల శక్తి పెరిగే అవకాశం ఉంటుంది. మనిషి వికాసానికి ఇది తోడ్పడుతుంది. తాను వెలుగై లోకానికి వెలుగును ఇచ్చే స్థితికి తీసుకు వెళ్తుంది.

# ప్రేమలేఖ






నేనిట సేమమే యచట నీవును సేమముగా దలంచెదన్
మానితివేల జాబులను మానసవీధిన మీ విహారమే
గాన రుచించదోగిరము కంటికి నిద్దుర రాదు నన్ను నీ
దానిగ జేసికొమ్ము సరదా కయి నన్ విడబోకురా ప్రభో!

గండు తుమ్మెద నీట కమలమున్ గనుగొని
ఝుంఝుమ్మనుచు పాడె చూడరమ్ము
జంట పక్షులు కొమ్మనంటి కూర్చొని ప్రేమ
కబురులు వినిపించె కదలి రమ్ము
తరువును లతయిట పెరిమతో పెనవేసి
విరులను వెదజల్లె నరయ రమ్ము
అలలతో కదలాడి యవనిని ముద్దాడు
కడలిని కనులార గనగ రమ్ము
పురుషునిన్ జూచి ప్రకృతియే పులకరించె
ప్రకృతి గాంచిన పురుషుడే పరవశించె
కనులు గనియెడి దృశ్యమే మనసు జేరి
కలత రేపిన వైనమే గనుము నేడు

కోరను కోటి రూకలను కోరనవెన్నడు మేడ మిద్దెలన్
గోరను పట్టు వస్త్రముల గోరను హేమ విభూషణావళుల్
కోరను విందు భోజనము కోరను నిత్య విహారమెప్పుడున్
కోరెద నొక్కటే యమిత కూరిమి కోరిక దీర్చరమ్మురా!

తలుపు చప్పుడు విననంత తరలి జూతు
పిలుపు విన నీవెనంచని పలుక జూతు
అడుగు సవ్వడి నీదని వెదలి జూతు
నిమిష నిమిషము నినుగన నెదిరిజూతు

తలచిన చాలు నా కనుల దాపున నీదగు రూపురేఖలే
నిలిచిటు మందహాసమును నిండుగ వెన్నెలలట్లు చిందు నే
పిలిచిన చాలు నా కలల పేర్మి వసించుచు దివ్యలీలగా
చిలిపి తనంబుతో సలుపు చేష్టలముంచెదవెంత వింతరో

లేఖ చదివిన వెంట రాలేకయున్న
జాబునొక్కటి రాయుమే జాగులేక
ఎదిరి చూచెద మరువకుమెచటనున్న
తనువులే రెండు మనకును మనసు యొకటె

తప్పులున్నను మన్నించి యొప్పులు గను
భావనము చేసి చదువగా ప్రార్థనంబు
యిట్లు భవదీయ ప్రేయసినిట్టిలేఖ
గొనిన నికచాలు పదివేలు వినుతులిడుదు

**అమరవాది రాజశేఖర శర్మ**
గజ్వేల్, ఫోన్ : 98489 96559

## మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యథాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యథాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

## తుకారాం అభంగం

నీదనేది ఏమున్నది
నీకు సొంతమేమైనది
నీ నీడ నీది కాదు
నీవు నీ సొంతం కావు

నేను నేనని అభిమానం వద్దు
అసలు తెలుసుకుంటే ముద్దు
అహంకార మద మత్సరము
వదులుకుంటే అమృతమస్తు

చేయు పరమాత్మ దాస్యము
మాయు మోహమాయజాలము
అందుకొనుమి వరద హస్తము
అదే జీవముక్తి తంత్రము

తుకా నామ జపము సేయుము
సర్వదమన యుక్తి పొందుము
విఠల కీర్తి గుణగానము చేసి
మోక్ష మండలమును చేరుము




అనువాదం

డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

# తెలంగాణలో తొలి ముద్రాక్షర శాల 'వనపర్తి సంస్థానం' వారిదే !

**డా. భీంపల్లి శ్రీకాంత్,** మహబూబ్ నగర్, ఫోన్ : 903 284 4017

ఉమ్మడి పాలమూరు జిల్లా సంస్థానాలకు పెట్టింది పేరు. ఈ సంస్థానాలలో వనపర్తి సంస్థానం ప్రసిద్ధిగాంచింది. ఈ సంస్థానంవారే తెలంగాణలో మొట్టమొదటి ముద్రాక్షరశాలను ఏర్పాటు చేశారు. 1870 సంవత్సరంలో వనపర్తి సంస్థానంవారు **"బ్రహ్మవిద్యా విలాస ముద్రాక్షరశాల"** పేరుతో ఒక ముద్రాక్షరశాలను ఏర్పరిచారు. ఇది తెలంగాణలోనే ప్రాచీన ముద్రణాలయం కావడం విశేషం. ఇందులో క్రీ.శ. 1870 నుండి 1923 వరకు అనేక గ్రంథాలను ముద్రించారు. ఎన్నో విలువైన గ్రంథాలను ముద్రించి తెలుగు సారస్వత లోకానికి పరిచయం చేశారు. భారతదేశంలో ఒక చిన్న సంస్థానం ఒక ముద్రాక్షరశాలను స్థాపించి వేలకొద్దీ పుస్తకాలను వెలుగులోకి తీసుకురావడం నిజంగా వనపర్తి సంస్థానం గొప్పతనమని చెప్పవచ్చు.

### వనపర్తి సంస్థానం

ఈ వనపర్తి సంస్థానంలోని రాజులు శిల్ప, సంగీత, సాహిత్యాది కళలను ఆదరించి సాంస్కృతిక వికాసానికి దోహదపడ్డారు. అనేకమంది కవిపండితులను ఆదరించి పోషించారు. వారు రచించిన అనేక గ్రంథాలను ముద్రించి తెలుగు సాహిత్య వికాసానికి తన వంతు కృషి చేసారు. ఈ సంస్థానాధీశులందరూ చక్కని కళాపోషకులు, సాహితీప్రియులు. తమ సంస్థానంలో అనేకమంది కవులను, పండితులను, అవధానులను ఆదరించి ఆశ్రయం కల్పించారు. స్వయంగా వీరంతా భాషాభిమానులు కావడం చేత తెలుగు సాహిత్య వికాసానికి తమ వంతు కృషి చేశారు. వీరు తరచుగా పాండిత్య చర్చలను, విద్వత్సభలను, కవితాగోష్టులను నిర్వహించే వారు. కవులను శాలువాలతో పాటు నూట పదహార్లతోను, బిరుదుల తోనూ సత్కరించేవారు. అనేకమంది కవి పండితులను ప్రోత్సహించారు. ఆ రోజుల్లో రూ. 116-00 సన్మానం చాలా గొప్పది.

ఈ సంస్థాన పాలకులలో అష్టభాషా బహిరి గోపాలరావు గొప్ప కవిపండితుడు. ఇతడు మొదటి రాజకవి. సంస్కృత, తెలుగు భాషలలో కావ్యాలను రచించినవాడు. ఇతని కాలం నుండే సంస్థానంలో సాహిత్య పోషణ జరిగినట్లు తెలుస్తున్నది. అలాగే రాజా ప్రథమ రామకృష్ణారావు జ్యోతిష్యశాస్త్రంలో గొప్పపండితుడు. వనపర్తి సంస్థాన ప్రభువులు రాజనగరం, శ్రీరంగాపురం గ్రామాలలో జాతరలు నిర్వహించేవారు. ఈ ఉత్సవాలలో కవిపండితులకు సన్మానాలు చేసేవారు. ఈ సన్మానాలు అందుకోవడానికి తెలుగుదేశంలోని దాదాపు రెండు వేలమంది కవిపండితులు వచ్చేవారు. అలాగే తెలుగుదేశంలో సుప్రసిద్ధ కవిపండితులు ఈ సంస్థానానికి వచ్చి తమ పాండిత్యాన్ని ప్రదర్శించేవారు. ద్వితీయ రామేశ్వరరావు కాలంలో






తిరుపతి వేంకటకవులు కూడ ఈ సంస్థానానికి వచ్చేవారు. ఇలా ఎంతోమంది కవులు వనపర్తి సంస్థానానికి విచ్చేసి సంస్థాన గౌరవాలను పొందారు.

### "బ్రహ్మ విద్యా విలాస ముద్రాక్షరశాల"

ఈ సంస్థానం వారు "బ్రహ్మ విద్యా విలాస ముద్రాక్షరశాల" ఆధ్వర్యంలో ఎన్నో విశిష్టమైన గ్రంథాలను వెలుగులోకి తెచ్చారు. నన్నెచోడుని **"కుమార సంభవం, క్రీడాభిరామం, నీతిసార ముక్తావళి, అనర్ఘరాఘవం, ప్రబంధ మణిభూషణం"** వంటి ఎన్నో అమూల్య గ్రంథాలను ముద్రించి వెలుగులోకి తీసుకొచ్చి తెలుగు సాహిత్య వికాసానికి దోహదం చేశారు. వనపర్తి సంస్థానం ప్రారంభమైన 150 సంవత్సరాల తర్వాత ఇక్కడ సాహిత్య వికాసం ప్రారంభమైంది. పదిహేడవ శతాబ్దం పూర్వార్ధం నుండి చివరివరకు సాహిత్య వికాసం కొనసాగింది. తెలుగు సాహిత్య చరిత్రలో వనపర్తి సంస్థాన సేవకు ప్రముఖ స్థానం ఉన్నది. వనపర్తి సంస్థానం ముందు నుండి తెలుగు సాహిత్య వికాసానికి ఇతోధికంగా కృషిచేసింది. ఈ సంస్థానం క్రీ.శ. 1510 నుండి క్రీ.శ.1948 వరకు అంటే (భారత ప్రభుత్వంలో విలీనమయ్యేంత వరకు) జనుంపల్లి వంశస్థులైన రెడ్డిరాజులు పూర్వ సంప్రదాయాల ప్రకారం న్యాయమైన పరిపాలన చేశారు. సంగీత, సాహిత్య, శిల్ప, నాట్య కళలను పోషించారు.

సంస్థాన కాలంలో "బ్రహ్మ విద్యా విలాస ముద్రాక్షరశాల" ఆధ్వర్యంలో అనేకమంది కవిపండితుల గ్రంథాలను వెలువరించిన వనపర్తి సంస్థానం వారు సంస్థాన అనంతరం కూడా తమ ముద్రణాలయాన్ని కొనసాగించారు. సంస్థానం భారతదేశంలో విలీనం అయ్యేంతవరకు "బ్రహ్మ విద్యా విలాస ముద్రాక్షరశాల" పేరుతో ముద్రించారు. అనంతరం 1948 వ సంవత్సరంలో బ్రిటన్ ప్రచురణ సంస్థ అయిన లాంగ్మన్ ను వనపర్తి రాజు జె. రామేశ్వర రావు స్వాధీనం చేసుకున్నాడు. ఇందులో మెజారిటీ వాటాలను కొనుగోలు చేయడంతో 1968 వ సంవత్సరంలో సంస్థకు ఛైర్మన్‌గా

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2025


నియమితులయ్యాడు. అనంతరం 2008 వ సంవత్సరంలో ఓరియంట్ లాంగ్మన్ ను ఓరియంట్ బ్లాక్ స్వాన్ గా రూపాంతరం చెందింది. ఇప్పుడు ఇదే పేరుతో వనపర్తి సంస్థానం వారు పలు జాతీయ, అంతర్జాతీయ పుస్తకాలను ప్రచురించి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. నాటి సంస్థాన వారసత్వాన్ని నేటికీ కొనసాగించడం విశేషం.

**మానవల్లి రామకృష్ణకవి :**

తెలుగులో ఎన్నో అమూల్యమైన అముద్రిత గ్రంథాలను, అలభ్య, అలబ్ధ గ్రంథాలను సేకరించి తెలుగు సాహిత్యలోకానికి అందించిన పరిశోధకుడు మానవల్లి రామకృష్ణకవి. పాలమూరు జిల్లాలోనే ప్రప్రథమ పరిశోధకుడిగా మానవల్లి రామకృష్ణకవి పేరుగాంచాడు. సంస్కృతాంధ్ర సాహిత్యాలలో గొప్ప పాండిత్యం సంపాదించిన సాహిత్యపిపాసి. ఇతడు అనేక ప్రాచీన కావ్యాలకు ప్రాణం పోసిన పండితుడు. ఇతడు వనపర్తి సంస్థానానికి అంతరంగిక కార్యదర్శిగా రావడం సంస్థానం చేసుకున్న అదృష్టం. సంస్థాన రాజకవి **"అష్టభాషా బహిరి" గోపాలరావు** గ్రంథాలయాన్ని రామకృష్ణకవి పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. ఆ గ్రంథాలయంలో మూలనపడి ఉన్న ఎన్నో ఆణిముత్యాల వంటి కావ్యరత్నాలను వెలికితీసి పరిష్కరించి ప్రచురించాడు. తెలుగు సాహిత్యంలో ఆణిముత్యాలనదగ్గ నన్నెచోడుని **"కుమారసంభవం, త్రిపురాంత కోదాహరణం, శ్రీరంగ మహాత్మ్యం, సకలనీతి సమ్మతం"** మొదలైన గ్రంథాలను ప్రకటించాడు. ఇందులోని మొదటి ఎనిమిది వనపర్తిలోని బ్రహ్మవిద్యావిలాస ముద్రాక్షరశాలలో ప్రచురించబడ్డాయి. ఇవికాక **"ఉదయనోదయం, ఐరావత చరిత్రం, డిండిమ ప్రహసనం, రఘునాథ రామాయణం, సాంబోపాఖ్యానం"** అనే గ్రంథాలను అప్పట్లో అచ్చులో ఉన్నట్లు రాశాడు. వీటన్నింటిలో **"కుమార సంభవం, శ్రీరంగమాహాత్మ్యం"** ప్రబంధరాజాలు. రామకృష్ణకవి నన్నెచోడుడు నన్నయకంటే పూర్వం వాడని పేర్కొని సంచలనం సృష్టించాడు. ఇప్పటికీ ఈ వివాదంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరుగుతూనే ఉండడం విశేషం. పరిశోధకులు గ్రంథస్థ చిత్రకవిత మొదలైన సాక్ష్యాలను బట్టి నన్నెచోడుడు నన్నయ్య, తిక్కనలకు మధ్యకాలం వాడని నిర్ధారించారు. రామకృష్ణకవి కుమారసంభవం ఆధారంగా 22 సూత్రాలు గల **"ప్రాచీన శబ్దానుసాసనం"** అనే వ్యాకరణ గ్రంథం, **"భరతకోశం, మృగావతి"** అనే కావ్యాలను రచించాడు. సంస్కృతం, తెలుగు, కన్నడ సాహిత్యాలపై చక్కని అవగాహన కల్గి ఉండి కవిత్వరచన చేయడం వలన ఇతనికి 'కవి' అనే బిరుదు సార్థకనామధేయమైంది. తాళపత్ర పరిశోధకుడిగా, గ్రంథ పరిష్కర్తగా, పీఠికాకర్తగా, శాసన, చారిత్రక పరిశోధకుడిగా, కవిపండితుడిగా, రచయితగా రామకృష్ణకవి పాండిత్యం అనన్య సామాన్యం. మానవల్లికవి ఏదైనా గ్రంథాన్ని పరిష్కరించినపుడు దానిలోని పద్యాలకు, పదబంధాలకు, వర్ణనలకు మాత్రమే పరిమితమైపోకుండా అలాంటి పద్యాలు, వర్ణనలు, పద్యాల నడక ఏయే గ్రంథాల్లో ఉన్నాయో పరిశోధించి ఉదాహరణలతో సహా నిరూపించడం అతని పరిశోధన పరిశ్రమకు మచ్చుతునక. ఈ లక్షణమే అతని యొక్క బహుగ్రంథ పరిశోధనను తెలియజేస్తుంది.

మానవల్లి రామకృష్ణకవి వనపర్తి సంస్థానంలో రాజు దగ్గర అంతరంగిక కార్యదర్శిగా ఉన్నప్పుడే ఆయన దృష్టి ప్రాచీన గ్రంథాలవైపు మళ్ళింది. రామకృష్ణకవి ఎన్నో ప్రాచీన తాళపత్ర గ్రంథాలను సేకరించి, వాటిని పరిష్కరించి ముద్రించారు. అపురూపమైన ఎన్నో గ్రంథాలను వెలుగులోకి తీసుకుని వచ్చి తెలుగు సాహితీలోకానికి మహోపకారం చేశారు. మరుగునపడిపోయిన ఎన్నో మాణిక్యాలను, అలబ్ధంగా ఉన్న ఆణిముత్యాలను సమగ్రమైన సమాచారంతో, విపులమైన పీఠికలతో వెలువరించి తెలుగు సారస్వత వికాసానికి తోడ్పడ్డారు. రామకృష్ణకవి తెలుగు, సంస్కృత గ్రంథాలకు తెలుగు, సంస్కృతం, ఆంగ్ల భాషల్లో పీఠికలను రచించడం విశేషం.

మానవల్లి రామకృష్ణకవి వనపర్తిలో ఉన్నప్పుడే **"విస్మృత కవులు"** పేరుతో అనేక ప్రాచీన గ్రంథాలను పరిష్కరించి ప్రచురించారు. ఇతడు ప్రకటించిన "విస్మృత కవులు" తెలుగు సాహిత్య వికాసానికి విశేషంగా దోహదపడింది. విస్మృతమైన ఎన్నో ప్రాచీనకావ్యాలను వెలికితీసి, పరిశోధించి, పరిష్కరించి ఆ కవుల గూర్చి విశేషాలను తెలిపి తెలుగు సాహిత్య వికాసానికి ఎంతో కృషిచేశాడు. ఆయన పరిష్కరించి పీఠికతో ముద్రించిన గ్రంథాల్లో **"కుమార సంభవం (ప్రథమ, ద్వితీయ భాగాలు), క్రీడాభిరామం, నీతిశాస్త్ర ముక్తావళి, ప్రబంధ మణిభూషణం, పరతత్త్వ రసాయనం, అనర్ఘ రాఘవమ్, త్రిపురాంతకోదాహరణం, శ్రీరంగ మహత్త్వం, సకలనీతి సమ్మతం"** ముఖ్యమైనవి. ఇంకా **"ఆంధ్ర నాటకములు - రంగస్థలములు"** అనే గ్రంథానికి పీఠికతో పాటు **"కావ్యాదర్శం"** అనే సంస్కృత అలంకార శాస్త్రగ్రంథాన్ని పరిష్కరించి పీఠికలతో సహా ప్రచురించాడు.

**కుమార సంభవం**


మానవల్లి రామకృష్ణకవి పరిష్కరించి ప్రకటించిన మొదటి గ్రంథం **"కుమార సంభవం"**. దీనిని రెండు భాగాలుగా రామకృష్ణకవి వెలువరించాడు. ప్రథమ భాగాన్ని 1908 డిసెంబర్ 28 న, ద్వితీయ భాగాన్ని 1914 ఆగస్టు 30 న ప్రచురించాడు. తెలుగు సాహిత్య

లోకానికి "కుమార సంభవం" అనే అత్యంత విలువైన ఉద్గ్రంథాన్ని రామకృష్ణకవి పరిచయం చేశాడు. కుమార సంభవమనే ఈ మహాకావ్యాన్ని నన్నెచోడుడు రాశాడు. ఈ నన్నెచోడుడు నన్నయకంటే ముందువాడని రామకృష్ణకవి విశిష్ట పరిశోధన చేసి నిగ్గుతేల్చాడు.

నన్నెచోడుని కవిత్వం ప్రౌఢంగా ఉంటుందని, ఇతనికి "కవిరాజ శిఖామణి, టెంకణాదిత్యుడు" అనే బిరుదులు కూడా ఉన్నాయని పేర్కొన్నాడు. నన్నెచోడుని "కుమార సంభవం" కాళిదాసు కావ్యానికి అస్సలు అనువాదం కాదని రామకృష్ణకవి పేర్కొన్నాడు. ఈ గ్రంథంలోని పన్నెండాశ్వాసాల్లో మొత్తం 2100 పద్యాలున్నాయని, "కుమార సంభవం" ప్రథమ భాగంలో మొదటి ఏడాశ్వాసాలు, ద్వితీయ భాగంలో ఐదు ఆశ్వాసాలున్నాయని పేర్కొన్నాడు. ప్రథమ భాగంలో కవిజీవిత విశేషాలను తెలిపాడు. గ్రంథంలోని అంశాలను, ఇతర గ్రంథాలతో పోల్చి ఆధారాలతో సహా పీఠిక రాశాడు. ఆ పీఠికలో ఈ గ్రంథరాజంకు అనేక ప్రత్యేకతలున్నాయని, అనేక రకాల అలంకారాలకు, అపూర్వ వ్యాకరణ లక్షణాలకు, శబ్దచిత్రాలకు ఈ గ్రంథం నిలయమని సాధికారికంగా పరిశోధన చేసి తెలుగు సాహిత్యానికి పరిచయం చేశాడు. నన్నెచోడుడి కాలానికి దీర్ఘం మీద పూర్ణబిందువును వాడినట్లు, శ్రీకృష్ణదేవరాయల కాలానికి అది అర్థబిందువుగా మారినట్లు పేర్కొన్నాడు. "కుమార సంభవం" గ్రంథంలోని అనేక పద్యాల్లోని పదాలను పరిష్కరించిన తీరును విశ్లేషణాత్మకంగా వివరించాడు. అప్పటికే నన్నెచోడుడి కాలానికి సంబంధించి ఎన్నో వాదప్రతివాదాలు చెలరేగినా తాను చెప్పిన మాటకే కట్టుబడిన పరిశోధక శిఖామణి రామకృష్ణకవి.

**క్రీడాభిరామం**

మానవల్లి కవి పరిష్కరించి ప్రచురించిన గ్రంథం**"క్రీడాభిరామం"**. దీని గ్రంథకర్త వినుకొండ వల్లభరాయుడు. దీనిని అతడు 20 ఏప్రిల్ 1909 సంవత్సరంలో ప్రచురించాడు. తెలుగు సాహిత్య చరిత్రలో లభించిన రూపకభేదాల్లో ఒకటైన 'వీధి' ని మానవల్లికవి ఈ గ్రంథం ద్వారా తెలుగు సారస్వతలోకానికి అందించాడు. ఈ గ్రంథాన్ని వల్లభరాయుడు క్రీ.శ.1420 లో రచించాడు. సంస్కృతంలో రాయసాటి త్రిపురాంతకుడు రాసిన **"ప్రేమాభిరామం"** అనే వీధి నాటకానికి ఈ "క్రీడాభిరామం" అనువాదం. ఈ వీధి నాటకంలోని పదబంధాలు, వాక్య నిర్మాణం, అన్వయం మహాకవి శ్రీనాథుడు రాసిన "పల్నాటి వీర చరిత్ర" లోని కనిపిస్తుండడంతో దీనిని శ్రీనాథుడే రాశాడని చాలామంది పరిశోధకులు అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ తెలుగు సాహిత్య చరిత్రలో ఇదొక చర్చనీయాంశంగా ఉంది. మానవల్లికవి ఈ గ్రంథానికి రాసిన పీఠికలో గ్రంథకర్త విషయంలో అనేక గ్రంథాలను పరిశీలించి "క్రీడాభిరామం" వినుకొండ వల్లభరాయుని రచనగా నిర్ధారించాడు.




నీతిశాస్త్రముక్తావళి

**నీతిశాస్త్ర ముక్తావళి**

మానవల్లికవి పరిష్కరించి పీఠికతో వెలువరించిన మరొక గ్రంథం "నీతిశాస్త్ర ముక్తావళి". ఈ గ్రంథ రచయిత బద్దెన. ఇతనికి 'కవిబ్రహ్మ' అనే బిరుదు కూడా ఉంది. దీనిని రామకృష్ణకవి 1910 ఏప్రిల్ లో ప్రచురించాడు. సుమతీ శతకాన్ని రాసిన బద్దెన ఈ బద్దెన ఒకటి కాదని, సుమతీ శతకాన్ని రచించింది భీమన అని తాళపత్ర గ్రంథంలోని మొదటి పద్యం వల్ల తెలుస్తుందని, బద్దెన నీతులు, సుమతీ శతకంలోని నీతులు ఒకటే విధంగా ఉన్నప్పటికీ శైలిలో తేడా కన్పిస్తుందన్నాడు. బద్దెన రాజనీతితో కూడిన ఈ గ్రంథం మనోహరమైన శైలిలో రాయబడిందని, ఈ గ్రంథంలోని పద్యాలు కొన్ని కామందకంలోను, చాణుక్యుని అర్థశాస్త్రంలోను కనిపిస్తున్నాయన్నాడు. మానవల్లి రామకృష్ణకవి ఈ గ్రంథాన్ని వనపర్తి సంస్థానాధీశ్వరుడైన రాజారామేశ్వరరావు సహాయంతో ప్రకటించాడు.

**ప్రబంధ మణిభూషణం**

మానవల్లికవి పరిష్కరించి ప్రచురించిన మరో గ్రంథం "ప్రబంధ మణిభూషణం". ఈ గ్రంథాన్ని వనపర్తి సంస్థానం నుండి 18 జూన్ 1911 సంవత్సరంలో ప్రకటించాడు. ఈ గ్రంథం వివిధ ప్రాచీన కావ్యాలలోని ప్రసిద్ధ పద్యాలను ఏరి కూర్చిన సంకలనం. ఈ గ్రంథాన్ని కూర్చిన కవి ఎవరో, ఏ కాలంవాడో తగిన ఆధారాలు లేవని రామకృష్ణకవి పేర్కొన్నాడు. ఈ గ్రంథంలో మొత్తం 867 పద్యాలున్నాయని, వీటిలో 400 పద్యాలు ప్రసిద్ధ కావ్యాల్లోనివని పేర్కొన్నాడు. ఈ గ్రంథకర్త వివిధ ప్రబంధాలలోని పద్యాలను, అనేక వర్ణనలను ఘట్టాలకు అనుకూలంగా తీసుకుంటూ, అత్యంత చాతుర్యంతో చమత్కారంగా ఈ కావ్యాన్ని నడిపించాడన్నాడు. డెబ్బై కావ్యాలలోని పద్యాలను తీసుకుని ఈ గ్రంథం రచయిత రచించాడన్నాడు. **"శృంగార నైషధం, శాకుంతలం, కవికర్ణ రసాయనం, శ్రీరంగ మహత్త్వం, వాల్మీకి చరిత్ర"** మొదలైన కావ్యాల లోని పద్యాలను గ్రంథకర్త తీసుకున్నాడన్నాడు.

**పరతత్త్వ రసాయనం**

మానవల్లికవి "పరతత్త్వ రసాయనం" గ్రంథాన్ని 1911 వ సంవత్సరంలో పరిష్కరించి ప్రచురించాడు. ఈ గ్రంథాన్ని ఫణిభట్టు అనే కవి రచించాడు. ఈ గ్రంథంలో అనేక వేదాంత విషయాలను పేర్కొనబడ్డాయి. మళ్ళీ దీనిని మద్రాసు విశ్వవిద్యాలయం వారు 1944 సంవత్సరంలో ప్రచురించారు.

**అనర్ఘ రాఘవం**

సంస్కృతంలో మురారి రాసిన "అనర్ఘ రాఘవం" నాటకాన్ని ప్రబంధరూపంలో బిజ్జల తిమ్మభూపాలుడు రచించాడు. ఇతడు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాగటూరు సంస్థాన రాజు. మానవల్లికవి ఈ గ్రంథాన్ని పరిష్కరించి 1911 వ సంవత్సరంలో ప్రచురించాడు. ఈ గ్రంథం గురించి అనేక విషయాలను, విశేషాలను పీఠికకర్త అయిన రామకృష్ణకవి తెలిపాడు.

**త్రిపురాంతకోదాహరణం**

తెలుగు సాహిత్యంలో ఉన్న అనేక ప్రాచీన ప్రక్రియలలో ఉదాహరణ ఒకటి. ఈ ఉదాహరణ గ్రంథాన్ని రావిపాటి త్రిపురాంతకుడు రచించాడు. దీనిని మానవల్లికవి పరిష్కరించి 1912 వ సంవత్సరంలో ప్రచురించాడు. ఉదాహరణ వాఙ్మయశాఖకు సంబంధించిన దీనికి తిప్పరాజనే మరో పేరు కూడా ఉంది. ఇతని 'ప్రేమాభిరామం' అనే వీధి నాటకాన్ని శ్రీనాథుడు వల్లభరాయుల పేరుతో తెలుగులో రాశాడని, ఈ కవి రెండవ ప్రతాపరుద్రుని కాలంవాడని పేర్కొన్నాడు. ఈ ఉదాహరణతో పాటు **"మదన విజయం"** అనే రతిశాస్త్రాన్ని, **"తారావళి"** అనే చంద్రస్తుతిని, **"అంబికా శతకం"** అనే పార్వతిస్తుతిని రచించాడని పేర్కొన్నాడు. "మదన విజయం" ఎనిమిది ఆశ్వాసాలతో అభినవ కామసూత్రంలాగా అనిపిస్తుందని, "తారావళి" 27 వృత్తాలతో నూతన భావాలను కలిగి ఉందని, "అంబికా శతకం"లో పార్వతి గుణవర్ణన ఉంటుందని తెలిపాడు.

**శ్రీరంగ మహత్త్వము**

ప్రముఖ కవి భైరవకవి రచించిన శ్రీరంగ మహాత్యాన్ని పరిష్కరించి ప్రచురించాడు. దీనిని మానవల్లికవి 5 జూన్ 1912వ సంవత్సరంలో వనపర్తి రాజావారి సహాయంతో ప్రచురించాడు. బ్రహ్మాండ పురాణం ఆధారంగా భైరవకవి శ్రీరంగ మాహాత్మ్యాన్ని రచించాడని, ఇతని కాలం 1570 సంవత్సరమని పేర్కొన్నాడు. ఇదొక ప్రౌఢ ప్రబంధమని, దీనిని అనుసరించి అనేకమంది కవులు వివిధ ప్రక్రియలలో రచించారన్నాడు.

**సకలనీతి సమ్మతం**

"నీతిశాస్త్ర ముక్తావళి, ప్రబంధ మణిభూషణం" వంటి గ్రంథాల కోవకు చెందినది "సకలనీతి సమ్మతం". ఇదొక సంకలన గ్రంథం. దీనిని మానవల్లికవి 1923 వ సంవత్సరంలో ప్రచురించాడు. దీని సంకలనకర్త మడికి సింగన. ప్రజాస్వామ్యంలో ప్రతి మనిషి పాటించాల్సిన అనేక నీతులను సంకలనకర్త పేర్కొన్నాడు. ఈ గ్రంథంలోని మొదటి మూడాశ్వాసాల్లో రాజనీతి విషయాలను, మిగిలిన ఆశ్వాసాల్లో లోకోక్తి, సంగీత, నాట్య పూజా ప్రతిష్ఠ వంటి విషయాలను రచించాడని తెలిపాడు.

ఈ సకలనీతి సమ్మతం గ్రంథాన్ని సింగన క్రీ.శ. 1430 వ సంవత్సరంలో రచించాడని పేర్కొన్నాడు. ఈ "సకలనీతి సమ్మతం" లో అనేక గొప్పగొప్ప పద్యాలను, ఆ పద్యాలు ఉన్న గ్రంథాలను సింగన పేర్కొన్నాడని తెలిపాడు. **"ముద్రామాత్యం, నీతిసారం, పంచతంత్రి, పురుషార్థసారం, నీతి భూషణం, కామందకం, నీతి తారావళి, కుమారసంభవం, చారుచర్య, బద్దెన నీతి, పద్మపురాణం, శాలిహోత్రం"** మొదలైన గ్రంథాలలోని పద్యాలను స్వీకరించి "సకలనీతి సమ్మతం" సంకలన గ్రంథాన్ని రచించాడని పేర్కొన్నాడు.


**"విస్మృత కవులు"** పేరుతో మానవల్లికవి పేర్కొన్న గ్రంథాలనే గాకుండా ఇంకా అనేక గ్రంథాల పట్టికను కూడా పేర్కొన్నాడు. అవి **"ఉదయోనోదయము, ఐరావత చరిత్రం, డిండిమ ప్రహసనం, రఘునాథ రామాయణం, సాంబోపాఖ్యానం, ముద్రామాత్యం"** మొదలైనవి. వీటి గురించి రామకృష్ణకవి భారతి వంటి పత్రికలలో విరివిగా వ్యాసాలను రచించాడు. అనేక గ్రంథాలను, ప్రబంధాలను, శతకాలను, దండకాలను, సంకలన గ్రంథాల గురించి ఆనాటి పత్రికలలో ప్రచురింపజేశాడు.

ఒకవేళ మానవల్లి రామకృష్ణకవి లేకపోతే తెలుగు సాహిత్యంలో ఆణిముత్యాలైన గ్రంథాలు వెలుగులోకి రాకుండా ఉండేవి. రామకృష్ణకవి పరిష్కరణకు, పరిశోధనకు సహాయ, సహకారాలు అందించిన వనపర్తి సంస్థాన పాలకులు నిజంగానే తెలుగు సాహిత్యానికి ఇతోధిక సేవ చేయడం కవుల పట్ల వారికున్న ప్రేమను చెప్పకనే చెబుతుంది. కేవలం కవుల కోసమే వనపర్తి సంస్థానం వారు "బ్రహ్మ విద్యా విలాస ముద్రాక్షరశాల" ను స్థాపించడం యావత్ భారతదేశంలోనే తొలిసారి కావడం విశేషం.

**ఉపయుక్త గ్రంథాలు**

1. డా.పి.సి.వేంకటేశ్వర్లు, మానవల్లి రామకృష్ణ కవి సాహిత్య ప్రస్థానం, 2017 , హైదరాబాద్, తెలుగు అకాడమీ.

2. డా. భీంపల్లి శ్రీకాంత్, మహబూబ్‌నగర్ జిల్లా తెలుగు సాహిత్య వికాసం (పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం), 2012, మహబూబ్ నగర్.




# రావిశాస్త్రి బాకీ కథలు – తాత్త్విక అన్వేషణ

**డా. జరుపుల రమేష్,** అసోసియేట్ ప్రొఫెసర్, హన్మకొండ. ఫోన్ : 961 89 44 654

"I expect to pass through life but once if therefore, there be any kindness i can show, or any good thing i can do to any fellow being, let me do it now, and not defer or neglect it, as i shall not pass this way again" (Willian penn) ఈ వాక్యాన్ని పరిశీలిస్తే ఆధునిక జీవితం ఎలా ఉండాలో, మనిషి మనిషిలాగా ఎలా ఉండాలో తెలియజేస్తుంది. అలాగే రావి శాస్త్రి కథలను చూస్తే "Learning does not make one learned, there are those who have knowledge and those who have understanding the first requires memory and the second philosophy" Alexander Dumas చెప్పిన భావాలు అక్షరాల సరిపోతాయి.

**రావిశాస్త్రి (రాచకొండ విశ్వనాథశాస్త్రి) (1922 – 1993)** వృత్తి రీత్యా న్యాయవాది, కథా రచయిత. ఆయన కథల్లో కూడా న్యాయవాదే. తన గొంతుకతోనే కథల్లో నాయ్యాన్ని అందిస్తాడు. నేటి సమాజంలో నిత్యమూ ఉన్నతవర్గం వారు చేసే అన్యాయాలకు, దౌర్జన్యాలకు గురై చిత్ర హింసలు పడుతున్న దీన, హీన ప్రజల తరఫున తన వంతు గొంతుకను అందిస్తాడు. వారికి ఒక ధైర్యాన్ని అందిస్తాడు. వారిలో చైతన్యాన్ని, జ్ఞానాన్ని అందించిన తీరు తన ప్రతి రచనలోను ఉంటుంది. చివరకి వారికి ఒక వకాల్తా పుచ్చుకుని సాంఘిక న్యాయం, ఆర్థిక న్యాయం కోసం "వాదించాడు". సమాజం అట్టడుగు పొరల్లో, అనుక్షణం భయపడుతూ జీవించే పేదల సమస్యలను, వాటివలన కలిగే దు:ఖాన్ని సూటిగా గుండెలకు నాటేలా చెప్పి పై జీవితం పట్ల పాఠకుల సానుభూతిని ప్రకటించిన ఆనాటి రచయితల్లో రావిశాస్త్రి ఒకరు. వీరు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల మాండలికంలో, అట్టడుగు వర్గాల భాషలో, సొగసుగా, ప్రతిభావంతంగా, ప్రభావవంతంగా, పాఠకుల హృదయాలకు హత్తుకు పోయేలా పదునైన రచనలు చేసాడు.

రావి శాస్త్రి పుట్టినకాలాన్ని గమనిస్తే అప్పటికే ఆధునిక యుగంలో దేశం ఉంది. ఒకవైపు దేశం స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తున్న తరుణం ఒకటైతే, మరొకవైపు సాహిత్యంలో నూతన కోణాలను ఆవిష్కరింపచేస్తున్న కాలం. ఈ రెండింటి మధ్య కవులు, రచయితల ఆలోచనలు. ఆ కోణాలే రావిశాస్త్రికి చాలా ఉపయోగపడ్డాయి అని భావించవచ్చు. మానవ జాతి అంతా ఒకటే అనే విషయంలోనూ, ప్రపంచంలోని ఏ మారుమూల ప్రాంతంలో ఎవరికి ఏ కష్టం కలిగినా, ఏ ప్రాంతపు ఎక్కడి కవి ఐనా స్పందిస్తాడనే విషయంలోనూ కవుల్లో,






రచయితల్లో గట్టి విశ్వాసం ఏర్పడి ఉంటుంది. ఆధునిక యుగంలో వున్న వివిధ రాజకీయాలు, సామాజిక, నైతిక విలువలు మనిషిని మరింత బలంగా తయారు చేశాయి. అందుకే రావిశ్రాస్తి తను ఎక్కడ పుట్టాడో అక్కడి ప్రజల సమస్యలను తన సమస్యలుగా, తనే పరిష్కర్తగా భావించి ముందుండి నిలిచాడు,

తెలుగు నవలా ప్రపంచంలో విజయవంతమైన, ప్రయోగాత్మక నవలల్లో రావిశాస్త్రి రచించిన అల్పజీవి గొప్పది. ఎంతోమందికి ఆదర్శమైన నవల. జేమ్స్ జాయిస్ ఆవిష్కరింపచేసిన **"చైతన్య స్రవంతి"** ధోరణిని అలవర్చుకొని, ఆ లక్షణాలతో తెలుగులో వచ్చిన మొదటి నవల అల్పజీవి. ఈ నవలల్లో జేమ్స్ జాయిస్ రచనా పద్ధతిని పూర్తిస్థాయిలో అనుసరింపచేసిన రచయిత రావిశాస్త్రినే. ఈ రచనతోనే తను నవలా రచయితగా గుర్తింపు పొందాడు. ఈ గుర్తింపుతోనే తర్వాత రాజు మహిషీ, రత్తాలు–రాంబాబు, ఇల్లు అనే నవలల్ని రాశాడు. కానీ, గొప్ప నవలగా మాత్రం అల్పజీవి ప్రజాదరణ పొందింది.

సమకాలీన పరిస్థితుల్లో వచ్చిన వివిధ చట్టాలు, వాటి వల్ల ఏర్పడిన అనేక విపరిణామాలను వస్తువు చేసుకొని రావిశ్రాస్తి కథలు రాశాడు. ఆయన రాసిన **"ఆరుసారా కథలు"** తెలుగు కథా సాహిత్యంలో ఒక విప్లవాన్ని సృష్టించి అందరిని ఆలోచింపచేసాయి. ఆ కోణంలోనే వారు రాసిన మరొక కథలు సంకలనం **"బాకీ కథలు".**

**బాకీ కథలు : పరిశీలన**

ఈ కథలు 1967 నుండి 1970 మధ్య కాలంలో రాయబడినవి. బాకీ కథల్లో **"పిపిలీకం, వెన్నెల, పక్కింటి అబ్బాయి, బుద్బుదం, తప్పు, జాతక కథ, పాతదే కథ, బెదురు, షోకుపిల్లి, వేతనశర్మ కథ, ద్వైతాద్వైతం, రవ్వ"** లాంటి 12 కథలు ఉన్నాయి. కొన్ని కథలు ఒకరకమైన అంశాలను ప్రధాన వస్తువుగా తీసుకొని రాస్తే, మరికొన్ని

కథలు తాత్త్విక కోణంలో రాశారని అర్థమౌతుంది. ఈ పత్రంలో బాకీ కథల్లో **"తాత్త్విక కోణాలు"** తో రాయబడిన ప్రధాన కథలను మాత్రం విశ్లేషణకు తీసుకోవడం జరిగింది. ఫ్రెంచి కవి "పాల్ వాలెరీ" అన్నట్లు **'మన కలలు నిజం కావాలంటే మనం ముందుగా చేయాల్సిన అత్యుత్తమపని మేలుకోవడమే'** అని అంటాడు. ఈ కథల్లో రావిశాస్త్రి కూడా ముందుగానే మేల్కొని, మిగిలిన వారిని నిద్ర లేపిన తరుణం చాలా గొప్పగా కనిపిస్తుంది. అధికార గర్వానికి ధనమదం తోడైతే పై వర్గం వారు ఎటువంటి దుర్మార్గాలు చేయగలరో అనే భావాల్ని కండ్లకు కట్టినట్లు ఈ కథలో చూపిస్తాడు.

**కొన్ని కథలను పరిశీలిస్తే...**

**పిపీలికం :**

ఈ కథలో ప్రధాన పాత్ర చీమది. చీమ పూర్వం కృతయుగంలో, ప్రజాపతి రాజుగా ఉన్నప్పుడు గౌతమీ నదికి ఉత్తరంగా శ్యామవనం అనే అడవిలో ఓ పెద్ద మర్రిచెట్టు ఒకటుండేది. అక్కడ పెద్ద చీమల పుట్ట ఉండేదట. అందులో నివసించే చీమకి **"ఒకనాడు ఉన్నట్టుండి తనెవరో ఏమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగిందట"** (బాకీ కథలు. పుట:13) అలా కథలో తనెవరో తెలుసుకోవాలనే కోరికతో ఈ కథ మొదలవుతుంది.

చీమ చాలా తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చుంటుంది. ఇంతకు ఈ భూమ్మీద తనెవరో! నేను కళ్లనా, తలనా, మొండేన్నా? ఎవరు నేను? నేను తినే తిండినా? నేను ఆలోచించే శక్తి నా? ఎందుకు పుట్టాను? ఎందుకు జీవిస్తున్నాను? ఎందుకు చస్తాను? చచ్చి నేనేమవుతాను? ఎవర్ని, నేనెవర్ని? అంటూ పరిపరి విధాలుగా ఆలోచించడం మొదలపెడుతుంది. అలా ఆలోచిస్తున్న చిరుచీమ దురవస్థ చూసి, దానికి మరొక చీమ **"ఒరే సోదరా అంతు చిక్కని ఆలోచనలతో ఎందుకలా తల బద్దలు కొట్టుకుంటావు? అలా చేసుకొనేదానికి మారుగా అనుభవశాలి నెవరినైనా అడిగి చూడకూడదా? నే చెప్పేమాట విను. ఇక్కడికి మూడు ఆమడల దూరంలో గోపన్నపాలెం అనే గ్రామం ఉంది. అక్కడ నిగమశర్మ అనే బ్రాహ్మణుడున్నాడు. నీ ప్రశ్నలన్నింటికీ ఆయన సమాధానం చెప్పగలడేమో వెళ్లి అడుగు. అలా చెయ్యి!"** అని హితబోధ చేస్తుంది.

ఆ హితబోధ విని ఆనందించిన చిరుచీమ దూర ప్రయాణం చేసి గోపన్నపాలెం నిగమశర్మను చేరుకుంటుంది. చీమను చూసి నిగమశర్మ **"ఏమిరా పిల్లవాడా! ఎందుకొచ్చేవు? నీకు నాతో ఏమి పనుంది"** అని అంటాడు. **'స్వామీ! నేనెవర్ని ఎందుకు పుట్టేను? ఎందుకు బతుకుతున్నాను? ఎందుకు ఛస్తాను?'** అని సవినయంగా ప్రశ్నించి తన రాకకు కారణం కావాలంటుంది చీమ. **'మానవేతర జీవుల్లో జాతి బేధప్రమేయం లేదు కాబట్టి ఈ చీమకి చదువు చెప్పి నాలుగు నూకలు లాగొచ్చుకదా'** అని చాలా సంబరపడ్డాడు. అంతే కాకుండా నువ్వు తెలుసుకోవాలనే విషయాలన్నీ తెలుసుకోవాలంటే చాలా చదువుకోవాలే అని అంటాడు. వెంటనే చీమ మాత్రం ఆ చదువే మీరే చెప్పాలి అని అంటుంది. అలాగే చెప్తాను కానీ, ప్రతి రోజు నాకు ఓ గిద్దెడు నూకలిస్తే...పాటలు చెప్తాను అని చెప్పకనే తన యథార్థపు కోరికను తెలియజేస్తాడు. దానికి చీమ సరే అని చెప్పి ప్రతిరోజు గురువుకి గిద్దెడు గింజలు సమర్పించి చదువు నేర్చుకుంటుంది.

నిగమశర్మ తనకు వచ్చినంత వరకు చదువు చెప్పి చివరి రోజు పిలిచి **'నువ్వెవరో నీకిప్పుడు తెలిసిందా? అని అడిగితే... నేనెవర్ని స్వామీ! తొందరగా చెప్పండి'** అంటూ అడుగుతుంది. దానికి గురువు గారు **"మరెవరివీ కావు! నువ్వు చీమవి!!"** అని అంటాడు. ఆ సమాధానానికి పరమానందభరితురాలై వెళ్ళిపోతుంది.

చీమకు ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలువలేదు. మళ్ళీ చీమంటే ఏమిటి? కళ్లా, కాళ్లా, తలా, మొండెమా?...కాళ్లు లేకపోతే నేను చీమని కానా? కళ్లు లేకపోతే నేను చీమకంటే భిన్నమవుదునా? చీమ అనే ఈ పదార్థం ఎందులో ఉంది? ఇది ఇలాగే ఎందుకు పుట్టాలి? ఇది ఇలాగే ఎందుకు బతకాలి? ఇలాగే ఎందుకు చావాలి?... అనే చిక్కు ప్రశ్నలన్నీ చీకాకు పెడుతుంటాయి. చీమ వెంటనే పాత గురుశర్మ దగ్గరికి పరిగెట్టుకుంటూ వెళ్ళి తన సందేహాలన్నీ నివృత్తి చేయమని పాదం పట్టుకొని ప్రార్థిస్తుంది. దానికి నిగమశర్మ ఆ జ్ఞానమే నాకుంటే నీ సందేహాలన్నీ తీర్చేవాడిని, కాబట్టి నువ్వు **'జన్నాలపల్లె అనే గ్రామంలో ఉండే చతుర్వేది అనే సద్బ్రాహ్మణుడ్ని'** కలువు అని సలహా ఇస్తాడు.

దాంతో ఆ చీమ వెంటనే వెళ్ళి చతుర్వేదిని కలిసి నిగమశర్మ నుంచి తెచ్చిన పరిచయపత్రం చూపిస్తుంది. వెంటనే ఆ పండితుడు **"అయితే వేదాలన్నీ తెలుసుకోవాలనుందా నీకు?"** అని చీమని అడుగుతాడు. వెంటనే చీమ **'తమరు అనుగ్రహిస్తే తెలుసుకోగలను'** అని అంటుంది. చతుర్వేది తన శిష్యులతో ఈ విషయం గురించి చర్చలు జరిపి సద్బుద్ధి కలవాడే సద్బ్రాహ్మణుడు. అటువంటి వాళ్ళే దీనికి అర్హులు అని చెప్పి...చీమను శుద్ధి చేసి బ్రాహ్మణంలోకి మార్చుకుంటారు. వెంటనే గురుకట్నం తీసుకునే అలవాటు లేకపోయినా, యజ్ఞం చేయిదలిచాము కాబట్టి నీకు ఎంత తేగలిగితే అంతే తే! చాలు!! అని చాలా సౌమ్యంగా చెప్తాడు. అధ్యయనం అంతా అయిన పిమ్మట చతుర్వేదిగారి వల్ల వేదసారం అంతా ఒకే ఒక మాటలో ఉన్నదని తెలుసుకున్నది చీమ. అదేమిటంటే **'సోహం'** అన్నారు చతుర్వేది గారు. అంటే ఏమిటి స్వామీ! అని అడిగితే.. వెంటనే గురువు చదువైపోయిందంటాడు.

మళ్ళీ శ్యామవనం చేరుకున్న 'పిపీలికం' జీవితంలో తేడా ఏమీ కనిపించక పోయేసరికి కృంగిపోతుంది. వెంటనే మరొక చీమ తన

పరిస్థితిని చూసి 'ఋషుల' గురించి చెప్తుంది. వెంటనే ఆ ఋషిని కలువడానికి వెలుతుంది. చీమ ఋషిని కలుసుకొని తన విషయాలన్నీ తెలియజేస్తుంది. వెంటనే **"బ్రహ్మజ్ఞానం విని విని సాధించేనంటే లాభం లేదు చీమా! సోహం! అనేది అందరికి తెలుసు. దాన్ని యోగంలోనే సాధ్యపడుతుంది. తద్వారా జన్మరాహిత్యం సంపాదించి మోక్షం పొందడమే ఏ జీవికైనా గమ్యం! తపస్సు వల్ల అది సిద్ధిస్తుంది"** అని అంటాడు. మళ్ళీ చీమకు అనేక సందేహాలు... ఋషి మాత్రం సమాధానం చెప్పకుండానే మౌనముద్రలోకి వెళ్ళిపోతాడు. తిరిగి పిపీలికం శ్యామవనం చేరుకుంటుంది.

శ్యామవనంలో ఏదో ఆపద వచ్చినట్టుందని గమనించి తన మిత్రులని అడుగుతుంది. వెంటనే వాళ్ళు **'ఎవడో రాక్షసుడు మన యింట్లో ప్రవేశించేడు'** అన్నారు. తన చదువునంతా ఉపయోగించి మిగిలిన వారికి ధైర్యం చెప్పి ఒంటరిగా పుట్టలోకి వెళ్తుంది. **"ఓయీ! ఎవరు నీవు? మా యింట్లోకి మా అనుమతి లేకుండా ఎందుకిలా వచ్చేవు? అది అక్రమం కాదా? అన్యాయం కదా? మాకు అపకారం చేయడం నీకు న్యాయమేనా?"** అని చెపుతుంది. వెంటనే ఆ రాక్షసుడు **'నేను సుఖభోగిని. నీ పాలిట మాత్రం కాలయముణ్ణి'**. ఇలా అనేక మాటలు ఆ రాక్షసుడు చీమకు చెపుతాడు. గురవుల ద్వారా నేర్చుకోలేని జ్ఞానాన్ని కూడా రాక్షసుడి ద్వారా సాధించి, చివరికి తన స్నేహితులతో కలిసి రాక్షసుడ్ని చంపడంతో కథ ముగిస్తుంది.

**తప్పు :**

ఈ కథలో ప్రధాన పాత్రలు శ్రీకంఠరావు గారు, రావు కూతురు శ్రీలక్ష్మీ, డాక్టర్ మూర్తి, రైతు దాసు గార్లు. జీవితంలో జరిగే అనేక తాత్త్విక కోణాలను ఈ కథ అద్భుతంగా చిత్రీకరిస్తుంది.

శ్రీకంఠరావు జీవితంలో అనేక కష్టాలు పడుతుంటాడు. రాత్రి, పగలు తేడా లేకుండా తన చేసే ప్లీడరు వృత్తిలో నిమగ్నమౌతాడు. అప్పుడు తన కూతురు శ్రీ లక్ష్మీ **"ఇప్పుడు రాత్రి పదిగంటలయిందని నీకు తెలుసా నాన్నా? నువ్వింకా భోజనం చెయ్యలేదని కూడా నీకు తెలుసా?"** అని ప్రశ్నిస్తుంది. అప్పుడు రావుగారు **"డబ్బు కావాలంటే పనిచెయ్యాలమ్మా? నీకు పెళ్లి చెయ్యాలంటే డబ్బు కావాలమ్మా? డబ్బు కోసం మరి నేను కష్టపడాలి కదమ్మా?"** అంటూ కూతురుతో చెప్తాడు. ఇలా పనిలో ఉండగానే ఒక యువకుడు, అతనితో పాటు ఒక ఆడమనిషి రావు దగ్గరికి వచ్చి నమస్కరించి తన విషయాన్ని అంతా చెప్తారు. ఆ విషయం విన్న రావు గారు **"ఏమో? ఏం చేశారో! మీ వాడి మీద పెట్టిన కేసుమాత్రం ఖూనీకేసు! ఖూనీకేసంటే మామూలు న్యూసెన్స్ కేసుకాదు. పావలకీ అర్ధకీ చెయ్యడానికి"** అని అంటాడు రావు. వచ్చిన వాళ్ళు ఇంత, అంత ఇస్తామని బతిమాలుకుంటారు. అయినా కానీ రావు వినలేదు. చాలాసేపటికి వాళ్ళు అక్కడి నుండి వెళ్ళిపోతారు. వాళ్ళు వెళ్ళడం చూసి **"మళ్లీ




వాళ్లే వస్తారు"** అనే ధీమాను తన కూతురు దగ్గర వ్యక్తం చేస్తాడు. కూతురు మాత్రం –

**"అది కాదు నాన్నా,**
**ఏవిటి కాదు తల్లీ?**
**వాళ్లు నిజంగా లేనివాళ్లేనా?**
**లేనివాళ్లలాగే కనిపిస్తున్నారు**
**డబ్బు లేని వాళ్లని అంత డబ్బు రొక్కించి అడగడం తప్పు కదా? నాన్నా?**
**తప్పే ఏం? ఇస్తే ఇస్తారు. ఇవ్వకపోతే ఇంకోడి దగ్గరికి పోతారు.**
**నువ్వు తెలివైన లాయరువి కదా అని వచ్చేరు కదా పాపం! అంది శ్రీలక్ష్మి చాలా జాలిగా.**

**నా తెలివితేటలు వాడుకోవాలంటే నా రేటు నాకు ఇవ్వాలమ్మా! నేను ఎవ్వర్నీ అన్యాయం చెయ్యలేదు. ఎవరి సొమ్మూ కూడా నేను పడేసుకోడం లేదు. వాళ్లకి పనికొచ్చే తెలివితేటలు నాకు మాత్రం ఇచ్చేడు భగవంతుడు. దానికి నేను ఖరీదు ఇంత అని కట్టివుంచాను. అందులో తప్పేంవుంది చిన్నారీ. బజార్లో బనారసు చీర ఖరీదు ఆరువందలు! కొనగలిగితే కొంటావు లేకపోతే, ఇంకోచోటుకి పోయి ఇంకో చీరె కొనుక్కుంటావు అలాగే ఇదీను!..."** (పుట:49) అని రావు తన కూతురితో చెప్పేసరికి అది సరైనది కాదని శ్రీలక్ష్మికి అనిపిస్తుంది.

రోజులు గడిచిపోయాయి. ఒకరోజు డాక్టర్ మూర్తి గారు తన పనిని ముగించుకొని ఇంటికి వస్తాడు. తనకు 30 సంవత్సరాలు ఉంటాయి. తన భార్య చాలా అందంగా ఉంటుంది. ఆమె పేరు శ్రీలక్ష్మి. ఈమె లాయరు కూతురు. వీరికి వివాహం జరిగి తొమ్మిది సంవత్సరాలు. మూర్తికి అదృష్టం బాగుండి శస్త్ర చికిత్సలో అఖండుడని పేరు సంపాదించుకున్నాడు. జనాల్లో కూడా **"అతను డబ్బు ఎంత కరెక్ట్‌గా తీసుకుంటాడో పనికూడా అంత ఖచ్చితంగా చేస్తాడని అందరికీ బాగా తెలుసు"** (పుట:50)

ఒకరోజు భార్యతో భోజనానికి కూర్చుంటారు. వెంటనే ఇంటిలోకి రోజు కనిపించే ఒక ఛాయ ఎదురుగా కనిపిస్తుంది.

బాబు గారు మీ కోసం పేషెంటొచ్చాడని అని చెప్తుంది. **"భోజనం చేస్తుంటే పేషెంట్ల సంగతి చెప్పొద్దని నీకెన్నిసార్లు చెప్పేను? పేషెంట్లొస్తే నేను భోంచేసేదాకా కూర్చోమని చెప్పలేవూ! ఇడియట్!"** అని కసురుకుంటాడు మూర్తి డాక్టరు. భార్యతో వెంటనే నవ్వుతూ సమాధానం చెప్తాడు. ఆ నవ్వే తన భార్యకు అర్థమవ్వదు. ఇలా ఎలా ఉండగలవు అని భార్య అడిగిన ప్రశ్నకి డాక్టర్ మూర్తి **"క్రిందివాళ్లతోనూ మనవాళ్లతోనూ ఒక్కలా ఎలా ఉండగలం లక్ష్మీ? కింది మనుషులతో కర్కోటకంగా హెర్ హిట్లర్లా వుండకపోతే లాభం లేదే. తినేరు మనల్ని? మనవాళ్లతో ఒకలా వుండాలి. వాళ్ళతో ఇంకోలా ఉండాలి. మన లెవిల్ వేరు వాళ్ళ లెవిల్ వేరు. తక్కువ్వాడి దగ్గర మన ఎక్కువతనం చూపించకపోతే వాడు మనకంటే ఎక్కువ్వాణ్ననుకుంటాడు. అందుచేత మనం ఎవరి లెవిల్లో వాళ్లని ఉంచాలి. నా పాలసీనే అది"** అంటూనే వచ్చిన వాళ్ళను కలుస్తాడు. వాళ్ళని చూడగానే శ్రీలక్ష్మి, వీళ్ళను ఎక్కడో చూసినట్టే ఉందని మనసులో అనుకుంటుంది. వచ్చిన వారిలో ఒక యువకుడు మా అమ్మను కాపాడండి, మీరే దిక్కు అని ప్రాధేయపడతాడు. డాక్టర్‌కి గ్రామ వైద్యుడు రాసిచ్చిన చీటీ చూపిస్తాడు. అది చూసి నేను మీ అమ్మకు వైద్యం చేయలేను, అంతేకాకుండా నువ్వు నా ఖరీదిచ్చుకోగలవా? ఇచ్చుకోలేవు. కాబట్టి వెంటనే జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్ళు అని చెప్పి వాళ్ళని పంపిస్తాడు. కానీ తన భార్య మాత్రం అయిష్టంగానే ఎందుకు వాళ్ళను పంపిచావు అని అడుగుతుంది. దానికి రకరకాలైన సమాధానాలు ఇస్తూ చివరగా ఇలా అంటాడు. **"నాకు దేముడు ఓ రకం శక్తి ఇచ్చేడు. ఆ శక్తిని నేను నా ఇష్టం వచ్చినంత ఖరీదుకి నా ఇష్టం వచ్చిన వాళ్లకి అమ్ముతాను. ఇందులో అన్యాయం, అధర్మం అటువంటివేమీ లేవు. తెలిసిందండీ మేడమ్, లాయర్ శ్రీకంతరావుగారి అమ్మాయివయ్యుండీ కూడా ఆపాటి లాజిక్ తెలుసుకోలేదా నువ్వు?"** (పుట:54) అని నవ్వుతూ డాక్టర్ మూర్తి గారు వెళ్ళిపోతాడు. వెంటనే డాక్టర్ మూర్తి మరొక ప్రయాణానికి సిద్ధమవుతాడు.

వర్షం ఎడతెగక కూరుస్తుంటుంది. దాసుగారి దగ్గర పాలేరుగా నరసయ్య పనిచేస్తాడు. ఆ వర్షానికి పందిరికింద ఉండిపోయిన పశువులు గుర్తు వచ్చి నరసయ్యతో చెప్తాడు. చిత్తం అంటూనే నరసయ్య ఆ వర్షంలో వెళ్తాడు. వర్షంలో బాగా తడిసిపోయి, చలికి ఒణికిపోతాడు. ఆ చలికి నరాలు తోడేస్తుంటాయి. **"ఆ సమయంలో నరసయ్య దేని గురించి ఆలోచిస్తున్నాడు? ఖూనీ కేసులో ఇరుక్కుని జెయిల్లో చచ్చిన తండ్రి గురించా! సమయానికి సరైన వైద్యుడి సహాయం చిక్కక చనిపోయిన తల్లి గురించా? అమ్ముడయిపోయి అపహరింపబడిపోయి పరహస్తాల్లోకి పోయిన తన బీడు భూముల గురించా? బుగతగారి పొలాల్లో కూలికాపు చేసే తన భార్యా పుత్రులు గురించా? ముక్కు చెక్కలయిపోయిన తన మొత్తం బతుగ్గురించా? చీకాకు పరిచే చినుకులు గురించా? గజగజలాడించే గాలిగురించా?"** (పుట:56) ఇలా దేని గురించి ఆలోచించుకుంటూ పశువుల్ని రోడ్డు దాటిస్తుంటాడు. ఏదో ఒక శబ్దం...తెలియని శబ్దం...

నరసయ్య వెంటనే చీకట్లో దెయ్యంలా ఏదో పడుంది. దాని కడుపులోంచి బైటికి రావడానికి ఓ మానవకారం గిజగిజ లాడుతుందనే విషయం తెలుసుకొని, తన చేతిలో ఉన్న గొడుగు విసిరేసి పరిగెట్టాడు. వెంటనే బేట్రి దీపం తెచ్చి చూస్తాడు. కారు చాలా అసహాయంగా వెల్లకిలా పడిపోయిన తీరు కనిపిస్తుంది. ఆవేమీ పట్టించుకోకుండా వాళ్ళను బయటికి తీయడానికి ప్రయత్నిస్తాడు. అందులోనుండి ఒక ముసలిమనిషి పైకి వస్తాడు. వెంటనే స్పృహ తప్పిపోయి ఉన్న ఆవిడను బయటికి లాగుతాడు. ఆమె నోటి నుండి వెంటనే 'అయ్యో ! అయ్యో!' అని మాటలు వస్తాయి. ఆ ముసలాయిన వాళ్ళ నాన్నగారని నరసయ్య అర్థం చేసుకుంటాడు. తన భర్త గురించి ఆలోచిస్తుంది. వెంటనే నరసయ్య ఒదిగిపోయిన కారు నుండి మెల్లగా బయటికి తీస్తాడు. అతను ఇంకా మరణించలేదు. అక్కడి నుండి దూరంగా తీసుకెళ్ళి రోడ్డు ప్రక్కన ఉన్న పాకలో పడుకోబెట్టి **"చావు బతుకుల మధ్య ఉండవచ్చేమో గాని ఇంకా బతికే ఉన్నాడు. బతకవచ్చు కూడాను"** అని అంటాడు నరసయ్య.

**"మిమ్మల్ని నేనెందుకు రక్షించాలి? మీ చావుబతుకుల మధ్య దూరి నలిగి మిమ్మల్ని బైటికి బతుకులోకి నేనెందుకు లాగి మీకు సాయపడాలి? మీకు నేను సాయపడను. మిమ్మల్ని ఛస్తే రక్షించను. ఈ సమయంలో నేను తప్ప మీకు మరో దేవుళ్లేడు. మనిషి లేడు. మిమ్మల్ని రక్షించే శక్తి ఇప్పుడు ఇక్కడ నాకుంది. మీ ఇళ్లు, మీ మేడలు, మీ ధన కనక వస్తు వాహనాలు, మీ సంసారాలు కడిగేసి ఊడ్చేసి మీ మాన ప్రాణాలతో సహా మీ సర్వం సమస్తం నాకు సమర్పిస్తారా, సమర్పిస్తేనే సాయం చేస్తాను. లేకపోతే చెయ్యను. నా శక్తికి నా యిష్టం వచ్చిన విలువ కట్టుకుంటాను. అదిస్తేనే మీకు నా సాయం.! లేకపోతే లేదు! అవునంతే! నేనేం తప్పు చేసేను? నేనేం తప్పు చెయ్యలేదు! మీరు నా విలువ నాకివ్వలేరా? ఇవ్వలేకపోతే ఊళ్ళోకి వెళ్లి ఇంకోణ్ని తెచ్చుకోండి"** (పుట:59) అని నరసయ్య మనసులో ఆలోచనలు వస్తే తప్పు కదా అని అనుకుంటాడు.

ఉదయం వచ్చి మరొక డాక్టరు వాళ్ళను చూసి ప్రమాదం ఏమీ లేదని చెప్తాడు. ఈ కుటుంబం తిరుపతి నుండి తిరుగు ప్రయాణంలో ఈ సంఘటన జరిగిందని లాయర్ రావు చెప్తాడు. ఆ వెంకటేశ్వరుడి రూపంలో నరసయ్య వచ్చి మిమ్మల్ని కాపాడినాడు. శ్రీలక్ష్మి, శ్రీకంతరావు కారెక్కబోతూ చుట్టూ ఉన్న జనాన్ని పరికించి నరసయ్య దగ్గర వచ్చి నిజంగా ఏడుస్తూ తన కృతజ్ఞత తెలియజేస్తాడు. నిజంగా మేము నీ ఋణం తీర్చుకోలేమని చెప్పి, నీకేం కావాలో చెప్పు, ఇవ్వగలిగినదేదైనా ఉంటే ఇస్తాను అంటాడు.

ఊరి జనం, దాసు మొదలైన వాళ్ళు నరసయ్య వైపు కుతూహలంగా చూస్తారు. కానీ నరసయ్య ఏమీ అడగకుండా అక్కడి నుండి వెళ్ళిపోతూ, పోయిన తండ్రిని ఇవ్వగలరా? చచ్చిన తల్లిని ఇవ్వగలరా? మసిగా మారిన బంగారపు బతుకివ్వగలరా? ఏమివ్వగలరు...ఏమివ్వగలరు...అంటూ అనడంతో కథ ముగిస్తుంది.

తాత్త్విక కోణంలో భిన్నమనస్తత్వాలకు ప్రతీకగా ఈ రెండు కథలు విభిన్నంగా బాకీ కథలు సంకలనంలో కనిపిస్తాయి.

**బాకీ కథలు – తాత్త్విక అన్వేషణ**

**"ఒక మనిషి గొప్పవాడు కాకపోయినా స్వతంత్రుడై ఉండగలడు. కాని ఏ మనిషీ స్వతంత్రుడు కానిదే గొప్పవాడు కాలేడు"** అని ఖలీల్ జిబ్రాన్ అన్నాడు. రావిశాస్త్రి రాసిన పిపిలీకం కథలో ప్రధానంగా ఇదే కనిపిస్తుంది.

తన పుట్టుకను, తనెందుకు పుట్టానో, ఎందుకు చావాలో, ఈ పుట్టుకకు చావుకు మధ్య నేనేంటే అనే తాత్త్విక ప్రశ్నలతో అతలాకుతలం చేసిన పిపిలీకం వ్యవస్థలో అనేక విషయాలను తెలుసు కుంటుంది. కొన్నిచోట్ల సహాయం చేసేవాళ్ళు కొందరుంటే, మరికొందరు స్వార్థంతో ఆశించే వారు కొందరు. ప్రపంచం అనే చక్రంలో ఒకరి నుండి మరొకరికి వెళ్ళడమనేది సహజం. అది తెలిసి కూడా మనిషి మారడం లేదని తెలుపుతూనే, చివరికి ఐకమత్యమే గెలుస్తుంది.

ఈ కథ రాసేనాటికి దేశంలో, రాష్ట్రంలో నక్సల్బరీ ఉద్యమ ప్రభావం ఒకటైతే, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, గిరిజన రైతాంగ పోరాటాలు జరుగుతున్న తరుణం. ఈ కథలో ప్రధానంగా అటువంటి పోరాటాలు కనిపించకపోయినా, పిపిలీకం నేర్చుకున్న జ్ఞానంతో చివరికి రాక్షసుణ్ణి వధించిన తీరు వీటిని ప్రతిఫలనం చేస్తాయి. పిపిలీకం లేవనెత్తిన ప్రశ్నలు:

1. నేను ఎవరు? 2. చీమ అయితే ....ఎందుకు పుట్టాలి.... ఎందుకు మరణించాలి? ఈ రెండింటి మధ్య భేదం ఏమిటి? 3. జ్ఞానం అంటే...చదువు ద్వారా వస్తుందని భావించినా...చివరికి మోక్షం అంటే ఏమిటి అనే స్థాయికి చేరుకోవడం. వేదాల సారం 'సోహం' అంటే ఏమిటి...దానికి పునాది ఏమిటి...? 4. చివరికి తన మిత్రులకు సమస్య వస్తే తనే ముందుండి పోరాటం సాగించడం...ఇలా ఈ కథలో అనేక కోణాలు కనిపిస్తాయి.

వ్యవస్థలో మంచివారు, చెడ్డవారు ఉన్నట్టుగానే, మంచి వాళ్ళలో కూడా తెలివైన మంచివారు, తెలివైన చెడ్డవారు ఉంటారు. అలాగే చెడ్డవారిలో కూడా, తెలివైన చెడ్డవారు, తెలివిలేని చెడ్డవారు ఉంటారు. తెలివైన వారెప్పుడూ భావోద్వేగాలకు లోను కారు. తెలివి లేని వారే ఆనందంలో వాగ్దానాలు ఇచ్చేస్తుంటారు. విషాదంలో నిర్ణయాలు తీసేసుకుంటారు. ఆ తరువాత అవతలి వారు మోసం చేసారని



లబోదిబో మంటారు. వీరు గతం నుంచి నేర్చుకోరు సరికదా, నిరంతరం ఫిర్యాదులతో, తిట్లతో, విమర్శలతో, శాపనార్థాలతో ఉన్న జీవితాన్ని కూడా దు:ఖంతో వృథా చేసుకుంటారు. మనిషికి వివేకం వస్తేనే కానీ, తనకు కావలసినట్టు జీవించలేడు, ఒక అందమైన భవిష్యత్ సృష్టించలేడని కోణం పిపిలీకం కథలో రావిశాస్త్రి తెలుపుతున్నాడు.

"తప్పు" కథలో లాయర్ తన జ్ఞానానికి ఒక ధర ఉంటుందని చెప్తాడు. మరొక సన్నివేశంలో డాక్టర్ మూర్తి కూడా అదే బాటలో దేవుడు నాకు ఇచ్చిన జ్ఞానానికి ఒక రేటు ఉంటుందని చెప్పి, సహాయం చేయగల స్థితిలో కూడా సహాయం చేయాలని దౌర్భాగ్యులుగా కనిపిస్తారు. వీరి ద్వారా ఎవరైతే సహాయం పొందాలనుకున్నరో చివరికి వీరికి ప్రాణదాతగా నిలుస్తాడు. ఒకాయన జీవితాలనే మార్చగలడు, మరొకతను జీవితమే ఇవ్వగలడు... కానీ, వారికి రేటు అడ్డువచ్చింది. నేటి మన వ్యవస్థలో జరుగుతున్న తరుణాలు ఇవే. 50 సంవత్సరాల క్రితమే నేటి విషయాన్ని పసిగట్టిన రచయిత తాత్త్వికత ఎంతో గొప్పది. చరిత్రలో ఒకరి జ్ఞానం మరొకరికి రిఫరెన్సు మాత్రమే తప్ప, అదే పరిపూర్ణమైన జ్ఞానం మాత్రం కాదని ఈ కథలో చెప్తాడు.

మూర్ఖులను మార్చలేము అనుకున్నప్పుడు, వాళ్ళకు దూరంగా ఉండడమే మేలు. మార్చలేని వాటిని అంగీకరించడం, అంగీకరించ లేని వాటిని మార్చడం ఒక్కటే మనం చేయగల వివేకవంతమైన కర్తవ్యం. మన పరిస్థితులను మనం ఎంచుకోలేకపోవచ్చు కాని వాటికి ఎలా ప్రతి స్పందించాలనేది మనం ఎంచుకోవచ్చు. జీవితంలో ఎప్పుడు, ఏ పరిస్థితి ఎదురైనా ఎంపిక చేసుకునేందుకు మూడు అవకాశాలుంటాయి, అవి.

1. మార్చటం 2. అంగీకరించడం 3. వదిలివేయడం. ఈ మూడింటిలో ఏదో ఒకటి చేయకపోతే వాళ్ళు మనల్ని వదిలి వెళ్ళే అవకాశం లేదు. కాబట్టి ఆమోదించలేనివాటిని మార్చేయాలి. మార్చలేనివాటిని ఆమోదించాలి. రెండూ చేయలేకపోతే వదిలేయాలి. చివరకి మంచితనమే విజయం సాధిస్తుంది. ఇదే జీవన సత్యం. చరిత్రలో ఇది నిలుస్తూ వచ్చింది. చేదు అన్నదే కొన్నాళ్ళు జయించినా, చివరికి వెలగు రేఖలే తర్వాత నిలిచి వెలిగిందనే సత్యాన్ని గమనించాలి. తప్పు కథ సారాంశం కూడా ఇదే.

# పద్యమే చిరునామా





ఈ అక్షరాలు
గదిలో చదివితే
ఒక రకంగా వుంటాయి.
బయట ఆకాశం కింద
మరోవిధంగా.
చలనంలో
అంటే బస్సులో కూచొని
చదివితే కొత్తగా.

ఎప్పటినుంచో చదువుతున్న
వాక్యాలే ఇవి
ఇవాళ
అన్వయ అపూర్వంగా
అర్థాలూ అంతే
అప్పుడు తోచనివి
ఇప్పుడు మెరుపుల్లా స్ఫురిస్తాయి.

ఈ పద్యం అతనిదే
అతడు మరణించినా
అతని పద్యమే.
ఎన్నిసార్లు చదివినా
ఎన్నిసార్లు మననం చేసినా
పాతబడదు.

అతని ఇంటి చుట్టూ తిరుగుతున్నాను
అతనిప్పుడు లేకున్నా
మరొకరు నివసిస్తున్నా
ఇప్పుడు కూడా అతని ఇల్లే.
ఆ గదిలో ప్రవేశిస్తే
ఏదో ఊపిరి వెచ్చగా తగుల్తుంది.

కేవల స్పందన కాదు
వొట్టి భావుకత కాదు
అది జీవితం
కాలావధులు దాటి
వర్తమానం లోకి
ప్రవహించే గతాగతం.

**డా. ఎన్. గోపి, ఫోన్ : 939 102 8496**

డబ్బు విజయం సాధించలేకపోచ్చు, డబ్బు ప్రాణం కూడా ఇవ్వకపోవచ్చు, కానీ మంచిహృదయం మాత్రం అందరికి ఉపయోగపడుతుంది. డబ్బు డబ్బు అంటూ ...నాకో రేటు అంటూ అనుకున్న లాయర్లు, డాక్టర్ చివరికి పేదవాడి కుటుంబంలో ఆనందం నింపలేకపోయినా, తనకు ఆ అవకాశం వచ్చిన తన బయటికి మాత్రం నాకు ఓ రేటు ఉందని, అది ఇస్తేనే మీ ప్రాణాలు కాపాడుతూ అని మాత్రం అనలేకపోయాడు. పేదవాడి గొప్ప హృదయమే ఈ ప్రాణాలను కపాడింది. ఇదే గొప్ప తాత్త్వికత. అందుకే పైన అనుకున్న మూడు విషయాలో నరసయ్య మూడోదాన్ని "వదిలివేయడం" అనే దాన్ని తీసుకొని వాళ్ళ ప్రాణాలను కాపాడి అక్కడనుండి మౌనంగా వెళ్ళిపోవడమనేది ప్రపంచస్థాయిలో పేదవాడి మనస్సుకు కిర్తీకిరీటాన్ని సాధించిపెట్టింది.

చివరగా **"రావిశాస్త్రి ఈ దేశపు ఈ కాలపు మేధావివర్గం బ్రహ్మరథం పట్టించుకోగల రచయిత. ఆయన కథలు చదివాక చదవకముందున్న స్థితిలో ఉండగలవాడు పరమజడుడై ఉండాలి. ఆయనలో ప్రచారగుణం ఉన్నది. పాఠకుణ్ణి కాలరు పట్టుకుని నిలవేసే లక్షణం ఉంది. నూతన ప్రయోగాలు చేసే సమర్థత ఉంది. మధ్య తరగతి పునాదులు కదిలించడానికి ప్రతి కథా ఉపయోగపడుతుంది. ఇలాంటి డైనమెట్ రావిశ్రాస్తి సృష్టించినంతగా మరే రచయితా సృష్టించలేదని చెప్పవచ్చు"** (ముందుమాట:08) అన్న కొ.కు మాటలతో ఏకీభవించవచ్చు. మానవీయ ఆర్ద్రతను, ప్రాపంచిక వికృతత్వాన్ని ఎవరూ అనుసరించలేని తనదైన శైలిలో రావిశాస్త్రి తన రచనలను తాత్త్వికగాఢతతో రాశారనడానికి 'బాకీ కథలు' ఒక నమూనాగా నిలిచాయని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. రావిశాస్త్రి రచనాసర్వసం – బాకీ కథలు; 2015. కూర్పు : చలసాని ప్రసాద్. తెలుగు ప్రింట్. నవోదయ బుక్‌హౌస్. హైదరాబాద్.

2.కుందుర్తి వ్యాసాలు : 1987, మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్. హైదరాబాద్

3. శ్రీనివాసరావు, చేకూరి. 1986. శ్రమ– సౌందర్యము. కవితా పబ్లికేషన్స్. మధిర.

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3 17 హైదరాబాద్ జనవరి : 2025

# వెండితెరకెక్కిన మహాకవుల జీవిత గాథలు

డా. తిరునగరి శరత్ చంద్ర, తెలుగు అధ్యాపకులు, నిజాం కళాశాల. ఫోన్ : 630 987 3682


మన తెలుగులో చాలామంది మహాకవులు ఉదయించి తేజోమయమైన సాహిత్యాన్ని మనకందించారు. తమ కవిత్వంతో, జీవితంతో, తత్త్వాలతో, తమ భావాలతో, వాక్కులతో మనల్ని ప్రభావితం చేశారు. వారి సాహిత్యమే కాదు జీవితమూ మనకు మార్గదర్శనం చేసింది. అలాంటి మహాకవులు కేవలం తెలుగులోనే గాక భారతీయ భాషలన్నింటిలోను ముఖ్యంగా మన సోదరభాషల్లోనూ ఉన్నారు. సంస్కృతం, హిందీ, కన్నడం మొ॥న భాషల్లోనూ ఉన్నారు. శ్రీకృష్ణదేవరాయల వంటి మన తెలుగు మహాకవుల జీవితగాథలు కన్నడంలోను, సంస్కృతంలోను వాల్మీకి, కాళిదాసు, కబీర్ లాంటి సంస్కృత, హిందీ మహాకవుల గాథలు తెలుగులోను తెరకెక్కి ప్రచారంలో ఉన్నాయి. నిజానికి కాళిదాసు లాంటి వారంతా విశ్వకవులే. వారి జీవితం, సాహిత్యం ప్రపంచమంతటా విస్తృతంగా ప్రచారంలో ఉంది.

అయితే ప్రచారానికి 'సినిమా'ను మించిన సాధనం లేదు. ఇలాంటి మహాకవుల జీవితగాథలు వెండితెరకెక్కి మరింతగా ప్రచారం పొందాయి. వీరి కథలు సినిమాలుగా, సీరియళ్ళుగా రూపొందక ముందు పుస్తకాల్లోను, పాఠ్యాంశాల్లోను మాత్రమే వీరి గురించి రాయబడి ఉండేది. పండితులకో, పుస్తకపఠనంపై ఆసక్తి ఉన్నవారికో, విద్యావంతులకో లేదా విద్యాలయాల్లో చదువుకునే విద్యార్థులకో మాత్రమే వీరి గురించి తెలిసేది. కాని సినిమాలుగా వీరి కథలు రూపొందాక చదువురాని వాళ్ళకు కూడా ఈ మహాకవుల గురించి, వారి సాహిత్యం గురించి తెలిసిపోయింది. ఇలాంటి కవులను సామాన్యజనానికి కూడా చేరువ చేసింది సినిమానే.

ప్రస్తుతం మహాకవుల కథలతో వచ్చిన ఆ సినిమాల గురించి తెలుసుకుందాం. అయితే ఇందులో ప్రధానంగా కవుల జీవిత వృత్తాంతాలతో నేరుగా తీసిన సినిమాలున్నాయి. సినిమాలో ఉపకథలాగా కవుల గాథలను తెలిపినవి ఉన్నాయి. ఇంకా సినిమాల్లో ప్రధాన ఘట్టాల్లో కథా గీతికలుగా కవుల గాథలను తెలిపినవీ ఉన్నాయి. వాటి విశేషాలు చూద్దాం..

### వాల్మీకి

రసవత్తరమైన రామాయణం మనకు ఆదికావ్యం. అటువంటి మహాకావ్యాన్ని రచించి, సంస్కృత ఆదికవిగా, మహాకవిగా మన హృదయాల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నాడు వాల్మీకి. బోయవానిగా అడుగేసి మహాజ్ఞానిగా, మహాకవిగా విశ్వరూపమెత్తినాడు. 1963లో జూపిటర్ పిక్చర్స్ పతాకంపై సి.యస్.రావు





దర్శకత్వంలో వాల్మీకి సినిమా రూపొందింది. ఇందులో వాల్మీకి పాత్రలో ఎన్.టి.రామారావు అద్భుతంగా నటించారు. మాటలు, పాటలు సముద్రాల సీనియర్ రాశారు. 'మానిషాద ప్రతిష్ఠాం..' వంటి శ్లోకాలు, అందచందాలలోన, శ్రీరామాయణ కావ్యకథ వంటి పాటలు ఇందులో ఉన్నాయి..

### మహాకవి కాళిదాసు

కాళిదాసును మించిన కవి సృష్టిలోనే లేదన్నది శాశ్వతసత్యం. ఇది మహా మహా విద్వాంసులే చెప్పినమాట. కుమారసంభవం, రఘువంశం, మేఘదూతం లాంటి మహాకావ్యాలు, మహానాటకాలతో సంస్కృత సాహిత్యంలోనే అన్ని భాషల సాహిత్యాల్లోను గొప్ప సంచలనం రేకెత్తించాడు. కాళిదాసు ప్రభావం పడని భాష లేదు. కవి లేదు. 1960లో సారణి ప్రొడక్షన్స్ పతాకంపై కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో 'మహాకవి కాళిదాసు' సినిమా రూపొందింది. ఈ సినిమాలో కాళిదాసు పాత్రలో అక్కినేని నాగేశ్వరరావు నటించాడు. ఈ సినిమాకు మాటలు, పాటలు పింగళి నాగేంద్రరావు రాశాడు. ఈ సినిమాలోని 'మాణిక్యవీణాముపాలాలయంతి'..వంటి శ్లోకాలు, 'జయ జయ జయ శారదా జయ కళావిశారద', 'వెలుగు వెలగరా నాయనా' వంటి పాటలు ఇప్పటికి మన నాలుకలపైన నర్తిస్తాయి.

### భక్తప్రహ్లాద

శ్రీలక్ష్మీనరసింహ అవతారానికి కారణభూతమైన భక్తాగ్రేసరుడు ప్రహ్లాదుడు. హరినామమే ధ్యానంగా, గానంగా, ప్రాణంగా, సర్వంగా బతికిన చరితార్థుడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుని భక్తికి మెచ్చి శ్రీమహావిష్ణువు నరసింహ అవతారమెత్తి దుష్టసంహారం చేశాడు. ఆ భక్తశిఖామణి హరిని కీర్తిస్తూ ఎన్నో రచనలు చేశాడు. స్తోత్రాలు, దండకాలు ఆశువుగా చెప్పాడు. ఆయన రాసిన 'శ్రీలక్ష్మీ నరసింహ కవచ స్తోత్రమ్' మనందరికీ నిత్య పారాయణ మంత్రం. సర్వ




పాపాలను, సర్వదోషాలను పరిహరించి మోక్షసిద్ధిని కలిగించే పరమ పావన మంత్రమది. అంతటి మహాభక్తుని గాథను తెలుగులో మూడుసార్లు వెండితెర కెక్కించడం జరిగింది. అసలు. మన తొలితెలుగు సినిమా 'భక్తప్రహ్లాద'నే.

1931లో భారత్ మూవీ టోన్ పతాకంపై హెచ్.ఎం.రెడ్డి నిర్మాణంలో, దర్శకత్వంలో, ఎల్.వి.ప్రసాద్ సహాయ దర్శకత్వంలో భక్తప్రహ్లాద సినిమా రూపొందింది. ఇందులో భక్తప్రహ్లాదుని పాత్రలో కృష్ణాజిరావు సింధే అద్భుతంగా నటించారు. ఇది ధర్మవరం రామకృష్ణమాచార్యుల వారి 'భక్తప్రహ్లాద'నాటకం ఆధారంగా రూపొందిన సినిమా. ఈ సినిమాకు మాటలు సురభి నాటకసమాజం వారు అందించగా, పాటలు చందాల కేశవదాసు రాశారు. 'తనయా ఇటులనే తగదురా', 'పరితాపభారంబు భరియింపతరమా!' మొ॥న పాటలు, పద్యాలు అద్భుతంగా ఉన్నాయి.

అలాగే 1942 లో శోభనాచల ప్రొడక్షన్స్ పతాకంపై చిత్రపు నారాయణరావు దర్శకత్వంలో భక్తప్రహ్లాద సినిమా రూపొందింది. ఈ సినిమాలో భక్తప్రహ్లాదుని పాత్రలో వేమూరి గగ్గయ్య నటించాడు.

1967లో ఎ.వి.ఎం. ప్రొడక్షన్స్ పతాకంపై చిత్రపు నారాయణ మూర్తి దర్శకత్వంలో భక్తప్రహ్లాద సినిమా రూపొందింది. ఈ సినిమాలో ప్రహ్లాదుని పాత్రలో రోజారమణి అద్భుతంగా నటించింది. ఈ సినిమాకు డి.వి.నరసరాజు మాటలు రాయగా పాటలు సముద్రాల సీనియర్, దాశరథి, కొసరాజు, ఆరుద్ర, పాలగుమ్మి పద్మరాజు, సముద్రాల జూనియర్ రాశారు. 'ఆది అనాదియు నీవే దేవా!', 'జీవము నీవే కదా', 'నారాయణమంత్రం' మొ. పాటలు, పద్యాలు ఇందులో ఉన్నాయి.

## భక్త మార్కండేయ

మృత్యుపాశాన్ని సైతం ఎదిరించి, యమధర్మరాజును కూడా గజగజ వణికించి, తన పరమభక్తితో పరమేశ్వరున్నే మెప్పించిన మృత్యుంజయుడు మార్కండేయుడు. శివునిపై, విష్ణువుపై ఎన్నో స్తోత్రాలు, దండకాలు, అష్టకాలు రాసిన భక్తకవి మార్కండేయుడు. ఆయన రాసిన 'శ్రీ వేంకటేశ్వర వజ్రకవచ స్తోత్రమ్' సకల జగత్ ప్రసిద్ధం. భక్తులకు మృత్యుభయం లేకుండా చేసే దివ్యస్తోత్రమది. దీర్ఘాయుష్షును ప్రసాదించి శ్రీ మహావిష్ణువు కటాక్షాన్ని మనకు అందించే పరమ పావనమంత్రమది.

1957లో విక్రమ్ ప్రొడక్షన్స్ పతాకంపై బి.ఎస్.రంగా దర్శకత్వంలో 'భక్త మార్కండేయ' సినిమా రూపొందింది. ఈ సినిమాలో మార్కండేయుని పాత్రలో మాస్టర్ ప్రభాకర్, మాస్టర్ బాబ్జీ, మాస్టర్ ఆనంద్ నటించారు. ఈ సినిమాకు మాటలు, పాటలు సముద్రాల సీనియర్ రాశారు. 'శంకర గళధార' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

1982 లో సురేశ్ ప్రొడక్షన్స్ పతాకంపై పి. భానుమతీ రామకృష్ణ దర్శకత్వంలో 'భక్త ధ్రువమార్కండేయ' సినిమా రూపొందింది. ఈ సినిమాలో మార్కండేయుని పాత్రలో హరి నటించాడు.

## త్యాగయ్య

ప్రసిద్ధ కర్ణాటక సంగీత వాగ్గేయకారుడు త్యాగయ్య నాదబ్రహ్మ. సంగీతానికి శాశ్వతత్వాన్ని చేకూర్చినవాడు. ప్రహ్లాద భక్తవిజయం, నౌకావిజయం వంటి యక్షగానాలతో, వేలాది కృతులతో సంగీత ప్రపంచంలో సుస్థిరస్థానం సంపాదించుకున్నాడు. 1946లో శ్రీ రేణుకా ఫిల్మ్స్ పతాకంపై చిత్తూరు నాగయ్య దర్శకత్వంలో త్యాగయ్య సినిమా రూపొందింది. ఈ సినిమాలో త్యాగయ్య పాత్రలో చిత్తూరు నాగయ్య నటించాడు. ఈ సినిమాకు మాటలు చిత్తూరు నాగయ్య, ఎస్.వి.ఆర్ ఆచార్య రాయగా పాటలు సముద్రాల సీనియర్ (త్యాగయ్య కృతులు మినహా) రాశాడు. 'ఎందరో మహానుభావులు', 'నా మొరాలకింపవేమీ' మొ॥న పాటలు ఇందులో ఉన్నాయి.

అంతేకాకుండా 1981లో నవత ఆర్ట్స్ పతాకంపై బాపు దర్శకత్వంలో కూడా త్యాగయ్య సినిమా రూపొందింది. ఇందులో త్యాగయ్యగా జె.వి.సోమయాజులు నటించాడు. ఇది 1982లో ఇండియన్ పనోరమా ఆఫ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది. ఈ సినిమాకు మాటలు ముళ్ళపూడి వేంకటరమణ రాయగా పాటలు వేటూరి సుందరరామ్మూర్తి రాశాడు.

## భక్త రామదాసు

మహాభక్తుడిగా, వాగ్గేయకారుడిగా రామదాసు జగత్‌ప్రసిద్ధి గాంచినవాడు. ఆయన రాసిన కీర్తనలు, గేయాలు మనకందరికీ చిర పరిచితాలే. 1964లో వి.యన్.ఫిల్మ్స్ పతాకంపై చిత్తూరు నాగయ్య దర్శకత్వంలో భక్తరామదాసు సినిమా రూపొందింది. ఈ సినిమాలో రామదాసు పాత్రలో చిత్తూరు నాగయ్యనే నటించాడు. ఈ సినిమాకు మాటలు యదవల్లి లక్ష్మీనారాయణ, విద్వాన్ మల్లాది సత్యనారాయణ రాయగా, పాటలు మము బ్రోవమని చెప్పవే,

ధన్యుడనైతిని ఓ రామా! వంటి మొ॥ రామదాసు కీర్తనలే ఉన్నాయి.

అలాగే 2006లో ఆదిత్య ప్రొడక్షన్స్ పతాకంపై కె.రాఘవేంద్ర రావు దర్శకత్వంలో కూడా శ్రీరామదాసు సినిమా రూపొందింది. ఇందులో రామదాసు పాత్రలో అక్కినేని నాగార్జున నటించాడు. ఈ సినిమాకు కథ,మాటలు జె.కె.భారవి రాయగా, పాటలు వేటూరి, చంద్రబోస్, సుద్దాల అశోక్ తేజ, శివశక్తిదత్తా, వేదవ్యాస్, జె.కె.భారవి రాశారు. అదిగో అదిగో భద్రగిరి, తాగరా శ్రీరామ నామామృతం వంటి పాటలు మధురాతిమధురాలు.

## తెనాలి రామకృష్ణ

అష్టదిగ్గజ కవుల్లో ప్రత్యేకస్థానాన్ని పొందిన ప్రఖ్యాతకవి తెనాలి రామకృష్ణుడు. ఆయన రాసిన ఉద్భటారాధ్య చరిత్ర, పాండురంగ మాహాత్మ్యం వంటి ప్రబంధాలు, హాస్యకథలు తెలుగునాట చాలా ప్రసిద్ధాలు. 1956 లో విక్రమ్ ప్రొడక్షన్స్ పతాకంపై బి.ఎస్.రంగా దర్శకత్వంలో తెనాలి రామకృష్ణ సినిమా రూపొందింది. ఈ సినిమాలో తెనాలి రామకృష్ణ పాత్రలో అక్కినేని నాగేశ్వరరావు నటించారు. శ్రీకృష్ణదేవరాయల పాత్రలో ఎన్.టి.రామారావు నటించారు. ఈ సినిమాకు మాటలు, పాటలు సముద్రాల సీనియర్ రాశారు. 'చేసేది ఏమిటో చేసేయి సూటిగా', 'ఆకతాయి పిల్లమూక' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి..

## భక్త జయదేవ

12 వ శతాబ్దానికి చెందిన సంస్కృత మహాకవి జయదేవుడు. జగత్ ప్రసిద్ధుడు. ఆయన రాసిన గీతగోవిందం కావ్యం విశిష్టమైనది. 1961లో లలితకళానికేతన్ పతాకంపై పి.వి.రామారావు దర్శకత్వంలో భక్త జయదేవ సినిమా రూపొందింది. ఈ సినిమాలో జయదేవుని పాత్రలో అక్కినేని నాగేశ్వరరావు నటించారు. ఈ సినిమాకు మాటలు, పాటలు సముద్రాల సీనియర్ (జయదేవుని అష్టపదులు మినహా) రాశారు. 'అనిలతరళ కువలయ', 'నాదు ప్రేమ భాగ్యరాశి' మొ॥ పాటలు, అష్టపదులు ఇందులో ఉన్నాయి..

## భక్తపోతన

తెలుగునాట భక్తికి పట్టం గట్టిన మహాకవి పోతన. ఆయన రాసిన భాగవతం తెలుగుల పుణ్యఫలం. ఆయన పద్యాలు మోగని ఇల్లు లేదు. హృదయమూ లేదు. 1966 లో భారత్ ఫిల్మ్స్ పతాకంపై గుత్తా రామినీడు దర్శకత్వంలో భక్తపోతన సినిమా రూపొందింది. ఈ సినిమాలో పోతన పాత్రలో గుమ్మడి వేంకటేశ్వరరావు నటించారు. మాటలు దాసం గోపాలకృష్ణ, పాటలు సముద్రాల సీనియర్, సముద్రాల జూనియర్, ఆరుద్ర, కొసరాజు, సి.నారాయణరెడ్డి రాశారు. సర్వమంగళనామ, నీ దయరాదా? మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.. 1990 దశకంలో దూరదర్శన్ లో 'భక్తపోతన' ధారావాహిక రూపొందడం విశేషం. ఆ ధారావాహికకు సి.నారాయణ రెడ్డి, వడ్డేపల్లి కృష్ణ పాటలు రాశారు.




## భక్త రఘునాథ్

మహాభక్తునిగా, వైష్ణవ సన్యాసిగా చైతన్య మహాప్రభు అపోస్తులులలో ఒకరైన రఘునాథ దాసగోస్వామి పరమభాగవత తత్పరుడు. ఆయన రాసిన అభీష్ట సుకానా, దాన కేళి చింతామణి, గోపాలరాజ స్తోత్రం మొ॥ తత్త్వాలు చాలా ప్రసిద్ధాలు. 1960 లో జి.వి.ఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై సముద్రాల సీనియర్ దర్శకత్వంలో భక్త రఘునాథ్ సినిమా రూపొందింది. ఈ సినిమాలో భక్త రఘునాథ్ పాత్రలో కాంతారావు నటించారు. ఈ సినిమాకు మాటలు, పాటలు సముద్రాల సీనియర్, సముద్రాల జూనియర్ అందించారు. 'జయమురళీ లోలా', 'ఆనందమంత' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

## భక్త తుకారాం

మరాఠీ సాహిత్యంలో అగ్రేసరస్థాయికి చెందిన మహాకవి తుక్కోబా. ఆయన రాసిన అభంగాలు ప్రపంచమంతటా ప్రచారంలో ఉన్నాయి. గొప్ప భక్తిభావనతో పాండురంగడిని ధ్యానించి అతని దాసానుదాసు లలో ఒకడిగా జీవితాన్ని గడిపి చరితార్థుడయ్యాడు. 1973లో అంజలి పిక్చర్స్ పతాకంపై వి. మధుసూదనరావు దర్శకత్వంలో భక్త తుకారాం సినిమా రూపొందింది. ఈ సినిమాలో తుకారాం పాత్రలో అక్కినేని నాగేశ్వరరావు నటించారు. ఈ సినిమాకు మాటలు, పద్యాలు వేటూరి రాయగా పాటలు కృష్ణశాస్త్రి, ఆత్రేయ, దాశరథి, సి.నారాయణరెడ్డి, వేటూరి పాటలు రాశారు. 'ఘనాఘనసుందరా', 'శ్యామసుందరా ప్రేమమందిరా' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

## మహాకవి క్షేత్రయ్య

మువ్వగోపాలుని నామార్చనయే జీవిత పరమావధిగా బతికిన మహాకవి, పదకర్త క్షేత్రయ్య. అతని పదాలు తెలుగువారి నోట నేటికీ మోగుతూనే ఉంటాయి. 1976లో అంజలి పిక్చర్స్ పతాకంపై ఆదుర్తి సుబ్బారావు, సి.ఎస్.రావు దర్శకత్వంలో మహాకవి క్షేత్రయ్య సినిమా రూపొందింది. ఈ సినిమాలో క్షేత్రయ్య పాత్రలో అక్కినేని నాగేశ్వరరావు నటించారు. ఈ సినిమాకు మాటలు ఆరుద్ర రాయగా

పాటలు ఆరుద్ర, దాశరథి, సి.నారాయణరెడ్డి (క్షేత్రయ్య పదాలు మినహా) రాశారు. 'ఓ రేపల్లెలోని గోపాలుడంట', 'మేలుకో కవిరాజ మేలుకోవయ్యా', 'జాబిల్లి చూసేను నిన్ను నన్ను' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

## వేములవాడ భీమకవి

తెలుగులో ఛందోగ్రంథానికి ఆద్యుడిగా, చాటుకవిగా పేరుగాంచిన మహాకవి వేములవాడ భీమకవి. ఆయన చాటు పద్యం చాలా శక్తివంతమైనది. రాఘవపాండవీయం, శతకంథ రామాయణం వంటి కావ్యాలతో ఆయన సుప్రసిద్ధుడయ్యాడు. దాక్షారామ భీమేశ్వరస్వామి వరప్రసాది అయిన ఈ మహాకవి తిట్టుపద్యాలతో ప్రసిద్ధుడయ్యాడు. 1976లో రామకృష్ణ ఆర్ట్స్ పతాకంపై డి.యోగానంద్ దర్శకత్వంలో వేములవాడ భీమకవి సినిమా రూపొందింది. ఈ సినిమాలో వేములవాడ భీమకవి పాత్రలో నందమూరి బాలకృష్ణ నటించారు. ఈ సినిమాకు మాటలు సముద్రాల జూనియర్, పాటలు సముద్రాల జూనియర్, కొసరాజు రాశారు. 'జగదీశా పాహి పరమేశా', 'రాజు వెడలె సభకు' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

## శ్రీనాథ కవిసార్వభౌముడు

తెలుగు సాహిత్యంలో శ్రీనాథ మహాకవిది ఒక శకం. ఒక యుగం. మరుత్తరాట్చరిత్ర, శృంగారనైషధం, కాశీఖండం, భీమఖండం, హరవిలాసం మొ॥ కావ్యాలు ఆయన కవితాశక్తిని తెలియజేస్తాయి. 1993లో రామకృష్ణ కల్చరల్ స్టూడియోస్, శ్రీమతి మూవీ కంబైన్స్ పతాకంపై బాపు దర్శకత్వంలో శ్రీనాథ కవిసార్వభౌముడు సినిమా రూపొందింది. ఈ సినిమాలో శ్రీనాథ మహాకవి పాత్రలో ఎన్.టి.రామారావు నటించారు. ఈ సినిమాకథ నోరి నరసింహశాస్త్రి 'కవిద్వయం' నవల ఆధారంగా రూపొందింది. ఈ సినిమాకు మాటలు ముళ్ళపూడి వేంకటరమణ రాయగా పాటలు డా.సి.నారాయణరెడ్డి రాశారు. 'జేజేలు జేజేలు జేజేలు', 'ఇంతి దమయంతి' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి. ఇదే సినిమాలో భక్తపోతన, దగ్గుపల్లి దుగ్గన పాత్రలు కూడా ఉన్నాయి.

## శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర

తత్త్వజ్ఞానంతో, కాలజ్ఞానంతో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మహాయోగి, మహా విద్వాంసుడు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి. ఆయన అందించిన కాలజ్ఞానం మనకు భవిష్యత్ మార్గాన్ని సూచించే వెలుగుదీపం. కాలజ్ఞానం, ఆత్మబోధ, గోవిందవాక్యాలు మొ॥ తత్త్వకావ్యాలు రాశారు. 1984లో రామకృష్ణ సినీస్టూడియోస్ పతాకంపై ఎన్.టి.రామారావు దర్శకత్వంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర సినిమా రూపొందింది. ఈ సినిమాలో వీరబ్రహ్మేంద్రస్వామి పాత్రలో ఎన్.టి.రామారావు గారే నటించారు. ఈ సినిమాకు మాటలు కొండవీటి వేంకటకవి, పాటలు కొసరాజు, సి.నారాయణరెడ్డి (బ్రహ్మం గారి తత్త్వాల ఆధారంగా) రాశారు. 'శివగోవిందా గోవింద ', 'వినరా వినరా ఓ నరుడా!', 'పంచముడవని నిను' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

## శ్రీ వేమన చరిత్ర

ఆటవెలదిని ఆయుధంగా చేసుకుని పదునైన పద్యాలను విసిరిన మహాకవి, తత్త్వయోగి వేమన. ఆయన రాసిన పద్యాలు రాని తెలుగు వాడుండడు. రాజుగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన విరాగి అయ్యి రాసిన పద్యాలు, చెప్పిన తత్త్వాలు న భూతో న భవిష్యతి. 1947లో వాహిని పిక్చర్స్ పతాకంపై కె.వి.రెడ్డి దర్శకత్వంలో 'యోగి వేమన' సినిమా రూపొందింది. ఈ సినిమాలో వేమన పాత్రలో చిత్తూరు నాగయ్య నటించారు. ఈ సినిమాకు మాటలు, పాటలు సముద్రాల సీనియర్ రాశారు. 'అందాలు చిందేటి నా జ్యోతి', 'ఆపరాని తాపమాయెరా' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

అలాగే 1986లో రాధామాధవచిత్ర పతాకంపై సి.యస్.రావు దర్శకత్వంలో శ్రీవేమనచరిత్ర సినిమా రూపొందింది. ఈ సినిమాలో వేమన పాత్రలో విజయచందర్ నటించారు. ఈ సినిమాకు మాటలు మోదుకూరి జాన్సన్, పాటలు ఆత్రేయ, వేటూరి, సీతారామశాస్త్రి రాశారు. 'ఆడవే భామినీ', 'అధరం మధురం' మొ. పాటలు ఇందులో ఉన్నాయి.

## చక్రధారి :

1977 లో లక్ష్మీఫిలిం కంబైన్స్ పతాకంపై వి. మధుసూదనరావు దర్శకత్వంలో వచ్చిన చక్రధారి సినిమా 'భక్తకుంబార' అనే కన్నడ చిత్రానికి తెలుగు అనువాదం. ఈ సినిమాలో గోరా, నామదేవుడు వంటి మరాఠీ భక్తకవుల జీవితగాథలు వివరించబడ్డాయి. పాండురంగని భక్తదాసుల్లో గోరా, నామదేవుడు విశిష్టులు. వారి జీవితమంతా పాండురంగని భక్తిసేవకే అంకితం చేసి తరించిన ధన్యజీవులు. ఈ సినిమాలో గోరా పాత్రలో అక్కినేని నాగేశ్వరరావు, నామదేవుని పాత్రలో కైకాల సత్యనారాయణ నటించారు. ఈ సినిమాకు మాటలు ఆత్రేయ, పాటలు ఆత్రేయ, సి.నారాయణరెడ్డి రాశారు. 'విఠలా విఠలా జై పాండురంగ విఠలా', 'నువ్వెవరయ్యా నేనెవరయ్యా' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

## కథానాయిక మొల్ల

ఆదికావ్యమైన రామాయణాన్ని రచించిన వారిలో కవయిత్రి మొల్ల ఒకరు. 'తేనె సోకు నోరు తీయగనగు రీతి' రామాయణాన్ని రచించి మనకందించిన మహా కవయిత్రి మొల్ల. 1970లో రేఖా–మురళీ ప్రొడక్షన్స్ పతాకంపై హాస్యనటుడు పద్మనాభం దర్శకత్వంలో కథానాయిక మొల్ల సినిమా రూపొందింది. ఈ సినిమాలో మొల్ల

పాత్రలో వాణిశ్రీ నటించింది. ఈ సినిమాకథ ఇంటూరి వేంకటేశ్వర రావు ప్రసిద్ధ నవల 'కుమ్మరి మొల్ల' ఆధారంగా చిత్రించబడింది. ఈ సినిమాకు మాటలు బి.యల్.ఎన్.ఆచార్య, ఆదుర్తి నరసింహ మూర్తి, అప్పలాచారి పాటలు కృష్ణశాస్త్రి, దాశరథి, సి.నారాయణరెడ్డి, శ్రీశ్రీ, కొసరాజు, అప్పలాచారి, విజయనరసింహ, అరుల్ ప్రకాశ్, శ్రీనివాస్ రాశారు. 'మనిషిని బ్రహ్మయ్య మట్టితో చేసెనయా', 'జగమే రామమయం' మొ॥ పాటలు పరమాద్భుతాలు.

## శ్రీ మంత్రాలయ రాఘవేంద్రస్వామి మాహాత్మ్యం


హిందూమత ద్వైత సిద్ధాంతానికి చెందిన జగద్గురువు శ్రీ మంత్రాలయ రాఘవేంద్రస్వామి. విష్ణునామధ్యానంలో జీవితాన్ని గడిపిన మహాయోగి. గొప్ప కవీంద్రుడు. వేలాదిమంది భక్తులు, శిష్యులు అతని అడుగుజాడల్లో నడిచి ధన్యులయ్యారు. 'భట్ట సంగ్రహం', 'న్యాయసుధాపరిమళ', 'తంత్రదీపిక' మొ॥ రచనలు చేశారు రాఘవేంద్రస్వామి. 1987లో శ్రీచక్ర ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్.పి.ముత్తురామన్ దర్శకత్వంలో 'శ్రీ మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మాహాత్మ్యం' సినిమా రూపొందింది. ఇది 1985లో విడుదలైన తమిళ సినిమా 'శ్రీ రాఘవేంద్రర్' కు అనువాదం. ఈ సినిమాలో రాఘవేంద్రస్వామి పాత్రలో రజనీకాంత్ అద్భుతంగా నటించారు. ఈ సినిమాకు మాటలు, పాటలు మైలవరపు గోపి రాశారు. 'ఆడవే లలనా నాట్యమాడవే', 'వేడితిని దేవ దేవ' మొ॥ పాటలు ఎన్నిసార్లు విన్నా తనివితీరవు.

## అన్నమయ్య

పదకవితా పితామహుడిగా పేరుగాంచిన తాళ్ళపాక అన్నమాచార్య జగద్విఖ్యాతి చెందిన వాగ్గేయకారుడు. సంకీర్తనాచార్యుడిగా ఆయన ఎందరికో సుపరిచితుడు. భక్తాగ్రేసరుడిగా కూడా అందరికీ చిరపరిచితుడే. ఆయన రాసిన వేలాది కీర్తనలు నేటికీ నిత్యపారాయణాలే. 'శ్రీ వేంకటేశ్వర శతకం', 'శృంగార సంకీర్తనం' మొ॥ రచనలు చేశారు అన్నమాచార్య. 1997లో వి.ఎమ్.సి. ప్రొడక్షన్స్ పతాకంపై కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో అన్నమయ్య సినిమా రూపొందింది. ఈ సినిమాలో అన్నమయ్య పాత్రలో అక్కినేని నాగార్జున నటించారు. ఈ సినిమాకు జాతీయ, ఫిలింఫేర్, నంది మొ॥ పురస్కారాలు లభించాయి. ఈ సినిమాకు కథ, మాటలు జె.కె.భారవి రాయగా, పాటలు వేటూరి, జె.కె.భారవి (అన్నమయ్య కీర్తనలు మినహా) రాశారు. 'తెలుగుపదానికి జన్మదినం', 'వినరో భాగ్యము విష్ణుకథ', 'అదివో అల్లదివో' మొ॥ పాటలు, కీర్తనలు ఇందులో ఉన్నాయి.

## జగద్గురు ఆదిశంకర

అద్వైత మతస్థాపకుడిగా ప్రసిద్ధుడైన ఆదిశంకరాచార్యులు గొప్ప తత్త్వయోగి. ఆయన రాసిన దండకాలు, శ్లోకాలు, అష్టకాలు,




స్తోత్రాలు, పంచకాలు మనకందరికీ ఆరాధనా యోగ్యమైనవి. 2013లో గ్లోబల్ పీస్ క్రియేటర్స్ పతాకంపై జె.కె.భారవి దర్శకత్వంలో జగద్గురు ఆదిశంకర సినిమా రూపొందింది. ఈ సినిమాలో ఆదిశంకరాచార్య పాత్రలో కౌశిక్ బాబు నటించారు. ఈ సినిమాకు మాటలు జె.కె.భారవి, పాటలు జె.కె.భారవి, శ్రీవేదవ్యాస్ (ఆదిశంకరాచార్య స్తోత్రాలు మినహా) రాశారు. 'అఖిల చరాచర', 'భ్రమ అని తెలుసు', 'ఓంకారం' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

## విశ్వాచార్యుడు

విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకుడిగా శ్రీమద్రామానుజాచార్యుల వారు ప్రసిద్ధులు. గొప్ప వేదాంత తత్త్వవేత్త. ఆయన బోధించిన తత్త్వాలు, అష్టాక్షరి మహామంత్రం, ఆయన రచించిన వేదార్థ సంగ్రహం, గీతాభాష్యం మొ॥ రచనలు మనకు నిత్య పారాయణ గ్రంథాలు. 2014లో అభ్యుదయ ఆర్ట్స్ పతాకంపై మీర్ దర్శకత్వంలో విశ్వాచార్యుడు సినిమా రూపొందింది. ఈ సినిమాలో రామానుజా చార్యుల పాత్రలో ఆదిత్య నటించారు. ఈ సినిమాకు మాటలు ఉదయభాస్కర్ వాగ్దేవి, పాటలు ఉదయభాస్కర్ వాగ్దేవి, వడలి ఫణినారాయణ రాశారు. 'తిరునామం', 'రామానుజం' మొ॥ పాటలు మధురాతి మధురంగా ఉన్నాయి.

## కబీర్ దాస్

హిందీ సాహిత్యంలో అగ్రేసరస్థాయికి చెందిన మహాకవి, పరమయోగి కబీర్ దాస్. మహమ్మదీయుడైన కబీరు రామనామ సంకీర్తనయే జీవితంగా బతికిన ధన్యజీవి. ఆయన చెప్పిన దోహాలు మనకు గొప్ప భక్తిభావనను, ఆధ్యాత్మిక చింతనను కలిగిస్తాయి. 2003లో కీర్తి చక్ర ప్రొడక్షన్స్ పతాకంపై వి.వి.రాజు దర్శకత్వంలో కబీర్ దాస్ సినిమా రూపొందింది. ఈ సినిమాలో కబీర్ పాత్రలో విజయచందర్ నటించారు. ఈ సినిమాకు మాటలు ఆరుద్ర రాయగా, పాటలు ఆత్రేయ, వేటూరి, ముళ్ళపూడిశాస్త్రి రాశారు. కబీరు హిందీ దోహాల ఆధారంగా తెలుగు దోహాలను సి.నారాయణరెడ్డి రాశారు. 'వినరా కబీరుమాట', 'గ్రహమేల నిగ్రహమేల?', 'ఓం అన్న నాదమే' మొ॥ పాటలు, దోహాలు ఇందులో ఉన్నాయి.

## తరిగొండ వేంగమాంబ

తరిగొండ వేంగమాంబ గొప్పయోగిని. వేంకటేశ్వరుని పాదసన్నిధి చెంతనే తన జీవితాన్ని పునీతం చేసుకుంది. గొప్ప కవయిత్రి. 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం', 'గోపినాటకం', 'రామపరిణయం' మొ॥ ప్రబంధాలు, కావ్యాలు రాసింది. 2009లో వి.ఎమ్.సి ప్రొడక్షన్స్ పతాకంపై ఉదయభాస్కర్ దర్శకత్వంలో వేంగమాంబ సినిమాగా రూపొందింది. ఈ సినిమాకు మాటలు ఉదయభాస్కర్, పాటలు వేటూరి, వేదవ్యాస్ (వేంగమాంబ, అన్నమయ్య కీర్తనలు మినహా) రాశారు. 'రాముడు రాఘవుడు', 'శ్రీకరముగను' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

## కవి సమ్రాట్

తెలుగులో తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత మహాకవి విశ్వనాథ సత్యనారాయణ. ఆయన కవితావైదుష్యాన్ని, పాండితీప్రకర్షను ఎంత పొగిడినా, ఎంత వర్ణించినా తక్కువే. మహా మహా విద్వాంసులను తలదన్నే అపారప్రతిభ అతని సొత్తు. 'కిన్నెరసానిపాటలు', 'వేయిపడగలు' మొ॥ శతాధిక రచనలు చేశారు. 2022లో హార్ట్ ఫిలిమ్ పతాకంపై సవిత్ సి. చంద్ర దర్శకత్వంలో కవిసమ్రాట్ సినిమా రూపొందింది. ఈ సినిమా 'ఆహా' లో విడుదలై అశేష ప్రజాదరణ పొందింది. ఈ సినిమాలో విశ్వనాథ సత్యనారాయణ పాత్రలో ఎల్.బి.శ్రీరామ్ గొప్పగా నటించారు. ఈ సినిమాకు మాటలు సవిత్ సి.చంద్ర రాయగా, పాటలు శివశక్తి దత్తా రాశారు. 'జగజ్జాలపాలం..' పాట అద్భుతంగా ఉంది.

## గోదా కల్యాణం

గోదాదేవినే ఆండాళ్‌గా మనం పిలుస్తాం. పన్నెండు మంది ఆళ్వారుల్లో గోదాదేవి ఒకరు. రంగనాథస్వామిని భక్తితో ఆరాధించి స్వామినే పతిగా పొందిన పరమ భక్తురాలు. 'తిరుప్పావు'(ముప్పది రెండు పాశురాలు), 'నాచ్చియార్ తిరుమళి' మొ॥ రచనలు చేసింది గోదాదేవి. పాశురాలతో భగవంతున్ని ప్రసన్నం చేసుకుంది. 2019లో కె. రాఘవేంద్రరావు పర్యవేక్షణలో మీర్ దర్శకత్వంలో గోదా కల్యాణం ధారావాహిక ప్రసారమైంది. ఈ సినిమాలో గోదాదేవి పాత్రలో రతి నటించింది. ఈ సినిమాకు మాటలు పి. ఉదయభాస్కర్, పాటలు శ్రీవేదవ్యాస్, పి. ఉదయభాస్కర్ రాశారు. 'కల్యాణం గోదాకల్యాణం' మొ॥ పాటలు ఇందులో ఉన్నాయి.

### ఇవే కాకుండా..

1954లో భరణీ పిక్చర్స్ పతాకంపై పి.ఎస్.రామకృష్ణారావు దర్శకత్వంలో విప్రనారాయణ సినిమా రూపొందింది. పన్నెండు మంది ఆళ్వారుల్లో ఒకరైన తొండరడిప్పొడి ఆళ్వారు జీవితచరిత్రను విప్రనారాయణ సినిమాగా తెరకెక్కించారు. తొండరడిప్పొడి గొప్పకవి, భక్తాగ్రేసరుడు. ఆయన పాత్రలో అక్కినేని నాగేశ్వరరావు అద్భుతంగా నటించారు. ఈ సినిమాలోని మాటలు, పాటలు సముద్రాల సీనియర్ రాశారు.

1957 లో ఎన్.ఏ.టి. పిక్చర్స్ ప్రై.లిమిటెడ్ పతాకంపై కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో పాండురంగ మాహాత్మ్యం సినిమా రూపొందింది. ఈ సినిమా చివరిభాగంలో భక్తతుకారాం, సూరదాసు, నామదేవుడు మొ॥ భక్తకవుల పాత్రలు చిత్రించబడ్డాయి.

1977 లో సత్యచిత్ర పతాకంపై కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో అడవిరాముడు సినిమా రూపొందింది. ఈ సినిమాలో వచ్చే 'కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు' అనే పాటలో కవి వాల్మీకి పాత్ర చిత్రించబడింది. ఈ పాటను వేటూరి సుందరరామ్మూర్తి రాశారు.

1970లో బి.ఆర్.పంతులు కన్నడంలో ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు సినిమాను రూపొందించారు.

1974లో శ్రీభాస్కరచిత్ర పతాకంపై బి.వి.ప్రసాద్ దర్శకత్వంలో మనుషుల్లో దేవుడు సినిమా రూపొందింది. ఈ సినిమాలోని బాగా ప్రసిద్ధి చెందిన పాటల్లో 'అహో హిమవన్నగము భరతావనికే తలమానికము' అనే పాట ఒకటి. ఈ పాట ఆంధ్ర కవితా పితామహుడైన అల్లసాని పెద్దన రాసిన 'మనుచరిత్ర'లోని వరూధిని ప్రవరుల ఘట్టానికి సంబంధించింది. పెద్దన ప్రబంధంలోని కథా భాగాన్ని ఈ పాటగా చిత్రీకరించారు. ఈ పాటలో ఎన్.టి.రామారావు ప్రవరునిగా, వాణిశ్రీ వరూధినిగా నటించారు. కళాశాలలోని ఓ ఉత్సవంలో భాగంగా జరిగిన దృశ్యనాటికలో ఈ పాటను ఉపయోగించారు. ఈ పాటను సి.నారాయణరెడ్డి రాశారు.

అలాగే..1991లో శ్రీదేవి మూవీస్ పతాకంపై సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో ఆదిత్య 369 సినిమా రూపొందింది. ఈ సినిమాలో శ్రీకృష్ణదేవరాయలు, అష్టదిగ్గజకవుల పాత్రలు కనిపిస్తాయి. ఇందులో శ్రీకృష్ణదేవరాయల పాత్రలో నందమూరి బాలకృష్ణ, అష్టదిగ్గజ కవుల్లోని తెనాలిరామకృష్ణుని పాత్రలో చంద్రమోహన్ మొ॥ వారు నటించారు.

ఇలా.. మహాకవుల జీవితగాథలు ప్రత్యేక కథలుగా వెండితెరకెక్కి అందరినీ అలరించాయి. వారి జీవితం, సాహిత్యం అందరినీ ప్రభావితం చేశాయి. ఇంకా ఆయా సినిమాల్లో, ధారావాహికల్లో కూడా సందర్భం దృష్ట్యా కవుల కథలు సంక్షిప్తంగా ప్రస్తావించబడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయి..



పి.ఎల్. శాంతకుమారి
ఫోన్ : 9502367162

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3 23 హైదరాబాద్ జనవరి : 2025

# నాద మయం – త్యాగరాజ హృదయం

పి.ఎల్. శాంతకుమారి, ఫోన్ : 9502 367 162



భారతదేశంలో కళలన్నింటికీ ముఖ్యంగా లలిత కళలకు ప్రధాన లక్ష్యం భక్తి, ఉపాసనల ద్వారా భగవంతుని పొందటమే. సంగీతం కూడా అందులో ఒకటి.

**"సామవేదాదిదం గీతం సంజగ్రాహి పితామహ:"**

సంగీతము సామవేదము నుండి బ్రహ్మచే గ్రహింపబడి లోకోపకారమై, భరతాదుల చేత మరియు ఇతర వాగ్గేయకారుల చేత వెల్లడి చేయబడిన శాస్త్రం అన్నారు సంగీత రత్నాకరము రచించిన శార్ఙదేవులు.

**"కావ్యాలాపాశ్చమే కేచిద్గీతాని సకలానిచ**
**శబ్దమూర్తి ధరైస్యేతే విష్ణోరాంశీ మహాత్మన:"**

శబ్ద స్వరూపమైన కావ్యములు, సంగీతమును భగవంతుని స్వరూపమే యని విష్ణు పురాణంలో చెప్పబడింది.

దాన, యజ్ఞ, జపాదులన్నియు త్రివర్గ ఫలమునిస్తాయని, సంగీతశాస్త్ర జ్ఞానము చేత మాత్రమే చతుర్విధ పురుషార్థములు లభ్యమగునని "శివ సర్వస్వం" అంటుంది.

అటువంటి నాదప్రాముఖ్యాన్ని, సంగీత ప్రాశస్త్యాన్ని సంపూర్ణంగా గ్రహించి, రామభక్తి మార్గ క్షృసాధనకు, నాదోపాసనా భక్తిమార్గమును ఎంచుకొన్నవారు శ్రీ త్యాగరాజస్వామి. దానినే తన రచనల ద్వారా లోకానికి చాటారు. వారి రచనల్లో నాద వైశిష్ట్యాన్ని, సంగీత ప్రాముఖ్యాన్ని తెలుపే కీర్తనలు అనేకం. 'స్వరార్ణవ' మర్మములన్నీ ఎరిగినవారు త్యాగరాజస్వామి. నారదమహర్షియే, స్వామి వారిని అనుగ్రహించి స్వయముగా 'స్వరార్ణవము' అనే సంగీత గ్రంథాన్ని ఇచ్చారని ఐతిహ్యం. ఆ నారద రహస్యాలన్నీ మనకు తన రచనల ద్వారా అందించారు శ్రీ త్యాగరాజు. నాదోపాసన ప్రాముఖ్యాన్ని, నాదోపాసనా భక్తి మార్గాన్ని త్యాగరాజ స్వామి వివరించిన విధము మరి యే ఇతర వాగ్గేయకారుల రచనలలో మనకు కనిపించదు.

నాదమునకు అధిష్టాన దేవతయగు శంకరుని, నాదస్వరూపునిగా వర్ణిస్తూ రచించినది 'నాదతనుమనిశం' అనే చిత్తరంజని రాగకృతి.

**"నాదతనుమనిశం శంకరం – నమామి మే మనసా శిరసా ॥నాద॥**
**మోదకర నిగమోత్తమ సామ – వేదసారం వారంవారం ॥నాద॥**
**సద్యోజాతాది పంచ వక్త్రజ – సరిగమ పదనీవర సప్తస్వర**
**విద్యాలోలం విదళిత కాలం – విమల హృదయ త్యాగరాజ పాలం**

నాదమే ఎల్లప్పుడూ స్వరూపంగా కలవానికి, వేదాలలో ఉత్తమ మైన సామవేద సారమైన వానికి మనసా శిరసా నమస్కరిస్తున్నారు. శంకరుడు జ్ఞాన స్వరూపుడు. అట్లే సప్తస్వరముల కాధారమైన నాదము కూడా జ్ఞానాత్మకమైనదే. వేదమగుటచే వుత్తమమైనది సామవేదం అనగా సంగీతం లేదా నాదం. తద్వారా నాదమే వుత్తమమైనది. ఈ నాదముచేతనే పరమాత్మ యొక్క దివ్యతత్త్వాన్ని వుపాసకులు అందుకోగలుగుతారు. అటువంటి నాదము శంకరుని ఐదు ముఖముల నుండి (సద్యోజాతం, అఘోరం, తత్పురుషం, ఈశానం, వామదేవం) సప్త స్వరములుగా వివిధ స్థాయిల్లో వుద్భవించాయి. ఈ సరిగమ పదని సప్తస్వరములను విశుద్ధముగా నాదోపాసన చేసినవారు కాలుని భయము కూడా లేక శివసాయుజ్యం పొందగలరని త్యాగరాజస్వామి బోధిస్తున్నారు.

శివుని పంచ వక్త్రములనుండి పుట్టిన ఈ సప్త స్వరములే మానవుని దేహమందు నాభి, హృదయము, కంఠము, రసన, నాసాదులయందు ప్రకాశిస్తాయని "శోభిల్లు సప్తస్వర" అనే జగన్మోహిని రాగకృతిలో చెప్తారు త్యాగయ్య.

అంతేకాక శబ్దస్వరూపములయిన కావ్యములును, సంగీతమును విష్ణ్వంశ రూపమే అనీ భావాన్ని 'నాదసుధారసంబిలను' అనే ఆరభి రాగ కృతిలో కూడా పొందుపరచారు.

**"నాదసుధారసంబిలను నరాకృతామె మనసా ॥నాద॥**
**వేద పురాణాగమాది శాస్త్రాదుల కాధారమే ॥నాద॥**
**స్వరములు యాఱొకఘంటలు వరరాగము కోదండము**
**దురనయ దేశ్యము త్రిగుణము నిరతగతి శరమురా**
**సరస సంగతి సందర్భము గల గిరములు రా**
**ధర భజనే భాగ్యమురా త్యాగరాజు సేవించు"**

శ్రీరామచంద్రుడు తాను పాడుకొనునట్టి సంగీతము యొక్క స్వరూపమేనని, నాదసుధారసము అనగా సంగీతము నరాకృతి అయినదని చెప్పుచున్నారు. ఈ నాదమే వేదములకు, పురాణములకు, ఆగమాది శాస్త్రాదులకు ఆధారమయింది. అట్టి నాదస్వరూపుడే

శ్రీరామచంద్రుడు. సంగీతమును అవలంబించియే త్యాగరాజస్వామి ఆ రాముని అర్చించారు. అనగా సాధనము, సాధ్యము ఒకటే అనే తత్త్వాన్ని మిక్కిలి గంభీరముగా సూచించారు.

కోదండము శ్రీరామునికి ప్రధానమయిన అలంకారము గనుక దానిని సంగీతమునకు ముఖ్యమయిన రాగముతో పోల్చారు. రాగమునందలి దుర, నయ దేశ్యములే వింటినారికి కల త్రిగుణములు అన్నారు. కోదండము నందు గల చిఱుగంట ఆఱునొక్కటి సప్తస్వరములు. స్వరములు ఆరునొక్కటి అనగా ఆధారషడ్జమము 'స' నుండే మిగతా ఆరు స్వరాలు వ్యుత్పత్తి అయ్యాయని చెప్తున్నారు. విల్లు నుండి నిరత గతిలో లక్ష్యమును ఛేదించుటకై వెలువడే శరములే లయ అన్నారు. శ్రీరాముడు సందర్భోచితంగా పలికే మధుర భాషణములే సరసమైన సంగతులని పేర్కొన్నారు. (కృతులలో 'సంగతులు' అనే వాటిని ప్రవేశపెట్టినది కూడా త్యాగరాజస్వామియే) ఇటువంటి భావనతో శ్రీరాముని ధ్యానించడమే మోక్షమార్గమని అంటున్నారు. ఈ కృతిలో సంగీత శాస్త్ర లక్ష్య, లక్షణములు రెండూ వుండటం విశేషము. వాల్మీకి తన రామాయణమే శ్రీరాముని స్వరూపమని, వ్యాసుడు తన భాగవతమే శ్రీకృష్ణుని స్వరూపమని అభివర్ణించియున్నారు. త్యాగరాజస్వామి తాను వుపాసించు నాదమునే శ్రీరాముని స్వరూపముగా వర్ణించి ధన్యులయ్యారు.

నాదము వలన అక్షరము, అక్షరముచే పదము, పదముచే వాక్యము, వాక్యముచే లోక వ్యవహారము అగుట వలన యావజ్జగత్తు నాదాధీనమైనది. అట్టి నాదమును వుపాసించుటచే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు వుపాసింపబడినవారవుతారు. కావున వీరు నాదాత్మకులు. **"నాదోపాసనచే శంకర, నారాయణ, విధులు వెలసిరియో మనసా!"** అంటారు బేగడ రాగకృతిలో. సృష్ట్యాదిలో నారాయణుని నాభీ కమలమునుండి వెలసిన బ్రహ్మ, తనకేమియు తెలియక నాల్గుదిక్కులు చూచుచుండగా నాదము వినవచ్చెననియు, దాని మార్గము ననుసరించి వెదుకగా, నాదమూలమగు శుద్ధ చైతన్యజ్యోతి సాక్షాత్కరించి, త్రిగుణములు, ప్రకృతి వికాసములు, సృష్టి విజ్ఞానము వానికెరుక పడెననియు పురాణ ప్రసిద్ధి. దేవీ భాగవతమందు ఇది మనకు కనిపిస్తుంది. వస్తుమాత్రంగా అభిన్నంగా వున్న త్రిమూర్తులు, సృష్ట్యాదినుంచే విభాగింపబడ్డారని తత్త్వ శాస్త్రములు చెపుతున్నవి. ఈ విధంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల యొక్క నామ, రూప గుణముల యొక్క వికాసమునకు నాదమే మూల కారణమని, నాదోపాసనచే వారు తమకు తాము లోకులకు తెలియునట్లు వెలిసారని త్యాగయ్యగారి భావము. త్రిమూర్తులు వేదములను ఉద్ధరించినవారు, వేదాతీతులు, విశ్వమెల్ల నిండి వుండేవారు. వేదములు కూడా వీరి మహిమను తెలియచేయలేవు. అట్టి వారే నాదోపాసకులైనప్పుడు ఇంక వేరేవారి మాట చెప్పనవసరం లేదని, నాదోపాసనామార్గంలో పయనించమని బోధిస్తున్నారు త్యాగయ్య.

అటువంటి నాదము యందు ఆసక్తి పొంది, **'నాదలోలుడై బ్రహ్మానందమొందవే మనసా'** అంటూ తన మనస్సునకు బోధించుకున్నట్టుగా, లోకులకు తెలియచేస్తున్నారు కళ్యాణ వసంత రాగకృతిలో. సప్తస్వరములు, వీటి భేదములతో కూడిన రాగ సమూహములు వివరముగా యెఱింగి, శుద్ధ చిత్తముతో ఉపాసించే వారికి, అవ అమృతఫలమును అనుగ్రహిస్తాయంటారు. ఇట్టి నాదమునే హరిహరాదులు, ఇంద్రుడు, గణపతి, సుబ్రహ్మణ్యాదిగా గల దేవతలు, మునులు ఉపాసించారని తెలియచేస్తున్నారు.

ప్రపంచంలో బ్రహ్మానందము కలిగించే చతుష్షష్టి కళల్లో ముఖ్యమైనవి నాదము, ప్రణవము సప్త స్వరములు, వేదములు, మంత్రావర్ణములు, శాస్త్రములు, పురాణాలని, వాటి భేదము చక్కగా తెలియచేసేది మానవ దేహమేనని అంటూ, వృధాతర్కము మాని, నాదప్రణవాది కళలన్నిటితో కూడి రామభజన చేసి తరించమని దానికన్నా బ్రహ్మానందము లేదని అంటారు. **"భజన చేయవే మనసా – పరమ భక్తితో"** అనే కళ్యాణిరాగకృతిలో...

తత్త్వశాస్త్రము యొక్కయు, సంగీతము యొక్కయు పరమార్థము ఒక్కటే అని తెలియ చేసే కీర్తన **"గీతార్థము – సంగీతానందము నీ తావున చూపరా మనసా"** (సురటి రాగం) ఈ విషయం ఆంజనేయునికి చక్కగా తెలుసని అంటారు. **"కర్తా సంగీత శాస్త్రస్య హనుమాంశ్చ మహాకపి:"** సంగీత శాస్త్ర ప్రవక్త హనుమంతుడు. మహాభారత యుద్ధంలో అర్జునుని రథమునకు కేతనమై వుండిన ఆంజనేయుడు కృష్ణుడు వుపదేశించిన భగవద్గీతను ధారణ చేసినట్లు ప్రసిద్ధి. ఆయన వేదవేత్త, నవ వ్యాకరణ పండితుడు, బ్రహ్మవేత్త. అయినా సీతాపతి పాదసేవకుడై గీతార్థమునే సంగీతానందముగా అనుభవించి జీవన్ముక్తుడైన మహనీయుడు. కావున నాద బ్రహ్మోపాసన చేసి, ధ్యానయోగమును అనుష్ఠించమని బోధిస్తున్నారు త్యాగరాజస్వామి.

**"రాగసుధా రసపానము చేసి రంజిల్లవే ఓ మనసా"** అనే ఆందోళికా రాగకృతిలో, రాగమనెడి అమృతము త్రావి వికాసము పొందమంటున్నారు. రాగసుధారసము యాగ, యోగ, త్యాగ, భోగమనే చతుర్విధ ఫలములను ఒసగుతుంది. శ్వాసోచ్ఛ్వాసాన్ని, స్వాధీనం చేసుకుని నినాదాన్ని తైలధారవలె అనుసంధానం చేసి రాగ రాగిణులను ఆరాధించే సమయాన గాయకులు పొందేది యోగసమాధి స్థితి. పాడే సమయాన ఊపిరి బిగపట్టి ఉచ్ఛ్వాస, నిశ్వాసలను నియంత్రణలో నుంచుకొనుట ప్రాణాయామము వంటిదే. బాహ్యమయిన విషయములను మరిచి, నాదము యందు లీనమై శ్రుతి లయబద్ధంగా పాడేటప్పుడు కలిగే స్థితి ఆత్మార్పణము వంటిది. అంటే త్యాగఫలాన్నిచ్చేది. అదేవిధంగా అన్నీ మైమరచి,

ఏకాగ్రతతో గానము చేయు సమయమున కలిగే అవర్ణనీయమై ఆనందము, సుఖానుభవము, భగవద్గుణాలను అనుభవించడము భోగఫలాలని చెప్పవచ్చు. ఇక నాదాత్మకుడైన ఆ పరమశివుని నాదోపాసనచే అర్చన చేయుటే యాగము. ఈవిధంగా చతుర్విధ ఫలాలను యిస్తుంది నాదోపాసన.

ఈవిధంగా రాగమునకు పునాదియైన నాదము సదాశివమయ మైనదని, దానిని ఓంకార రూపమున అర్చించినవారు జీవన్ముక్తు లౌతారని తెలియచేస్తున్నారు త్యాగయ్య.

అటువంటి **'శ్రీనాయికాఖిల నైగమాశ్రిత సంగీత జ్ఞానమను బ్రహ్మానంద సాగరమీదని దేహము భూభారమే'** అంటున్నారు (ఆనందసాగర మీదని దేహము గరుడ ధ్వని రాగకృతి).

**"సంగీత శాస్త్ర జ్ఞానము"** అనే ముఖారి రాగకృతిలో శృంగార రసాద్యఖిల సార పూరిత రామ కథానందాబ్ధియుత సంగీత శాస్త్ర జ్ఞానము సారూప్యసౌఖ్యదము అంటున్నారు. అనగా శృంగారాది నవరసములతో కూడిన శ్రీరాముని దివ్యచరిత్రములో ఒక్కొక్క సన్నివేశం స్మరించినంతనే రసోత్కర్ష వలన చిత్తము తన్మయము చెందుతుంది. అట్టి ఆనందముతో సంగీతశాస్త్రము అనగా నాదోపాసన కూడా మేళవమయితే శ్రీరాముని సారూప్యము – సమాన రూపభావనమనెడి ముక్తి కూడా కలుగుతుందంటారు.

కావున సంగీత జ్ఞానము, భక్తి వినా సన్మార్గము లేదంటున్నారు (ధన్యాసి రాగకృతి). భృంగి, నటేశ, సమీరజ, ఘటజ, మతంగ నారదాది మునులు సంగీతోపాసన చేసి ధన్యులయ్యారు అంటున్నారు. ఇక్కడ సంగీతజ్ఞానమునకు, భక్తికి ఏకత్వాన్ని నిరూపిస్తున్నారు.

అందుచే అటువంటి సంగీత కోవిదులకు నమస్కరిస్తున్నాను. విదులకు మ్రొక్కద (మాయా మాళవ గౌళ రాగకృతి) సంగీత కోవిదులకు మ్రొక్కెద అనే కృతితో ఏయే స్వర విన్యాసములతో నాదోపాసన మొనర్చితే ఈశ్వర సాక్షాత్కారము లభించునో అట్టి స్వర విన్యాసములతో శంకరుడు సామవేద గానము చేసెనట. ఆ సామవేద తత్త్వాన్ని ఎరిగిన కోవిదులకు లక్ష్మీదేవి మొదలుకొని, త్యాగరాజుకు పూర్వులైన నీరద, కాశ్యప, భరత, శార్జదేవ, సోమాద్రివాది వరకు గల నాదోపాసనకులను కీర్తించారు. వీరందరూ సంగీత లక్ష్యలక్షణకర్తలు.

అటువంటి నాదము యొక్క వుపాసనా పద్ధతిని, ప్రాశస్త్యాన్ని ఎరుంగలేని అజ్ఞుల గురించి చెప్తూ **"వరరాగల యజ్ఞులు తామనుచు వదరేరయ్య"** (చెంచు కాంభోజి రాగం) అంటారు ఒక కృతిలో. మానవదేహము నందు పుట్టు నాదములన్నీ ప్రణవాకారమేనని, అట్టి నాదము ప్రణవమునందు లయించుట నాదోపాసకుల లక్ష్యమన చెప్తూ, ఎరింగి సంగీతోపాసన చేసి సిద్ధి పొందవలెను కాని, మేమే గొప్పవారమని సంగీత జ్ఞానులమని అహంకరించరాదంటారు.



Tyagaraja | Muthuswami Dikshitar | Syama Sastri

సంగీతము యొక్క లక్ష్యము కేవలము ఐహికమైనది కాదు, పరలోక సాధనయే దాని యొక్క అంతిమ లక్ష్యం.

కావుననే ఇహపర సుఖదాయకము, కైవల్య ప్రదము అయిన సంగీత విద్య, ఆ శాస్త్రము యొక్క సంప్రదాయము నెరుంగవలనన్నచో లలాటమందు బ్రహ్మ లిఖించి వుండాలి అంటారు **"సీతావర సంగీత జ్ఞానము ధాతవ్రాయవలెరా"** అనే దేవగాంధారి రాగకృతిలో. ఆకాశం – శరీరం – బ్రహ్మ అనే ఉపనిషత్ వాక్యానుసారం, తన ఆత్మారాముని పరమాత్మతో సరిచూచుచు ఒక్కటిగా అనుసంధానము చేయుచు వీటికి పరస్పర సంబంధము కలిగించునది, సుస్వర నాదమని తెలిసి నాదోపాసన చేసినచో జీవన్ముక్తి సిద్ధించునని భావము. అది లలాట లిఖితము వలననే సాధ్యం.

త్యాగరాజ స్వామి నాద ప్రశంసాత్మకమయిన కృతులలో మరింత ప్రాశస్త్యమయినది **"స్వరరాగ సుధారసయుత భక్తి స్వర్గాపవర్గమురా ఓ మనసా"** అనే కృతి (శంకరాభరణం రాగకృతి).

స్వరములు, రాగములతో హృదయమున అమృతధారను కలుగచేయు రాగముతో కూడిన భక్తి స్వర్గమును, మోక్షమును కలుగచేస్తుందంటారు. సంగీతము భక్తియనే పునాది మీద నిర్మాణము కావలెనని లేనిచో అది కమలము మీద కప్పలు, కొంగలు తిరిగినట్లే నని (కమలము మీద రసాస్వాదన చేయగలిగినవి మధుపమ్ములు మాత్రమే) చెప్తున్నారు. భక్తి లేని నాదోపాసనచే జీవునకు ముక్తిఫలం దూరమై పోతుంది. మూలాధార చక్రమందు సహజమై, నిర్వికారమయిన నాదాన్ని గుర్తించి, సప్తస్వరముల వుత్పత్తి స్థానముల నెరింగి చేసే నాదోపాసన ఆత్మ దర్శనము నెరిగిస్తుంది. చిత్త నైర్మల్యం లేకుండా భజన చేయడం, మద్దెల తాళగతులు తెలియకుండా మర్దించటం వంటిది మరియు సూకర వృత్తి వంటిది.

**"బాహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే"** అనేది గీతావాక్యం. బహుజన్మలలో పుణ్యం చేసి జ్ఞానం పొందటం మోక్షము. కాని స్వతస్సిద్ధముగా సహజనమైన భక్తి గలిగి, రాగజ్ఞానము కలవారు, హృదయమందు చైతన్యవికాసములు వెల్లివిరియునట్లు చేయగలవారు జీవన్ముక్తులు కాగలరని తెలియచేస్తున్నారు త్యాగయ్య. ఈశ్వర రూపమైన నాదము, సాధకునికి ఈశ్వరునితో కల సహజమైన, నిరంతరాయమైన నిరూపిస్తుంది, జీవన్ముక్తుణ్ణి చేస్తుంది.

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2025

ఈ కృతిలో భక్తి మరియు నాదోపాసనకు కల అవినాభావ సంబంధాన్ని తెలియచేస్తున్నారు. ఒకటి లేనిదే ఇంకొకటి లేదు. రెండు లేవు వున్నది ఒక్కటే అనేది భావన.

ఈవిధంగా త్యాగరాజస్వామి కృతులన్నీ రామనామ ప్రాశస్త్యాన్ని, రామభక్తి మార్గమును, నాదోపాసనా భక్తి మార్గాన్ని ప్రవచించేవే. **"తంబురబట్టి, నిద్దుర నిరాకరించ సంగీతసాధన చేయవలెనని"** అనే కృతిలో, **"వేకువజామున వెలయుచు తంబుర చేకొని గుణములు చెలు వొందపాడమని"** (కొలువమలె గదా – తోడి రాగకృతి), సంగీత సాధనతో ప్రణవరూపియైన రామభజన చేయమని హితవు పలికారు. సొగసుగా మృదంగ తాళము అనే శ్రీరంజని రాగకృతులు) వుద్బోధించారు.

ఇంక చివరగా, ముఖ్యంగా చెప్పవలసినది త్యాగరాజస్వామి రచించిన 'మోక్షము గలదా' అనే కృతి. వారి రచనలలోనే ఇది ఆణిముత్యం. ఆ కృతిలోని అర్థ గాంభీర్యము, రాగ మాధుర్యము అనుభవించితే గాని అర్థం కావు. "సారమతి" అనే అపురూపమయిన రాగంలో స్వరపరిచారు. ఈ రాగాన్ని మొదటగా త్యాగరాజస్వామి వారే వుపయోగించారు.

**"మోక్షము గలదా భువిలో జీవన్ముక్తులు గాని వారలకు ॥మోక్షము॥**
**సాక్షాత్కార నీ సద్భక్తి – సంగీత జ్ఞాన విహీనులకు ॥మోక్షము॥**
**ప్రాణానల సంయోగము వల్ల**
**ప్రణవ నాదము సప్త స్వరములై బరుగ**
**వీనా వానదలోలు డీ శివమనో**
**వితంబెరుగరు త్యాగరాజ వినుత"**

పరమాత్మ యొక్క నివాసం లేదా వాని గుర్తు ఆ కృతియే ప్రణవనాదం. ఈ ప్రణవ నాదం. జీవుల అంతశ్శరీర మందలి ప్రాణవాయువు – అగ్ని కలయిక వలన సప్త స్వరములుగా భాసిల్లింది.

మానవ శరీరమునకు 'మానుషీ వీణ' అనే పేరు వుంది. శరీరంలో వెన్నముకకు 24 (గళ్ళు) స్థానాలు. ఈ 24 గళ్ళు గాయత్రీ బీజాక్షరములకు నిలయం. ఇడా – పింగళ – సుషుమ్న నాడులలో బుద్ధి స్పందించగా ఓంకార ప్రణవనాదం చక్కగా వినిపించును. కుండిలినీ శక్తికి యిది ప్రతీక. (మనం వాయించే వీణ కూడా మానుషీకరణకు ప్రతీకయే) వీణలోని ఈ అంతర్నాద రహస్యమెరుగుటే పరమాత్మ తత్త్వ రహస్యమెరుగుట. ప్రణవ స్వరూపుడగు శివుడు సదా వీణావాదనయందు లోలుడై వుంటాడు. "శివమనో వితంబెరుగరు" అని చెప్పటం యిది చాలా నిగూఢమైంది కష్టసాధ్యమయినదని చెప్పటమే. అట్టి సప్త స్వరజ్ఞానమే నాదోపాసనకు మూలం.

కావున అట్టి సంగీత జ్ఞనము. భగవంతుని యందు గల భక్తితో చేరినచో వానికి తనలో అంతరాత్మ రూపమయి, సాక్షాత్కారమై యున్న పరమాత్ముని యొక్క స్ఫురణము లభిస్తుంది. ఇదియే పరమాత్మ సాక్షాత్కారము జీవన్ముక్తి. ఈవిధంగా నాదోపాసనా అంతిమ లక్ష్యాన్ని, హృద్యంగా వివరించారు ఈ కృతిలో త్యాగయ్య.

ప్రపంచంలో గొప్ప ప్రబంధములు రచింపగల ఉత్తమ కవులు మరియు సంగీత లక్షణ సాంప్రదాయములతో పాట నేర్చిన వాగ్గేయకారులు వున్నప్పటికీ, భావముతో నిండియుండు రచనలు చేసేవారు అరుదు. భావము అనగా సుశబ్దముతో మనసారా ప్రేమ వుట్టిపడునట్లు భగవంతుని సంకీర్తనము చేయునపుడు కలిగే ఒక హృదయ పరిపాకము. అది త్యాగరాజులవారికే సాధ్యం. భక్తి లేని కవి జాలవరేణ్యులు భావమెరుగ లేరని (దాశరథీ నీ ఋణము దీర్చతరమా – తోడిరాగ కృతిలో) త్యాగయ్యే అన్నారు. దీనివలన త్యాగరాజ కీర్తనలలోని గొప్పదనం మనకు తెలుస్తోంది.

త్యాగరాజ కీర్తనలు సంగీత, సాహిత్య, వేదాంతాల యొక్క అపూర్వ సంగమాలు. పేరు భక్తి సమ్మేళనాలు భావపరిపూరితాలు. సంగీత, సాహిత్య, వేదాంత శాస్త్రాలలో పరిపూర్ణులయిన వారే వారి కీర్తనల సారాన్ని గ్రహించగలుగుతారు, వ్యాఖ్యానించగలుగుతారు. సంగీతానికి దైవత్వాన్ని తెచ్చారు త్యాగయ్య. చిన్న, చిన్న అలతి పదాలతో కూడా సత్య వివరణ చేసారు. ఉపనిషత్సారాంశాలను బోధించారు. సమాజానికి హితాన్ని తెలియచేసారు వేమనలాగా. ఒక్కొక్కరాగంలో అనేక కీర్తనలు రచించి, ఆయారాగముల యొక్క వివిధ కోణాలను, రసాలను, ఒక్కొక్క కీర్తనలో ఆవిష్కరించారు. త్యాగరాజస్వామి ప్రవేశంతో దక్షిణ భారతీయ సంగీత చరిత్ర – త్యాగరాజస్వామికి పూర్వం – త్యాగరాజుని కాలం – త్యాగరాజుని తరువాత కాలంగా విభాగింపబడింది. త్యాగరాజస్వామి కీర్తనలలో సాహిత్యం గొప్పదా, సంగీత రూపకల్పన గొప్పదా, భక్తి అనే అంశము గొప్పదా అని చెప్పటం కష్టం. వీటిన్నింటి మేలు కలయికే వారి సంగీతం. ఆయనకు మనం అంతా ఎంతో ఋణపడి వున్నారు. వారి సంగీతాన్ని, సంగీత సంప్రదాయాన్ని కాపాడుకోవడం మన విధి.

**"నాహం వసామి వైకుంఠే న యోగి హృదయమే రవే**
**మద్భక్తా యత్ర గాయంతే తత్ర తిష్ఠామి నారద" (నారద సంహిత)**



ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3 (27) హైదరాబాద్ జనవరి : 2025

# తెలుగునాట జోగిని వ్యవస్థ – పూర్వాపరాలు

**పేరం అమృతరావు,** పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం. ఫోన్ : 891 908 7108

**పరిచయం**

జోగిని వ్యవస్థ ఆచార వ్యవహారాలలో వ్యత్యాసం ఉన్నప్పటికీ దేవదాసీ వ్యవస్థను పోలిన వ్యవస్థ. తెలుగునాట ప్రాంతాలను బట్టి ఈ జోగిని వ్యవస్థను బసవి, మాతంగి, మరియమ్మ, పార్వతమ్మ మొదలైన పేర్లతో దీనిని పిలుస్తారు. ఈ సంప్రదాయంలో గ్రామదేవతలైన ఎల్లమ్మ, పోచమ్మ, మరియమ్మ, ఉళిగమ్మా, సుంకాలమ్మ మొదలైన దేవతలకు, మురుగన్, హనుమాన్, ఖండోబా, చిన్నఓబులేసు అనే దేవుళ్ళకు బాల్యంలోనే దళితులు, వెనుకబడ్డ అమ్మాయిలను జోగినిలుగా సమర్పిస్తున్నారు. జోగినిలుగా మార్చాలంటే రెండు రకాలైన ఘట్టాలున్నాయి. జోగుపట్టం, మైలపట్టం. జోగుపట్టం అంటే జోగినిగా బాల్యంలోనే అర్పించాలి, ఒక్కొక్కప్పుడు నెలలపిల్ల కూడా కావచ్చు లేక గర్భస్థశిశువై ఉండొచ్చు. పోతురాజు (ఎల్లమ్మ పాదముద్ర) ఉండే తోలుబిళ్ళతో మంగళ సూత్రధారణ చేస్తాడు. ఆనాటి నుండి ఆమె 'నిత్యసుమంగళి' గా వుంటారు. ఇతరులకు లేని హక్కులు, బాధ్యతలు ఆమెకు ఉంటాయి. ఇక మైలపట్టం విషయానికి కొస్తే జోగినిగా మారటానికి పెద్దతంతు జరుగుతుంది. దానికి అయ్యే ఖర్చు మొత్తం ఒక భూస్వామి భరిస్తాడు అతనితోనే మైలపట్టం జరుగుతుంది. అంటే ఆ భూస్వామి ఆ జోగిని కాబోయే అమ్మాయితో సంగమిస్తాడు. స్త్రీలను దేవతలకు అంకితం ఇచ్చే ఆచారం చాలా ప్రాచీనమైనది. గ్రీక్, రోమన్, ఈజిప్టు మొదలైన ప్రాచీన నాగరికతల్లో కూడా ఈ ఆచారం ఉండేది.

గ్రీకు చరిత్రకారుడైన హెరిటోడష్ బాబిలోనియా దేశంలోని 'మైలిట్టా' దేవాలయంలో స్త్రీల శీలాన్ని ఆ దేవాలయానికి అర్పిస్తున్నట్లుగా వివరించాడు. సాధారణంగా స్త్రీలు వాళ్ళ శీలాలను గానీ, తలనీలాలను గానీ దేవుడికి అర్పించే సంప్రదాయం అక్కడక్కడ కనిపిస్తుంది. ఫొనీషియా, కానన్, పేషన్, సైప్రెస్ మొదలైన దేశాలలో మాత్ర దేవతారాధన అమలులో ఉంది. "ఆమెను (Ashstart), అఘూరెత్ (Aghoreth), ఎస్ట్రేట్ (Astrate), పేర్లతో పిలుస్తారు. వీళ్ళ లక్షణాలన్నీ బాబిలోనియాలోని 'ఈస్టర్ గాడెస్' తో సమానంగా ఉన్నాయి. పొంటస్లోని 'కోమన' దేశంలో స్త్రీలు వ్యభిచరించేదానిని పవిత్రంగా భావిస్తారు. సైప్రస్ లోని 'కిటియన్' దేవాలయంలో పురుషులు కూడా దేవుళ్ళకు అర్పించడం అనే ఆచారం ఉన్నది. మహారాష్ట్రలోని ఖండోబా దేవుడికి వ్యాఘ్యాలను, కర్ణాటకలోని వాగయ్యలను, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో పోతురాజుల, ఊలిగమ్మలు ఈ ఆచారం క్రిందికే వస్తారు." 'ఆంధ్ర శబ్దరత్నాకరం' నిఘంటువుననుసరించి జోగిని అనే పదానికి నిఘంటుకారుడు **"ఒకానొక స్త్రీ దేవతని, సోదెగత్తెని, సన్యాసిని, బిచ్చగత్తె"** అనే అర్థాలను చెప్పాడు. ఇక్కడ 'జోగు' అంటే బిచ్చము అని, జోగురాలు అంటే బిచ్చగత్తెని, జోగులమ్మ అంటే సోమరియై తిరుగు ఆడది అనే అర్థాలున్నాయి.

ఉజ్జయినిలో మహంకాళి దేవాలయంలో దేవదాసీలుండేవారని 'కాళిదాస' మహాకవి తన 'మేఘసందేశ' కావ్యంలో చెప్పాడు, అంతేకాక మాతంగపదం తాను రచియించిన 'శ్యామల దండకం' ఆరంభంలో ఇష్టదేవత స్తుతి చేస్తూ ఈ విధంగా చెప్పాడు.

**"మాణిక్యవీణా.. ముఫలాలయంతీం**
**మదాలసాం మంజులవాగ్విలాసామ్**
**మాహేంద్రనీలద్యుతి కోమలాంగీమ్**
**మాతంగకన్యామ్ మనసాస్మరామి"**

**ఆదిమ సమాజంలో స్త్రీ, పురుష సంబంధాలు :**

**"మానవజాతి పరిణామక్రమాన్ని ఒక గంట సినిమాగా తీస్తే అందులో 59 నిమిషాలు ఆదిమ దశ నుండి పైకి పెరగటానికి సరిపోతుందని హైమైన్ లేవీ తన 'సోషల్ థింకింగ్' అనే గ్రంథంలో వివరించాడు".** క్రూరమృగాల బారి నుండి తన ప్రాణాలు కాపాడుకోవడంతోనూ గడిచింది. క్రమంగా పనిముట్లు మెరుగుపరుచుకొని బ్రతుకుతెరువు బాగుచేసుకుంటూ ప్రకృతి వైపరీత్యాలు తట్టుకోవడం నేర్చుకున్నాడు. జంతువులను మచ్చికచేసుకుని వ్యవసాయం, చేతివనుల్లో మెలకువలు తెలుసుకున్నాడు. అతడు వస్తుతయారిలో కొత్తమార్గాలను అన్వేషించాడు. తనకు పోను మిగిలింది ఇతరులకు ఇచ్చి పుచ్చుకోవటం ప్రారంభించాడు. ఈవిధంగా మానవుడు సమస్త జంతుజాలం నుండి వేరుకాబడి తనకంటూ ఒక ఇల్లు, ఒక కుటుంబం, ఒక తెగగా పరిమితులు ఏర్పరచుకున్నాడు.

ఇక స్త్రీ విషయానికొస్తే ఆధునికసమాజంలో స్త్రీకి అబలత్వాన్ని ఆపాదించడం జరిగింది. ఆదిమసమాజంలో స్త్రీ అన్నిరంగాల్లోనూ పురుషుడికి ఏమాత్రంతీసిపోలేదు. శారీరకక శ్రమలోను, ధైర్యసాహసాలలోనూ, ఓర్పులోనూ, నేర్పులోనూ స్త్రీలు సమఉజ్జీలుగా ఉండేవారు. "కాంగోలో ఆదంభిల జాతుల్లో పురుషుల కంటే స్త్రీలు బలిష్టంగా ఉంటారని హెచ్. హెచ్ జాన్సన్ పేర్కొన్నాడు". "బ్రిటిష్ కొలంబియాలో స్త్రీలు మగవారితో సమానంగా వేటాడేవారని ఎస్.ఎస్ వ్యాల్యూషన్ పేర్కొన్నాడు".

**వైదిక సమాజంలో స్త్రీ :**

నాటి సమాజంలో స్త్రీకి ఎన్నో కట్టుబాట్లు ఉన్నాయి. ఇక

ఆంధ్రదేశంలో మొదటిసారిగా స్త్రీల గురించి ప్రస్తావన ఆంధ్రదేశాన్ని మొదటిసారిగా పాలించిన శాతవాహనుల శాసనాలలో హాలుడు రాసిన 'గాథా సప్తశతి' లోనూ గుణాఢ్యుని 'బృహత్ కథ' ను అనుసరించి రాసిన 'కథాసరిత్సాగరం' కనిపిస్తుంది. వైదిక సమాజంలో రెండు రకాల స్త్రీలు కనిపిస్తున్నారు.

ఇక కులస్త్రీలలో విద్యనేర్చినవారు అనేకమంది ఉన్నారు. వారిలో అగ్రకుల స్త్రీలు బాగా చదువుకున్నారని వివిధ శాసనాల ద్వారా తెలుస్తుంది. అందుచేతనే రాజులుసైతం తమ మాతృమూర్తులకు ప్రథమ స్థానం ఇచ్చారు. తమతల్లి పేర్లను ముందుచెప్పి తర్వాత తమపేర్లు చెప్పుకునేవారు. వాశిష్టీపుత్ర పులోమావి, గౌతమీపుత్ర శాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణి మొదలైనవారు. నాగార్జునకొండ శాసనంలో ఏకంగా 'పండిత స్త్రీల' ప్రస్తావన ఉంది. సామాన్యస్త్రీలు కూడా ఆ రోజుల్లో ఎంతోకొంత చదువుకొని ఉన్నారని, దూరప్రాంతాలకు పోయి భర్త తిరిగిరాకపోతే భార్య దిగులుతో ఉత్తరాలు రాసినట్లు గాథాసప్తశతిలో కనిపిస్తుంది. ఇక్ష్వాకుల కాలంనాటి అమరావతి శాసనంలో అనులక్ష్మి, మాధవి, లోహ, రేవ అను కవయిత్రుల పేర్లు పేర్కొనబడినాయి.

### వేశ్య వృత్తి

సంఘం లోని వేశ్యల గురించి అనేకగ్రంథాల్లో రాయబడి ఉంది. ఆంధ్రదేశంలో శాతవాహనులకాలంలో అనేకమందిని వేశ్యలు ఉండేవారు. వారిని 'వారాంగనల' ని చెప్పేవారు. 'గాథాసప్తశతి' ని బట్టి ఆకాలంలో వేశ్యలకు రసికజనసమాజంలో సంపూర్ణప్రవేశం ఉన్నట్లు తెలుస్తోంది, 'వాత్సాయన కామసూత్ర' లో వారికి అపార మర్యాదలు ఇవ్వబడ్డాయి, వారు పరమవిదుషీమణులుగా కీర్తించబడ్డారు. చతుర్షష్టి కళలందు రాజనీతిలో ఎనలేని పాండిత్యం వారికి ఉండేది. రాజనీతికి సంబంధించిన కార్యక్రమములను వారిద్వారా రాజులు సాధించుకునేవారు, వారికి రాజ్యసభలో ప్రవేశం ఉండేది, అక్కడ సంగీత, నృత్య ప్రదర్శన కూడా ఇచ్చేవారు.

ఆ కాలంనాటి నన్నేచోడుడి 'కుమార సంభవం', పాల్కురికి సోమన 'పండితారాధ్య చరిత్ర', శ్రీనాథుని 'పల్నాటి వీరచరిత్ర' లో వేశ్యల గురించి విశేషంగా వర్ణించబడింది. నన్నెచోడుడు వేశ్యలకు 'వెల యాల' (వేలకు కొనబడు స్త్రీ ), లంజా, జారకామి అనే పేర్లను చెప్పాడు. **"ఒక జాలరి వేయగా వలలో పడు చాపల రీతిగా వయసులో ఉన్న పురుషులపై వలపన్నీ వారిని లోబరుచుకుందురని ఆయన వివరించాడు"**. పాల్కురికిసోమన పండితారాధ్య చరిత్ర పురాతన ప్రకరణములో వేశ్యల ప్రస్తావన గురించి వారి స్వభావాల గురించి సుమారుగా 50కి పైన విశ్లేషణలను వాడాడు. ఉదా: ఎడపరులు, కత్తి గోండ్లు, మందుల మార్లు మొదలైనవి.

### భోగ స్త్రీలు

కులస్త్రీలకు భిన్నంగా ఆరోజుల్లో భోగస్త్రీలు ఉండేవారు. వారికికూడా సంఘంలో గౌరవప్రదమైన స్థానం ఉండేది. వారు రాజులవద్ద, సామంతులవద్ద, దేవాలయాల్లో జీవితం గడిపేవారు. ప్రాచీనకాలంలో గ్రీకుదేశంలో ఇలాంటి స్త్రీలు ఉండేవారని, వారిని 'హైటెరా'లని పిలిచేవారు. ఈ భోగస్త్రీలకు వివాహ సంబంధంలేదు కానీవారు కులస్త్రీలు లాగానే ఒకే పురుషుడిని నమ్ముకొని ఆ పురుషుడు మరణించగానే విధవగా ఉండిపోయేవారు. తిరిగి ఇంకో పురుషునితో సంబంధం పెట్టుకునేవారు కాదు. మధ్యయుగంనాటి శాస్త్రనాధారాలను బట్టి చూస్తే కొంత మంది భోగస్త్రీలు మనకు కనిపిస్తున్నారు.

1. సిరియాల దేవి – హనుమకొండ మాధవ వర్మ తల్లి
2. రాణి వసంత పోణి – ఉత్తమాదిత్యుని తల్లి
3. అయ్య మహాదేవి – కుబ్జ విష్ణువర్ధనుని రాణి
4. శీలమహాదేవి – గుణగ విజయాదిత్యుని తల్లి
5. మిరియాల కామసాని – కాకతీయ రాజ్యము ఏలిన ధీశాలిని
6. నతవాటి మైలమ, కుందువాంబ – గణపతి దేవుని సోదరీమణులు
7. ఉదయాంబ – కాకతీయ రుద్రమదేవి అత్త

ఇంకా కొంతమందిని పాల్కురికి సోమనాథుడు తన రచనలలో పేర్కొన్నాడు.

### సానులు :

శాసనాలలో స్త్రీలను పేర్కొన్నప్పుడు తరచూ 'సాని' అనే పదమును వాడేవారు. ప్రస్తుత సమాజంలో సానిపదం నీచార్థంలో ఉపయోగించబడుతున్నది. కానీ మధ్య సమాజంలో అలా కాదు ఏ కులంలోనైనా స్త్రీలను సాని అనే పేరుతో పిలిచేవారు. ఉదా: గోకసాని, కాపుసాని, సురాసాని అని వారిని సంబోధించేవారు. సామంతులయొక్క బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య సోదర యొక్క తల్లులను సానులనే పిలిచేవారని శాసనాల్లో చెప్పబడింది. అంతేకాక సానులకే 'దేవదాసి' లని పర్యాయపదము.

### జోగిని వ్యవస్థ

జోగినివ్యవస్థ ప్రధానంగా నిమ్నజాతుల్లో ఉన్న వ్యవస్థ. ఈ విధానంలో గ్రామదేవతలైన ఎల్లమ్మకు, పోచమ్మకు, బైనిళ్ల మంచిరోజు నిర్ణయిస్తే ఆ రోజు గ్రామదేవత ఆలయానికి ఆమెను అర్పిస్తారు. ఈ ఉత్సవాన్ని దాసరులు, పురోహితులు, పోతురాజులు నిర్వహిస్తారు. మతసంబంధమైన నమ్మకాలకు, ఆచారాలకు గ్రామదేవతలను ఆరాధించడం ఒక ముఖ్య కార్యక్రమం. గ్రామాల్లో ఊరపండగలు చేస్తారు. వీటిలో సాధారణంగా భక్తులు తమ కోరికలు తీరాలంటే నైవేద్యంగానీ, జంతువులను గానీ, స్త్రీలను గానీ దేవతలకు అర్పించాలి. స్త్రీలకు శీలం ప్రధానం కాబట్టి ఆ శీలాన్ని అర్పించడం అనేది ఆచారాలకు, సంప్రదాయాలకు అనుగుణంగా అమల్లోకి వచ్చింది.

హైందవ సమాజంలో దళితుల నుంచి వచ్చిన ఒక దారుణమైన అనాగరికమైన ఆచారం ఈ జోగిని వ్యవస్థ అయితే, ప్రాచీన కాలంలో ఉన్నత కులాల్లో దేవదాసి ఆచారం ఉన్నప్పటికీ అది రాను రాను నెమ్మదిగా నిమ్నకులాలకు ప్రవేశించి జోగినిగా, బసివినిగా, మాతమ్మగా, పార్వతములుగా ప్రాంతాన్ని బట్టి మారుతూ వచ్చింది. మెన్ హార్డ్ అనే రచయిత మత సంబంధమైన పడుపు వృత్తి సాధారణంగా మానవుడి పునరుత్పత్తి శక్తికి సంబంధించినదని, ప్రకృతిలో సాఫల్యతను పెంచడానికి ఉపకరిస్తుందని పేర్కొన్నాడు. ఫ్రెజర్ 1907లో తన ఆడోనిస్, ఆలీస్, ఒసరీస్ అనే గ్రంథంలో అత్యున్నతమైన మాతృదేవత, ప్రకృతిలోని పునరుత్పత్తి శక్తి కంతటికి మూల కారణమని పేర్కొన్నాడు.

ద్రావిడ సంస్కృతిలో గ్రామదేవతలు అసంఖ్యాకంగా ఉన్నారు. **"సప్త మాతృకలు ద్రావిడ సంస్కృతిలో ఎక్కువ, పోలేరమ్మ, ముత్యాలమ్మ, అంకమ్మ, బంగారమ్మ, మాతమ్మ, రేణుక అనే పేర్లు ఉన్నాయి. వీరికి తమ్ముడు పోతురాజు. ఎల్లమ్మదేవతకు చాలా పేర్లు వాడుకలో ఉన్నాయి. ఏకవీర, సంగమ్మ, వామలమ్మ, మావురమ్మ, మాతంగమ్మ అనేవి కూడా ఎల్లమ్మకు పర్యాయపదాలు."**

**జోగినివ్యవ్యస్థ నిర్మూలనకై పనిచేసిన సంస్థలు**

జగన్ మిత్రమండలి 1906లో దళిత వర్గాల అభ్యున్నతి కోసం మేదరి భాగ్యరెడ్డి వర్మ దీనిని స్థాపించారు. 1917లో ఈ సంస్థ ఆది ఆంధ్ర ఉద్యమానికి నాంది పలికింది. సంఘంలో ఉన్న మూఢాచారాల నిర్మూలనకు, అందులో ఒకటైన జోగిని వ్యవస్థను రూపుమాపడానికి ఈ సంస్థ ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. మాతంగి మహాసభ అరిగే రామస్వామి, భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షతన ఏర్పడిన సంస్థ మాతంగి మహాసభ దీనిని సికింద్రాబాద్ లో ఏర్పాటు చేసారు. దీని ద్వారా 'సునీతా బాల సమాజం' అనే సంఘాన్ని ఏర్పాటు చేసి జోగిని వ్యవస్థ నిర్మూలనకు పాటుపడ్డారు. 1922లో హైదరాబాద్ లో అఖిల భారత ఆది హిందూ సామాజిక సదస్సును ఏర్పాటు చేసి జోగిని వ్యవస్థని నిర్మూలించాలని ఆ సదస్సు ద్వారా తీర్మానం చేసారు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ 'కుముద్ బెన్ జోషి' జోగిని వ్యవస్థ నిర్మూలనకు కృషి చేసారు. నీసా అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి జాతీయ స్థాయిలో సాంఘిక సంస్కరణ సదస్సును ఢిల్లీలో నిర్వహించారు. 1987లో అప్పటికే స్టూవర్టుపురం నేరస్తజాతుల సంస్కరణను సమర్థవంతంగా పూర్తిచేసిన హేమలత లవణంను జోగిని వ్యవస్థ నిర్మూలనకై నిజామాబాద్ కు ఆహ్వానించారు. జోగిని స్త్రీల సాంఘిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయడానికి నీసా సంస్థ చైతన్య శిబిరాలను ఏర్పాటు చేసింది.

నాటి గవర్నర్ కుముద్ బెన్ జోషి. జోగినిలుగా మార్చబడ్డ స్త్రీలను దత్తత తీసుకోమని స్వచ్ఛంధ సంస్థలకు పిలుపునిచ్చారు. అందులో భాగంగా రెడ్ క్రాస్ సంస్థ 25 మంది జోగినీలను దత్తత తీసుకోవటమే కాకుండా వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించి, మధ్య వయస్కులైన జోగిని స్త్రీలకు తగు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారి జీవితాలను వారే బాగుచేసుకునే చక్కని అవకాశం కల్పించింది. 1983లో నిజామాబాద్ జిల్లాలోని వర్ని మండలం, బోధన్ డివిజన్ లో హేమలత లవణం దీనిని స్థాపించారు. అతితక్కువ కాలంలోనే ఈ సంస్థ విస్తృత ప్రచారంలోనికి వెళ్ళింది. 2000 సంవత్సరంలో మెదక్ జిల్లాకి కూడా ఈ సంస్థ కార్యక్రమాలు విస్తరించాయి. నిజామాబాద్ జిల్లాలో ఉన్న 2167 మంది జోగినీలకు పునరావాసం కల్పించడానికి 'చెల్లి నిలయాన్ని' స్థాపించారు. ఇది జోగిని స్త్రీలకు పుట్టినిల్లు లాంటిది.

జోగిని వ్యవస్థపై పలురకాల సాంఘిక పోరాటాలు జరిగాయి. దర్శి చెంచయ్య సలహా పై 'ఆంధ్ర యువతి' అనే పత్రిక సైతం యామినిపూర్ణ తిలకం నడిపింది. మద్రాసు నగరంలో 1923 సంవత్సరంలో ఆరంభమై 1930 వరకు కొనసాగి మూలన పడింది. ఈ పత్రికలో ప్రధాన సమస్య 'దేవదాసి వ్యవస్థ' తో పాటు ఆనాటి సమకాలిన వ్యవస్థలో సమస్యల పట్ల వ్యాసాలు, కథనాలు ఉండేవి. ఇక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు లాంటి ప్రముఖులు దేవదాసి వ్యవస్థ నిర్మూలన కార్యక్రమాల్లో చేయి కలిపారు.

**ముగింపు**

నేటి సమాజంలో మనుషులుగా తమ గుర్తింపును కోల్పోయి నిమనవర్గాల మహిళలు ఇప్పటికీ ఈ జోగిని ఆచారంలో కొట్టిమిట్టాడుతున్నారు. తెలుగునాట సామాజికోద్యమాలతో పాటుగా సాహిత్య సృష్టి కూడ అదే తరహాలో జరిగిందంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి అమానుష ఆచారాలపైన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపయుక్త గ్రంథ సూచి

1. పద్మరావు కత్తి, భారతీయ సంస్కృతిలో స్త్రీ, పొన్నూరు, లోకాయుత ప్రచురణలు, 1993.

2. లక్ష్మీరంజనం ఖండవల్లి, ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి, కర్నూల్, బాలసరస్వతీ బుక్ డిపో, 1957.

3. లలిత వకులభరణం, జోగిని వ్యవస్థ, హైదారాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2012.

4. వైదేహి అల్లాడి, ఆంధ్ర దేశము స్త్రీలు, హైదారాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ,1975.

5. సీతారామాచార్యులు బహుజనపల్లి, ఆంధ్ర శబ్దరత్నాకరం (ప్రథమ సంపుటి), చెన్నపట్నం, దేశభాషా గ్రంధకరణ, 1922.

❖ ❖ ❖ ❖ ❖

# సంస్కృతీ విరి శ్రుతి !!

**వి.ఎస్. ఆర్.ఎస్. సోమయాజులు,** కాకినాడ.
ఫోన్ : 94411 48158









మానవ జీవన పథాలు – ప్రాకృతికతలు
నవ్య క్రాంతుల శోభిల్లతలు – పండుగలు !!
మేషం నుంచి మీనం దాకా సౌర గమనాలు
ప్రతి సంక్రమణలూ – ప్రాధాన్య పర్వాలే!!
వర్తమాన కాలం చేస్తున్న చప్పుడు వ్యాపనాల్లో
నెల గంట పట్టిన లోగిళ్ళు – ధనుర్మాస సౌరులు
ఆ పై పుష్యమాసపు సుధలు – కనువిందులౌతుంటాయి
ఆరుగాలం శ్రమల ఫలితంగా – కలల పంటలు
గాదుల గరిశెల ధాన్యరాశుల్నిండితేనే కదా?!
కార్మిక కర్షకుల స్వేదానికి నికషోపలం;
సామూహిక దైన్యం నుంచి విడివడ్తూన్న దృశ్యం
మంచు కురిశే శీతగాలుల – హేమంత పౌష్యాలు
తరాల తెలుగుల సంస్కృతుల ఆలంబనలు
గోదా పాశురాల సంకీర్తనలు
ముంగిట రంగవల్లుల జాళ్ళు
వైకుంఠ పాళీల – వసుధ సూర్య రథాలవుతుంటాయి
మురిపాల మూడు రోజుల ముచ్చట్లు – గుమ్మిళ్ళ నడువ
భోగిమంటల క్రాగి భోజ్య మంటలు గ్రోలడం
పెద్ద పండుగ నాడు పితరాళి తరించే దానధర్మాలు
అపార సంపదల్నిచ్చే గోపూజ జలసేవనాలు
ఒకనాటి సంచార జనజీవితాలైన – హరికీర్తనా దాసులు
బుడబుక్కలు – పెనులింగమూర్తులు – పగటి వేషాలు
నేడు అస్తిత్వ వేదనలకు గురి కాబడుతున్నాయి
సంబరాల బాల్యం బతుకు చిత్రంలోంచి – తలపులు
తలపై జారిపడిన శనగలు – పూలు – నాణేలు
గతానుగతాలు – మరో జీవనానందపు బాసలు
ఆగామికి – పునర్వైభవాల్నిస్తుండాలి.

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3 (31) హైదరాబాద్ జనవరి : 2025

# దక్షిణ కాశీ ప్రశస్తి – ధర్మపురి

**యం. సంతు,** పరిశోధక విద్యార్థి, కాశీహిందూ విశ్వవిద్యాలయం, వారణాసి. ఫోన్ : 709 519 3082

భారతదేశంలో దివ్య నదుల పుట్టుక వెనుక మహర్షుల పూనిక కనిపిస్తుంది. తపస్సు ద్వారా, మహర్షుల కృషి ఫలితంగా మన జధాత్రిని సస్యశ్యామలం చేసే నదులు పుట్టినట్లు అనేక తార్కాణాలు ఉన్నాయి. సరస్వతీ నది పుట్టుకకు అంబరీషుడు చేసిన యజ్ఞం కారణం. త్రేతాయుగంలో దివిజ గంగ భువిపై పాదం మోపడానికి భగీరథ రాజర్షి కారణం. కావేరి వంటి దక్షిణాది పవిత్ర నదులు అగస్త్యుని వల్ల ఉద్భవించాయి.

యుగాల తరబడి తపస్సు చేసి చేసి అలసిపోయిన మార్కండేయ మహర్షి జలప్రళయ వేళ వటపత్రశాయి కడుపులో విశ్రాంతి పొందాడు. ఆ సమయంలో ఆ లీలామోహనుని ఉదరంలో లోకాలన్నీ భద్రంగా ఉండటం గమనించాడు. ఎన్నో విషయాలతో పాటు మార్కండేయుడు ప్రత్యేకించి గమనించింది దివ్య గోదావరిని. వ్యాసభారతంలో ధర్మరాజుకు మార్కండేయుడు చెప్పిన ఉపదేశంలో గోదావరి ప్రస్తావన మనకు కనిపిస్తుంది.

అందుకే అనంతామాత్యుడు అంటాడు కదా... **"కృతయుగపు వాడైన గౌతమ మహర్షి వల్ల ఈ గోదావరి నది గంగ కంటే ముందు పుట్టింది. ఫలితం ఇవ్వదలచుకుంటే గంగ కంటే ఎక్కువ పవిత్రమైనది గోదావరియే."** మహా మహా మహర్షులకే గోదావరి అంటే అంత ప్రేమ. నిత్యం సిద్ధసేవిత అయిన గోదావరిని ఎందరో మహాపురుషులు సేవించి తరించారు. ఆ వృత్తాంతాలన్నీ (బ్రహ్మాండ పురాణంలోని గౌతమీ మాహాత్మ్యం) చెబుతున్నాయి.

అసలు గోదావరి పుట్టినప్పటి మాట చెప్పుకుందాం. మాయాగోవు చనిపోయిన ప్రదేశం నుంచి గోదావరి ప్రవహించగానే తాను గోహత్యా పాతకం నుంచి విముక్తుడైనట్లు భావించాడు గౌతమ మహర్షి. అక్కడి నుంచి గోదావరి ఆనుపానులను గురించి ఆయనకు బెంగలేక పోయింది. ఉరకలై గోదావరి ముంచుకు వస్తోంది. సాగరగామినియై పరుగులు తీస్తోంది. నేటి కాలంలో ఆనకట్టలు కట్టి నీరు నిల్వచేసినట్లు సప్తరుషులు చేరి అఖండ గోదావరిని ఏడుపాయలుగా చీల్చి దారి మళ్లించారు. గోదావరి తీరం వెంట నవనరసింహస్వామి క్షేత్రాలలో రెండునై ధర్మపురి, అంతర్వేది క్షేత్రాలు ఈ తీరంలోనే దర్శనం ఇస్తాయి. ప్రతి నదికీ ఎన్నో పాయలు ఉంటాయి. వాగులు బయలుదేరి ప్రధాన స్రవంతిలో కలుస్తాయి. సప్తగోదావరి మాత్రం అలాంటిది కాదు. సప్తర్షులుగా మనం చెప్పుకునే ఋషులు గోదావరిని ఏడు శాఖలుగా మార్చిన సప్తర్షులు ఒకరు కాదు. ప్రస్తుతం నడుస్తున్న మన్వంతరంలో సప్తర్షుల పేర్లు ఇవి... కశ్యప, అత్రి, భరద్వాజ, విశ్వామిత్ర, గౌతమ, వశిష్ఠ, జమదగ్ని మహర్షులు. అయితే సప్త




గోదావరికి ఆ పేరు స్థిరపడిపోవడానికి కారణమైన ఏడు శాఖలను గురించి...

**"తుల్యాత్రేయీ భరద్వాజ గౌతమీ వృద్ధగౌతమీ**
**కౌశికీచ వశిష్ఠాచ తథా సాగరం గతాః"** ( భీ.పు.తుల్యభాగం)

అని చెప్పారు. ఇందులో... తుల్యభాగ నదిగా చెప్పుకునే నదీ శాఖ మొదట జమదగ్ని మహర్షిదే అని కొందరి వాదన. తుల్యభాగుడనే మహర్షి గౌతమీ ప్రవాహాన్ని మళ్లించడానికి ఎన్నో అవస్థలు పడ్డాడు. ఇసుక మేటలు వేసి ఇంకిపోయి నదిలో గోతులు తవ్వించి, వాటి నిండా పసుపు నింపుతాడు. నీరు పచ్చగా మారుతుంటే ప్రవాహ సరళిని లెక్కవేసి, అనువైన దారి కల్పించి తుల్యభాగను ఉద్ధరిస్తాడు.

కాని తెలంగాణలోని దక్షిణ కాశిగా పిలవబడుతున్న ధర్మపురికి ఎగువన పోచంపాడు ప్రాజెక్టుకు దిగువన వెంకట్రావుపేట సమీపంలో ఏడుపాయలుగ చీలి గోదావరి నది సప్తగోదావరిగా ధర్మపురి గ్రామవాసులు పిలవటం ఒక విశేషం. (రాములు, బి.ఎస్. 'జీవనయానం' పుట:61)

అలాగే పరమ పునీతమైనటువంటి గోదావరిని ఆనుకొని సకల వేద విద్యా నగరి, దక్షిణ కాశి, సప్త గోదావరి, దక్షిణ గంగ వంటి పేర్లతో ధర్మపురి. దీని గూర్చి బ్రహ్మాండ, స్కాంద పురాణాల్లో కనబడుతుంది.

**బ్రహ్మాండపురాణాంతర్గతం :** బలవర్మ కొడుకు ధర్మవర్మ ఇక్కడ స్వామి గురించి తపస్సు చేసి బ్రహ్మ సాయంతో ఈ ఊరికి తన పేరిట ధర్మపురి అని ఉండాలని వరం పొందినట్లు, సింధుదేశపు రాజు వీరసేనుని కుమార్తె సత్యవతిదేవి కథలో ధర్మపురి క్షేత్ర మహత్యం గురించి ఉంది.

**స్కందపురాణాంతర్గతం :** ఇందులో విదర్భ మహారాజు విశాలుడికి, దత్తాత్రేయ ఋషికి జరిగిన సంవాదం ద్వారా ధర్మక్షేత్ర ప్రశస్తి

కనపడుతుంది. ఈ పురాణాల ఆధారంగా చూస్తే ధర్మపురి క్రీ.శ.1వ శతాబ్దం నాటికే ప్రసిద్ధ జనావాస కేంద్రంగా అతి ప్రాచీనమైన చారిత్రక అవశేషాలతో ధర్మపురి పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్నది. త్రేతాయుగంలో శ్రీరాముడు వనవాస సమయంలో ఇచ్చటి గోదావరిలో స్నానమాచరించి ఇసుకతో శివలింగ ప్రతిష్ఠ చేసినట్లు అదే రామలింగేశ్వరాలయమని పిలువబడుతున్నదని స్థలపురాణం చెప్పుతున్నది. ధర్మపురిలో ఉన్న అన్ని ఆలయాల్లోకెల్లా రామలింగేశ్వరాలయమే అతి ప్రాచీనమైనదని (డా.సంగనభట్ల నరసయ్య గారి శ్రీ ధర్మపురీ క్షేత్రచరిత్ర) తెలుపుతున్నది.

ప్రస్తుతం తెలంగాణలోని అతి పురాతనమైన గ్రామం. జగిత్యాలకు 27 కిలోమీటర్ల దూరంలో గోదావరి తీరంలో ఉంది. ఈ గ్రామాన్ని రెండొ అరకేసరి క్రీ.శ పదవ శతాబ్దంలో కన్నడ కవి పంపకు అగ్రహారంగా ఇచ్చాడు. పంపని తమ్ముడు "కుర్క్యాల శాసనంలో" ధర్మపురిని గురించి ఇలా చెపుతాడు...

**"బరెదురె తాంబ్ర శాసన మదేయమే ధర్మపురం నెగళ్తవె**
**త్తరిగన కొట్టుదే నెగళ్ళ పంపన పెత్తుదె దెళిమేను నీ..**
**మ్మరుళె పలర్మెయుం పలబరం బెసగొళ్ళదెగి నోడుసు**
**స్థర వృషభా చలోన్నత శిలాతలదోళ్ బరె దక్కరంగళం."**

(వ్రాయించినది తామ్ర శాసనం...? ధర్మపురి దానమయిందా..? ప్రసిద్ధుడైన ఆదికేసరి ఇచ్చిందా..? ప్రసిద్ధుడైన పంపడు తీసుకున్న వాడా..? అని పలు రీతుల పలువురను ప్రశ్నించనేల..? అయితే ఈ ధర్మపురి ఉనికి తెలుసుకోవటానికి వృషభాద్రిని కనుక్కోవాలి..? ఇది ప్రశ్నగానే మిగిలింది.) క్రీ.శ.1246 నాటి కాకతీయ గణపతి దేవుని శాసనం ఉంది ఈ గ్రామం వేదధ్యాయనానికి, వేద పండితులకు శతాబ్దాలుగా పేరుపొందింది. ఇక్కడ వారు గోదావరిని దక్షిణ గంగగా మరికొందరు సప్త గోదావరి నిలయం ధర్మపురి అని పిలుస్తారు.

**"సప్త గోదావరి జలతరంగారోహ కేలీసుఖంబులం గీకరించి" ...** (భీ.మే. ప్రథమ.శ్వా.97 సీ.పద్యం)

ఈ సప్త గోదావరి పరివాహ ప్రాంతంలోనే పరమ పావన పునీతమైనటువంటి శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఉగ్ర రూపాన్ని బ్రహ్మ శాంతింపచేయటానికి ఇక్కడనే తపస్సు చేశాడని స్థల పురాణం. బ్రహ్మ తపస్సు చేసిన స్థలం బ్రహ్మ పుష్కరిణి అని, బ్రహ్మ స్నానమాచరించి యాగం చేసిన స్థలం బ్రహ్మగుండమని ఐతిహాసం. అట్లాగే గోదావరినదిలో ధర్మపురి స్వామిని యముడు కొలిచి తరించాడు. స్వామి అనుగ్రహంతో ఇక్కడే వెలిసి ఉన్నాడు. యముడి పేరుతో ధర్మపురిలోని యమగుండం (యముడు స్నానమాచరించిన స్థానం) గోదావరిలోని అంతర్భాగం. సత్యవతి కుండమని గోదావరి లోని అంతర్భాగం. ధర్మపురి క్షేత్రపాలకుడిగా కాలభైరవుడు ఉండి దక్షిణ వాహినిగా గోదావరి ప్రవాహం ఉన్నందువల్ల ఉత్తర భారత దేశంలోని కాశీపట్టణం లోవలే వీధివీధినా దేవాలయాలకు నిలయమైనందువల్ల ధర్మపురిని ఆలయాల పురిగా వ్యవహరిస్తారు. అందుకే ఈ క్షేత్రాన్ని దక్షిణ కాశీగా పిలుస్తున్నారు. ధర్మపురిలో దత్తాత్రేయుని ఆలయం, (రాములు,బి.ఎస్. 'జీవనయానం' పుట:60) ఆర్షధర్మాన్ని ఉద్ధరించే వేద వేదాంగ పాఠశాల, భారతీయాత్మను ప్రతిబింబించే సంస్కృత కళాశాల ఉన్నాయి. అనేక శతాబ్దాలుగా సమీప నగరాలకు మారుమూలనున్న చిన్నిగ్రామం వేద సంస్కృతిని సంరక్షిస్తోంది అనడంలో అతిశయోక్తి లేదు.

సప్త గోదావరి పరివాహక ప్రాంతంలోనే పరమ పావన పునీత మైనటువంటి శ్రీ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి గుణగణాలను గానం చేసే ఛందోబద్ధమైన తెలుగు రచనలు "ధర్మపురి శేషప్ప కవి" ఇతను మూడు శతకాలను రచించాడు. తెలుగు వారిని **"భక్తి తత్వంలో జీవుని దైన్యతను స్పష్టంగా అభివ్యక్తీకరించి హృదయానికి"** దగ్గరయ్యే శతకరత్నాలు. అందులో నృసింహ ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి స్వరూప వర్ణన..

"సీ. శ్రీ మనోహర! సురార్చిత సింధుగంభీర!
భక్తవత్సల! కోటిభానుతేజ!
కంజనేత్ర! హిరణ్యకశ్యపాంతక ! శూర !
సాధురక్షణ! శంఖచక్ర హస్త!
ప్రహ్లాద వరద! పాపధ్వంస! సర్వేశ!
క్షీరసాగరశయన! కృష్ణవర్ణ!
పక్షివాహన! నీలభ్రమరకుంతలజాల!
పల్లవారుణపాదపద్మయుగళ
తే. చారుశ్రీచందనాగరుచర్చితాంగ!
కుందకుట్మలదంత! వైకుంఠధామ!
భూషణవికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ దురితదూర!"
(నృ.శతకంలో1వ పద్యం)

అలంకారములచే ప్రకాశించుచు, శోభతోగూడిన ధర్మపురి నివాసం గల్గి దుర్మార్గుల నాశనము చేయుచు, పాపములను తొలగించినట్టి ఓ నరసింహస్వామి! లక్ష్మీదేవికి భర్తయై, సురులచే పూజింపబడి, సముద్రునివంటి గంభీరముగల్గి భక్తులను ప్రేమించు వాడవై, కోటి సూర్యుల కాంతియు, పద్మముల వంటి కన్నులు, శంఖచక్రములు ధరించిన చేతులుగల్గి, హిరణ్యకశపుని సంహరించి, సాధువులను రక్షించి, ప్రహ్లాదుని ధన్యుని చేసినవాడవై, పాపములను హరించి సమస్తమునకధిపతివై, పాలసముద్రముల పవళించుచు, కృష్ణవర్ణముకల్గి, గరుడవాహనుడవై భ్రమరకుము గల్గి, చిగురాకు బోలు పాదపద్మములు దివ్యాంగమును, వైకుంఠవాసమునకు గల్గిన ఓ నరసింహ నీకు మ్రొక్కెదను... అని శేషప్ప కవి శ్రీ ధర్మపురి

లక్ష్మీనరసింహస్వామిని నృసింహశతకంలో స్వామి రూపాన్ని వర్ణించటం జరిగింది.

శ్రీ నృసింహ శతకం తెలుగు శతక సాహిత్యంలో పేర్కొనగన్నది. **"భూషణవికాస! శ్రీధర్మపుర నివాస! దుష్ట సంహార! నరసింహ! దురితదూర!"** అనే మకుటంతో అలంకారములచే మిక్కిలి ప్రకాశించే వాడా! సంపత్కరమైన ధర్మపురి నందు నివసించేవాడా! దుష్టులను సంహరించేవాడా! పాపములను దూరం చేయు వాడా! ఓ నరసింహ అని అర్థం.

"సీ. తల్లి గర్భము నుండి ధనము తేడెవ్వడు
వెళ్లిపోయెడినాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెఱుగు బంగారంబు – మ్రింగబోడు
విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటె కాని,
కూడ బెట్టిన సొమ్ము గుడువ బోడు
పొందుగా మఱుగైన భూమిలోపల బెట్టి
దానధర్మము లేక దాచి దాచి
తుదకు దొంగలకిత్తురో దొరల కవునో
తేనెజుంటీగయ్యావా తెరువరులకు.." (నృ.శ 15వ పద్యం)

తల్లి కడుపులో నుంచి పుట్టినప్పుడేవ్వడు డబ్బు తీసుకొనిరాడు. చనిపోయినపుడు తీసుకొనిపోలేడు ఎంత డబ్బు సంపాదించినను, ఉప్పు అన్నమునేగాని, బంగారం తినబోడు, ధనము సంపాదించి తినని గర్వించుటనేగాని చనిపోవునపుడా డబ్బు కూడా రాదు, తేనెటీగలు కూడా పెట్టిన తేనెను మనుజుల కిచ్చునట్లే, తానుతినక జాగ్రత్తగా భూమిలోపెట్టి దానధర్మములు చేయక ద్రాచిన డబ్బు చివరకు దొంగల పాలనో, ప్రభువులపాలనో చేయొదురు... అని అర్థం.



**ముగింపు:**


అందుకే గోదావరితీరం నరసింహధానం శివాలయాల కాలవాలం. సాంస్కృతీయవాహిక సంప్రదాయ సారిక, వేదవిద్యాస్థానం, పౌరాణికుల పురం, శాస్త్ర విద్య, నటనాకౌశలాలకాపట్టు ఈ ధర్మపురి. సకల వేద విద్యా నగరి, దక్షిణ కాశి, సప్త గోదావరి, దక్షిణ గంగ వంటి పేర్లతో ధర్మపురి గ్రామం అతి ప్రాచీనమైన చారిత్రక అవశేషాలతో విలసిల్లుతున్నది.

**"ధర్మపురిని చూస్తే యమపురి ఉండదనే నానుడి నేటికీ తెలంగాణ ప్రజల నాలుకలపై నర్తిస్తుంటుందని ప్రశస్తి"**

**ఆధార గ్రంథాలు:**

1. శ్రీనాథుడు (మూలం), వేంకట సుబ్బయ్య. సంపా. 'భీమేశ్వర పురాణం' 1911.
2. ధర్మపురి,శేషప్ప కవి.(మూలం)నేదూరి గంగాధరం.సంపా. 'నృసింహ శతకం'1945.
3. డా. సంగనభట్ల, నర్సయ్య. సంపా. 'శ్రీ ధర్మపురీక్షేత్ర చరిత్ర' 2007.
4. రాములు,బి.ఎస్. సంపా. 'జీవనయానం'2017.

శిలాక్షరం
(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)
ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.
సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-




సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

మూసీ
సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3 (34) హైదరాబాద్ జనవరి : 2025

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్**
**సువర్ణ సదృశో భాను ర్హిరణ్యరేతా దివాకరః"**

ఇందులో ఆదిత్యుడు, సవిత, సూర్యుడు, ఖగుడు, పూష, గభస్తిమంతుడు, సువర్ణసదృశుడు, భానువు, హిరణ్య రేతసుడు, దివాకరుడు అని పది నామాలు ఉన్నాయి.

(గత సంచిక తరువాయి)


**3. సవిత :** 'సవిత అయిన దేవుడు ధర్మము మొదలైన పేరులతో తెలియవచ్చే మన బుద్ధులను ఆయాకార్యాలకు అనుగుణంగా ప్రవర్తించే విధంగా పురికొల్పుతున్నాడు. అట్టి అతని మిక్కిలి కాంక్షింపదగిన తేజస్సును మేము ఉపాసింతుము.'


ఉపాసింపదగిన దివ్యభావానికి సంభవించిన ప్రతి మంత్రానికీ ఛందస్సు, ఋషి, దేవత, ముఖము మొదలైనవి ఉంటాయి. దాని ప్రకారం గాయత్రీ మంత్రానికి దేవత సవిత. సవిత అంటే అదిత్య పరమాత్మ. అతనికి సంబంధించిన తేజస్సు, లౌకిక పారమార్థిక సాధనలకు సంబంధించిన మన బుద్ధులను, గుండె గుడిలో నిద్రిస్తున్నట్లుగా ఉన్నవానిని, మేల్కొలిపి ఆచరణాత్మకంగా ముందుకు కదిలిస్తూ ఉంటుంది. ఆ ప్రేరణ వల్ల మానవుడు పారమార్థికంగా పురోగతిలో ఉంటాడు. ఆ తేజస్సు వరేణ్యము. శ్రేయస్సు కోరుకునే వారందరికీ అత్యంతము కోరదగినది. ఎందుకంటే అది 'భర్గము' – భర్జించే – చీల్చి చెండాడే శీలం కలది. దేనిని అంటే చీకటిని. అది అజ్ఞానానికి సంకేతం. కాబట్టి అజ్ఞానాన్ని చీల్చి జ్ఞానం వైపు మళ్ళించే ఆ సర్వోత్తమమైన భర్గము – తేజస్సు సవితృ దేవునకు సంబంధించినది. ఆ విధంగా చేస్తున్నాడు కనుక ఆయన 'సవిత'.

**3. సూర్యః :** సర్వజీవకోటిని వానివానికి నిర్దిష్టములైన పనుల యందు ప్రవర్తింపజేయువాడు అని యీ శబ్దానికి అర్థం. తాత్కాలికంగా జడత్వం పొందిన దేహం (రాత్రి సుషుప్త్యవస్థలో) క్రమక్రమంగా చైతన్యాన్ని పొందుతూ ఉంటుంది. అంటే అంతకు ముందు శవప్రాయమైన దేహం సూర్యోదయ కాలంలో శివప్రాయం అవుతుంది. అలా కావటానికి కారణమైనవాడు కనుక ఆదిత్యుడు సూర్యుడు – వ్యాపార ప్రవర్తకుడు – అవుతున్నాడని యీ నామం తెలియజేస్తున్నది. ఇలా నిర్దిష్ట కార్యోన్ముఖులనుగా సూర్యుడు ఎనుబది నాలుగు లక్షల జీవరాశులనూ చేస్తున్నాడు. అనంత దేశకాల విభాగాదులలో అంతటా అతని ఈ ప్రవృత్తి కానవస్తూనే ఉంటుంది. ఈ మహార్థాన్నే తెలుగుల పుణ్యపేటి పోతనమహాకవి భీష్మస్తుతిలో పరమ రమణీయంగా వక్కాణించాడు. (సశేషం)

(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

## సత్సంగం





### సాధన లో ప్రగతి

మనం దేనినైనా అధ్యయనం చేసేటప్పుడు మనస్సుని దానిపైన పెడతాం. మనం పురోగమిస్తున్నామో లేదో తెలుస్తుంది. మనస్సు తనకి వెలుపల గల దానిపై లగ్నమవుతుంది ఈ సందర్భంలో. మనకి మనస్సు సహాయంతో అధ్యయనం చేస్తున్న విషయమర్థమయితే మనకి సంతోషం కలుగుతుంది. మనం మామూలుగా చేసే ప్రయత్నాలన్నీ బయట విషయాలని అర్థం చేసుకోడానికే! ఆధ్యాత్మిక రంగంలో ఈ అర్థం చేసుకునే మనిషిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాము. మనస్సు లోపలికి వెళ్ళాలి. బయటకు పరుగెత్తే స్వభావం కల మనస్సు లోపలికి వెళ్ళాల్సి వస్తుంది. ముందుకు పరుగెత్తే మనస్సు వెనక్కి పరుగెత్తాలి. అది కష్టమే. మనస్సుకి అతీతమైన స్థితిని తెలుసుకోవటానికి మనస్సు ఎట్లా ఉపయోగిస్తుంది? ఆ స్థితిని సుషుప్తిలో ప్రతిరోజూ అనుభవిస్తూనే ఉంటాం. దానిని మాటలలో చెప్పలేం. మేల్కొన్నప్పుడు కూడా ఆ స్థితినే పొందగోరుతాం. ఆ స్థితిని చేరుకోవటానికే సాధన చేస్తాం. మనం పురోగమించటం లేదని ఒకోసారి ఖిన్నులం అవుతాం. ఈ అంచనాలని వేసేది మనస్సే. తానే మాయ మవవలసిన స్థితిని గురించి మనస్సు ఎట్లా అర్థం చేసుకోగలదు? దేనినీ అపేక్షించకుండా సాధన చేయాలి. మనం అనుకున్న దానిని సాధించలేదని మనం చింతిస్తాం. సాధన చేయటం దేనినో సాధించడానికి కాదు. మన నిజతత్త్వం తెలుసుకోవటానికి. మామూలు వ్యవహారాలలో కొద్దికొద్దిగా పురోగమించటం మనకి అలవాటు. కాని ఆత్మజ్ఞానం అట్లా క్రమంగా లభించేది కాదు. అది హఠాత్తుగా సంభవిస్తుంది. ఉషస్సు వంటిది అన్నారు శ్రీభగవాన్. క్రమేపీ పురోగమనానికి అలవాటు పడ్డ మనస్సు ప్రగతి లేదనుకొని బాధ పడుతుంది. మనస్సే అంతర్థానమయిన తరువాత వచ్చే స్థితి గురించి తీర్పు చెప్పటానికి మనస్సు ఎందుకూ పనికిరాదు.


ప్రగతి లేదంటూ నిరుత్సాహం కలిగితే, "ఈ నిరుత్సాహం ఎవరికి కలుగుతోంది," అని ప్రశ్నించుకోవాలి. లేదా, భగవంతునికి పూర్తిగా అంకితమైన పోయి అంతా ఆయనకే విడిచి పెట్టాలి. ఆయనే మనల్ని దరిచేర్చగలడు.

# కుందుర్తి విమర్శ దర్శనం

**డా. బోయిన్‌పల్లి ప్రభాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ధర్పల్లి. ఫోన్ : 9490901050

***'కవిత్వాన్ని జాతీయం చేశాం. ఇక ఇది అందరి సొత్తు'*** అని హైదరాబాదు నిజాం కళాశాలలో వచన కవిత్వంపై ప్రచార ఉపన్యాసంలో భాగంగా ఒక సాధికారక ప్రకటన చేసిన వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయులు. ఆసాంతం ఆమాట మీదనే నిలబడి 'ఫ్రీవర్స్ ఫ్రంట్'ను స్థాపించి, తద్వారా వచన కవిత్వానికి విపరీతమైన ప్రచారం కల్పించి దాన్ని ఒక ఉద్యమ స్థాయికి తీసుకెళ్ళాడు. ఈ ఉద్యమం ప్రజా కవిత్వానికి కావాల్సిన వస్తు రూపాల్ని అందించాయని చెప్పవచ్చు. ఈ ఉద్యమ స్ఫూర్తితో విప్లవ, స్త్రీవాద, దళితవాద, మైనారిటీవాద, బహుజనవాద కవిత్వాలు వచన కవిత్వాన్ని తారాస్థాయికి తీసుకెళ్ళాయి. శిష్టా ఉమామహేశ్వరరావు, పఠాభి రామిరెడ్డి, శ్రీరంగం నారాయణబాబు, శ్రీరంగం శ్రీనివాసరావు ప్రభృతులు నారుపోయగా అభ్యుదయ కవితా శాఖగా అవతరించిన వచన కవితకు కుందుర్తి నీరుపోసి వటవృక్ష వ్యాప్తిని కలిగించాడు.

అభ్యుదయ కవిత్వ వస్తువును విస్తృత పరచిన వారిలో కుందుర్తినే ఆద్యుడిగా చెప్పుకోవాలి. ఉద్యమశీలత నుండి పరిధిని పెంచి, ప్రజా సమస్యలకు ప్రతిబింబంగా ప్రజలకోసమే కవిత్వమని, దానికి ప్రధాన సాధనంగా వచన కవితను మలచినవాడు కుందుర్తి. ప్రజల భాషకు, ప్రజల భావనలకు సరైన రూపంగా కుందుర్తికి వచన కవిత మాత్రమే కనిపించింది. వచన కవితను ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తున్న కుందుర్తిని చాల మంది ప్రగతివాదులు వ్యతిరేకించారు. వచన కవితా రూపం ఒక ఉద్యమం కాదు... సామాజిక సంఘర్షణలు మాత్రమే ఉద్యమాలవుతాయనే వారి వాదనలతో కుందుర్తి ఏకీభవించలేదు సరి కదా ప్రగతిశీల వస్తువే తనకు లక్ష్యమనీ, ఆ లక్ష్యాన్ని వచన కవితే అన్నింటికంటే ఎక్కువగా నెరవేరుస్తుందని కుండ బద్దలు కొట్టినట్లుగా చాటి చెప్పాడు. సమకాలీన జీవనచిత్రణ, ప్రగతిశీల దృక్పథం, తెలుగుదనం, వాడుక భాషా పద ప్రయోగం, ఛందో గ్రాంథిక బంధ విచ్ఛేదనం, అస్పష్టతా దోష బహిష్కారం లాంటి నియమాలు పెట్టుకుని వచన కవితను రాయాలన్నాడు. ఇవి కుందుర్తి కాలం నాటి పాతకొత్తల కవిత్వ సంఘర్షణలో ఉద్యమశీలమైన దృక్పథాన్ని తీసుకోవడంతో పాటు భవిష్యత్ మార్గానికి ఒక అవగాహననిచ్చి వచన కవిత్వ దారిని పూలబాట చేయడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. వచన కవితా వస్తువు – అందులో ప్రయోగించే భాషతో పాటు శైలిని గురించి కూడా కుందుర్తి కొన్ని ప్రతిపాదనలు చేశాడు. సాంప్రదాయక ఛందస్సులను వదిలివేసినప్పుడు అందులోని ప్రభావాలను (effects) సాధించాలంటే వచన కవితలో తూగు, విరుపులు (లయ సంబంధి), విసురు (పాఠకుని మనస్సుకు హత్తుకునే ఒక ఆవేశం), భావలయ (భావాన్ని ఆశ్రయించు






కుని లయ), ధోరణి, పలుకుబడులు (భాషా సంబంధి) లాంటి ప్రత్యేకతలను అనుసరించాలని చెప్పాడు. కవితలో ప్రధాన వస్తువుకు సంబంధించిన భావపరంపర గొలుసులా ఉండడాన్ని 'భావలయ'గా కుందుర్తి అభిప్రాయపడ్డాడు. అయితే కుందుర్తి ఇలాంటి నియమాలన్నీ సాంప్రదాయక ఛందోవాదులను తృప్తి పరచాలనే ఉద్దేశ్యంతో చెప్పినవని భావించవచ్చు.

వచన కవితను రచించడమే కాకుండా దాన్ని ఒక ఉద్యమంలా భావించి, ఆ వచన కవితా ప్రచారానికై అమితంగా పరిశ్రమించిన కవి – విమర్శకుడు కుందుర్తి. ఆయన రచించిన వ్యాసాలు, విమర్శలు, పీఠికలు, సమీక్షలు మొదలైనవన్నీ వచన కవితా ప్రాశస్త్యాన్ని నిరూపించే ప్రధాన లక్ష్యంతోనే ముందుకు నడిచాయి. ఎప్పుడైనా కావ్యమే ముందు పుడుతుంది. విమర్శ తర్వాత వస్తుంది. కాని నిజానికి లోతుగా పరిశీలిస్తే ప్రతి కవిలో విమర్శకుడు కూడా ఉంటాడు. లోపలి ఆ ఇద్దరిలో ఒక్కరే విశేషంగా బయటకు వచ్చి కవిగానో, విమర్శకుడిగానో చెలామణి అవుతాడు. కాని కుందుర్తిలో ఆ ఇద్దరూ ప్రధానంగా బయటకు వచ్చి సాహిత్య లోకాన్ని రంజింపజేయడం గమనించవచ్చు. కుందుర్తి ఎందరో కవుల రచనలకు పీఠికలు రాశాడు. తన రచనల్లో ఒక్క 'తెలంగాణ' కావ్యానికి మాత్రమే గోపీచంద్‌తో పీఠిక రాయించాడు. వచన కవిత్వ ప్రారంభదశలో కుందుర్తి తాను రాసిన పీఠికలన్నింటినీ దాదాపుగా వచన కవిత్వం అనే స్వమత ప్రచారానికే ఉపయోగించుకున్నాడనేది విస్పష్టం. అందులో నుండి కాలానుక్రమాన్ని బట్టి మొదటి మూడు పీఠికలను విశ్లేషిస్తూ... కుందుర్తి విమర్శ దర్శనాన్ని తెలియజేయడమే ఈ వ్యాస ఉద్దేశం.

**హృదయం విప్పి (ఏప్రిల్, 1958) :**

నాటి నుండి నేటి వరకు కవిత్వం మారుతూనే ఉంది. అది శరీరంలో మార్పే (వచన కవిత్వ రూపం) తప్ప ఆత్మ (కవిత్వం) మారదని గోపాల చక్రవర్తి రచించిన 'కలం కలలు' కావ్య పీఠికలో



వచన కవితా పితామహుడు-కుందుర్తి

వచన కవిత ప్రచారంలో భాగంగా కుందుర్తి తన 'హృదయం విప్పి' మాట్లాడాడు. వచన కవిత్వపు తిరుగుబాటు ఛందో బంధాల మీద తప్ప కవిత్వానికి అవసరమైన అలంకారాదుల మీద కాదని; నవలలు, నాటకాలు మొదలైన వచన ప్రక్రియల్లాగా వచన కవిత్వం కూడా జీవితానికి చాలా దగ్గరగా వచ్చిందని కుందుర్తి స్పష్టం చేశాడు.

*'జీవితం కరిగిపోయే మంచు / ఉన్నదాంట్లోనే నలుగురికి పంచు...'* అని కవి వెలిబుచ్చిన కవితా ఖండికల ఆధారంగా 'నిరాడంబరత'ను వచన కవిత మొట్టమొదటి లక్షణంగా చెప్పాడు కుందుర్తి. ఛందోబంధాలు, కఠిన సమాస బాహుళ్యత ఉండకుండా వచన కవితను ఆద్యంతం చదివేటట్లు సొగసు, విసుర్లతో రాయడం కష్టమైన పని. పదప్రయోగ కౌశలం, ఊహాశక్తి ప్రదర్శన, నిరంతర శబ్ద చిత్ర కల్పన ఉంటేనే వచన కవిత్వం నిలుస్తుందని చెప్పాడు. అందులో అలంకారాలు, రమ్యమైన శైలి కూడా ఉండాలంటాడు. గోపాల చక్రవర్తి 'కలం కలలు' కావ్యం ఈ కోవలోకే వస్తుందంటాడు కుందుర్తి. ఈ కవి ఉపమాలంకార ప్రియుడని ఉదాహరణకు... *'ఆకసం నిండా మేఘాలు / వ్రేలాడే ఏన్గుల వలె / దేవ వేశ్య ఊర్వశి శిరోజాల వలె / ఉన్మత్త మనో వల్మీకంలో / ఊర్ధ్వంగా ప్రసరించే / వేడి వేడి మజా తలపులవలె...'* అంటూ వర్ణించే మేఘాల మీదనే వర్షం కురిపించాడంటాడు. వచన కవిత్వంలో అలంకారాల విషయంలోనే కాదు ఇతర సందర్భాల్లో కూడా ఈ విసురు ఒక ముఖ్య లక్షణంగా కుందుర్తి ఈ పీఠిక ద్వారా ప్రతిపాదించాడు.

**ఒక మంచి ప్రయోగం (25 జనవరి, 1967) :**

కవితా సన్యాసం చేసిన అభ్యుదయ కవి సి.వి.కృష్ణారావుకు కుందుర్తి తన వాదనతో అతని కవితా శక్తిని వివరించి, ప్రోత్సహించి ఏడాది వ్యవధిలో 'వైతరణి' అనే పేరుతో కావ్యాన్ని రాసేలా ప్రేరణ కల్గించి, ఆ కావ్యానికి 'ఒక మంచి ప్రయోగం'గా మంచి పీఠిక రాశాడు. అలాగే ఆ కావ్యాన్ని తాను స్థాపించిన 'ఫ్రీవర్స్ ఫ్రంట్' తరపున ప్రచురించాడు కూడా. మురికి వాడల్లో నివసించే పేద ప్రజల జీవితాల్లోని కఠోర సత్యాలను ప్రజల దృష్టికి తీసుకుని రావడానికి, తద్వారా సమాజం చేస్తున్న మహాపరాధాన్ని వ్యంగ్యంగా స్ఫురింపజేయడానికి చేసిన కవి ప్రయత్నాన్ని కుందుర్తి గొప్ప అభ్యుదయ ప్రయత్నంగా చెప్తాడు. *'ఒక్కొక్క నగరం దేహం మీద మానని రాచపుండు'* గా కవి మురికివాడను అభివర్ణిస్తూ కావ్యానికి 'వైతరణి' అనే పేరు పెట్టడం సముచితంగా ఉందంటాడు. మానవాభ్యుదయానికి ఆటంకంగా 'వైతరణి' ప్రవహిస్తోందని; దారిద్ర్యానికి, ఐశ్వర్యానికి దాటరాని సరిహద్దుగా కవి 'వైతరణి' కావ్యాన్ని మలిచాడని కుందుర్తి ప్రశంసించాడు. ఈ కావ్యంలో ఒకే ప్రధాన కథకు సంబంధించిన వివిధ భావ పరంపర ఒక దానితో మరొకటి పెనవేసుకుని వివిధ ఖండికల రూపంలో కూర్చబడి వస్త్వాశ్రయ కావ్య మార్గానికి చాల దగ్గరగా ఉందంటాడు. కావ్యంలో తాను ప్రతిష్ఠించే వివిధ ప్రతిభాంశలచేత, తన అనుభూతిని సహృదయుల అనుభూతితో మేళవించి వారి హృదయాలను ఆకట్టుకున్నప్పుడే కవి కృతకృత్యుడవుతాడు. వచన కవితా వికాసం జరగడానికి వస్త్వాశ్రయ కావ్యమార్గాన్ని అనుసరించాలని అంగీకరిస్తే, ఆ మార్గం పూర్తిగా అభివృద్ధి పొందడానికి అరిపిరాల విశ్వం స్థాపించిన 'భావలయ' సిద్ధాంతం, కోవెల సంపత్కుమార ప్రతిపాదించిన 'భావగణ' సిద్ధాంతం బాగా ఉపయోగపడతా యంటాడు కుందుర్తి. ఈ రెండు సిద్ధాంతాల గురించి ఇంకా లోతుగా పరిశీలించి స్పష్టంగా తెలుసుకోవాల్సి ఉందని, ఈ 'వైతరణి' కావ్యం భావలయ సిద్ధాంతానికి చక్కని లక్ష్యమని అభిప్రాయపడ్డాడు.


*'మండువేసవిలో మల్లెపూల అంగడి పెట్టినవారు / పాలబుగ్గల పసిపిల్లలకు పనసతొనలందించినవారు...'* అనే కవితా ఖండికలో శిల్పం చక్కగా పాటించబడిందంటాడు కుందుర్తి. మురికిపేట వాసులను కథా నాయకులుగా చిత్రిస్తూ వారు తమ సహజ వృత్తులను చేసుకుంటూనే, సమాజానికి ఎంతో మహోపకారాన్ని చేస్తున్నారని, ఇలాంటి వారిని మురికిపేటల్లో బంధించి ఉంచడం సమాజం చేస్తున్న తప్పుగా కవి వ్యంగ్యంగా వర్ణించాడు. సామాన్యుడిని అసామాన్యుడిగా చాటించి, అందరికీ వెలుగును పంచి కొత్త తోవల్లో వెళ్ళడాన్ని **'వెలుతురు స్తంభం'** అనే కవితా ఖండికలో కవి వస్త్వాశ్రయ కవితా మార్గంలో మనోహరంగా వర్ణించాడని కుందుర్తి ఈ కావ్యాన్ని ఒక మంచి ప్రయోగంగా అభివర్ణించాడు. ఇంకా కుందుర్తి ఈ పీఠికలో వచన కవిత్వం ఉద్యమస్థాయిలో వ్యాపిస్తూ ఉన్నదని, కొత్తను గురించి అన్వేషించిన ప్రతి ప్రయత్నమూ అభ్యుదయ ఉద్యమ నిర్వచనం కిందికే వస్తుందని తెలుపుతూ ఈ కావ్యం అభ్యుదయ కవితా తత్వానికి ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందన్నాడు. సామాజికంగా ప్రజలకు – కవిత్వానికి గల సంబంధం సరిగ్గా గుర్తించకపోవడం వల్లే కొంత వరకు నవ్యకవిత్వం (భావకవిత్వం), ప్రయోగవాద కవిత్వం విఫల మయ్యాయంటాడు. గురజాడ నుండి క్రమ పరిణామం పొందుతూ వస్తున్న కవితా స్వరూపంలో అభ్యుదయ భావన, వచన కవితా పద్ధతిని సమర్థవంతంగా నిర్వహించి, సహృదయుల మనస్సులను ఈ మార్పు వైపు నేటి కవులు ఆకర్షించాలని ప్రతిపాదిస్తూ, సామాజిక

అభ్యున్నతి సందేశంగా గల అభ్యుదయ కవిత్వానికి వస్త్వాశ్రయ మార్గం చక్కగా దోహదపడుతుందని కుందుర్తి ఈ పీఠిక ద్వారా తెలిపాడు.

**మా వాడు – మహ గట్టివాడు (3 జూన్, 1968) :**

దేవరకొండ బాలగంగాధర తిలక్ అకాల మరణం(1966) తర్వాత 1968లో విజయవాడ విశాలాంధ్ర ప్రచురణ సంస్థ వారు ప్రచురిస్తున్న **'అమృతం కురిసిన రాత్రి'** కవితా సంపుటికి పీఠిక రాసే బృహత్తర బాధ్యత కుందుర్తికి అప్పగించారు. చిరకాల మిత్రుడైన తిలక్ రాసిన కావ్యానికి విలువ కట్టడాన్ని (పీఠిక రాయడాన్ని) కుందుర్తి తన అదృష్టంగా భావించాడు. 'మా వాడు – మహ గట్టివాడు' అనే శీర్షికతో ప్రకటించిన పీఠికలో కుందుర్తి తిలక్‌ను ఆధునిక కవితా రంగంలో సమకాలీన కవుల్లో అభ్యుదయ మానవతా వాదిగా ప్రతిష్ఠించాడు. తమ రచనలు గ్రంథ రూపంలోకి రాకముందే తెలుగు ప్రాంతాల్లో గొప్ప కవులుగా పేరుపొందిన కవులు ముగ్గురున్నారు. వారు తిలక్, శ్రీశ్రీ, అజంతాలు. తన గేయాల్లో పెల్లుబికిన అపూర్వ భావ విప్లవం వల్ల శ్రీశ్రీ ప్రసిద్ధి పొందితే; తిలక్, అజంతాలు వారు సాధించుకున్న శైలీ రమ్యత వల్ల ప్రసిద్ధి పొందారని కుందుర్తి ప్రకటించాడు. నన్నయాది ప్రాచీన కవులు (నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, పోతన, పెద్దనలు), అలాగే ఆధునిక కవుల్లో కొంతమంది తమతమ కావ్యాల్లో ప్రత్యేక శైలిని స్థాపించుకోవడం వల్ల వారి రచనలు, వారు సాహిత్య చరిత్రలో నిలిచిపోయారని, ప్రత్యేక శైలిని స్థాపించుకోలేని వారు సాహిత్య చరిత్రలో నిలదొక్కుకోలేకపోయారని, కవిత్వంలో శైలికి గల ప్రాధాన్యాన్ని కుందుర్తి స్పష్టపరుస్తూ, ఈ క్రమంలో తిలక్ తన 'అమృతం కురిసిన రాత్రి'లో మనోహరమైన శైలీ విన్యాసాన్ని ప్రదర్శించాడని తెలిపాడు. వచనగేయపు శైలిలో తిలక్ చూపిన సొగసుల వల్ల వారి వచన కవిత్వం సంప్రదాయ పద్యకవితాభిమానులను కూడా ఎంతో ఆకట్టుకున్నదని తెలిపాడు.

కుందుర్తి ఈ పీఠికలో ప్రత్యేకంగా తనకు చాల ఇష్టమైన వచన కవితా చర్చ చేశాడు. ఆ చర్చల్లో వచన కవిత ప్రయాణించిన రెండు రకాలైన శైలుల గురించి ప్రస్తావించాడు. అందులో ఒకటి నన్నయాదుల నుండి వస్తున్న కావ్యభాషా సంప్రదాయాలకు దగ్గరగా ఉన్నది. అది సమాస బాహుళ్యం, సంస్కృత లేదా ఆంగ్ల భాషా శబ్ద ఆడంబరం, గ్రాంథిక భాషాచ్ఛాయ రూప వచన గేయం. రెండవది గిడుగు, గురజాడల ఆశయాలకు అనుగుణంగా వ్యవహారిక భాషావాదాన్ని ఆకళింపు చేసుకుని, ప్రజల పలుకుబడులలోని సహజత్వాన్ని సంగ్రహించుకొని, తెలుగు నుడికారంలోని సొగసుల సౌందర్యాన్ని ఆవిష్కరించుకుంటూ, వర్తమాన కాల పరిస్థితులకు, సమకాలీన ప్రజల హృదయాలకు దగ్గరగా నడుస్తున్న శైలి. ప్రజల భాషలో నుండి సహజంగా వచ్చిన పదాలు, పదబంధాలు, అలంకారాలు, నుడికారపు సొగసులు కల్గిన శైలి కావ్యభాషా




సంప్రదాయాలకు దగ్గరి శైలి కంటె శక్తివంతంగా భావాన్ని ప్రకటిస్తుందంటాడు కుందుర్తి. కాని చాల మంది ఆనాటి ఆధునిక కవులు సంప్రదాయ కావ్యభాషనే కవితా రచన భాషగా ఒక మూఢ విశ్వాసాన్ని కల్గి, సంప్రదాయ ఛందస్సులో గ్రాంథిక భాషలో తమ కవిత్వాన్ని రాయడం వల్ల వారు, వారి కవిత్వం ప్రజలకు దూరం అయ్యిందంటాడు. తిలక్ కూడా ఈ పరిస్థితి నుండి కొంత తప్పించుకోలేకపోయాడని, శైలిలోనూ, ఉక్తి విధానంలోనూ, కొన్నిచోట్ల కావ్య వస్తువుల్లోనూ భావకవితాచ్ఛాయల బంధం నుండి బయటపడలేని స్థితి స్పష్టంగా కనిపిస్తున్నదని తన 'ఆర్తగీతం', 'నీవు' ఖండికలను కుందుర్తి ఉదాహరణగా చూపించాడు. వ్యావహారిక భాషకు వచన కవితా ప్రక్రియకు గల చారిత్రక పరిణామ సంబంధం సరిగా అర్థం చేసుకొనని అనేక మంది ఆధునిక కవుల్లో కూడా ఈ లోపం కనిపిస్తుందంటాడు కుందుర్తి.

తిలక్ తాను అనుభూతివాదినని స్పష్టంగా చెప్పుకోవడం వల్ల కుందుర్తి ఈ పీఠికలో అనుభూతి వాదం గురించి తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ దాన్ని తిలక్ కవిత్వానికి అన్వయించి చూపాడు. అనుభూతి వాదం వ్యక్తి వాదానికి మరొకపేరు. అలాగే భావ కవితా యుగానికి సంబంధించింది. **'నా అనుభూతి నాది; దాన్ని నేను ఆవిష్కరిస్తాను'** అనే తత్వం ప్రధానంగా కనిపిస్తుంది. అంటే కవి పొందిన ప్రధాన అనుభూతుల ఆకృతిలో కవిత్వం దర్శనమిస్తుంది. కవి అనుభూతుల్లో సామాజిక ప్రయోజన చైతన్యం (అభ్యుదయం) అదృశ్యమైతే ఆ కవి – కవిత్వం ప్రజలకు దూరమై పోతుందంటాడు కుందుర్తి. అయితే తిలక్ ఊహలో అడుగడుగునా అభ్యుదయ భావావేశం తొంగిచూస్తుందని, అదే భావకవితా సంబంధిత శబ్ద సౌందర్యం రమ్యమైన శైలిలో అభివ్యక్తమౌతుందని; ప్రార్థన, ఆర్తగీతం ఖండికల్లో ఆ రెండింటి మేళవింపు తారాస్థాయికి చేరుకుందని కుందుర్తి తీర్పు చెప్పాడు.

అభ్యుదయ కవితా యుగంలోని ఆవేశపూరిత, ప్రగతి కారకమైన వస్తువు పరిధిని విస్తృత పరచి, దాన్ని జీవితంలోని అన్ని రంగాలకు విస్తరింపజేయాలనే ప్రయత్నం వచన కవితాయుగంలో వచ్చిన కొత్త మార్పుగా కుందుర్తి అభివర్ణిస్తాడు. వచన కవిత్వంలో సామాజిక ప్రయోజన చైతన్యమనే పరమలక్ష్యానికి భంగం వాటిల్లనంతవరకు

# ఎదురు చూస్తుంది

**బింగి శ్రీకాంత్,** వనపర్తి, ఫోన్ : 789 361 3015

ఆమె ఎదురు చూపుల
తోరణాలు కడుతుంది
ఏ చుట్టమొస్తున్నాడో తెలియడం లేదు
ఏ పండుగ వస్తుందో తెలియడం లేదు

అటొగరు,ఇటొగరు
చూసుకుంటూ పోతుంఁడ్రు,వస్తుంఁడ్రు
కాని ఆమెను పలకరించే నాథుడే లేకపాయె

మరేం చెయ్యమంటావ్ ఆమెని
కాలం వేటగాడు బంధాల్ని
బంధుత్వాల్ని బల్లెంతో గుచ్చి తీసుకెళ్ళాక
ఒంటరి గువ్వలా
ఎవరు లేని, ఎవరు రాని ఇంట్లో ఒక్కతే
గుడ్డి దీపంలా వెలుగుతుంది.

ఎవరైనా కాస్త
మాట సాయం చేస్తారేమోనని
అరుగు మీద చెవులు వేసుకుని కూర్చుంది.
మరి అంతకంటే ఏం చెయ్యాలో తెలియదు.

అమె అరవైయేండ్ల జీవితాన్ని
దురదృష్టపు దీవిలో తాకట్టు పెట్టి వెళ్లిన
అదృష్టాన్ని నిందిస్తూ...
వొలికిన కన్నీటి పాత్రల్ని తుడుచుకుంటూ
రాత్రులను నానబెట్టుకుంటుంది
పగల్లను ఆరబెట్టుకుంటుంది.

మానవత్వం నీడలు లేని రోజులివి
మాటలు కూడా అయిపోతాయనుకుంటారు.
అలాంటప్పుడు ఆమెకు
మాటల ప్రసాదం ఎవరిస్తారు...?
ఎదురు చూపుల తోరణానికి,ఎవరు
చుట్టమౌతారు?
మనుషులు ఎవరు రారు.
చివరిగా మట్టైనా పలకరిస్తుందేమోనని
ఆమె ఎదురుచూస్తుంది ఇప్పుడు.

శృంగారాది ఇతర రస నిర్వహణ చేయవచ్చని కుందుర్తి తిలక్ 'అమృతం కురిసిన రాత్రి'లోని **'నువ్వులేవు నీ పాట ఉంది', 'వాన కురిసిన రాత్రి'** ఖండికలను ఉదాహరణగా చూపుతాడు. తిలక్ తనను తాను అనుభూతివాదిగా చెప్పుకుంటే, కుందుర్తి తిలక్‌ను గొప్ప మానవతా వాదిగా అందులో అభ్యుదయ కవితా యుగపు ప్రధానలక్షణమైన అంతర్జాతీయ భావన... ***'సంకుచితమైన జాతి మతాల సరిహద్దుల్ని చెరిపివేసి / అకుంఠిత మానవీయ పతాకను ఎగురవేసే'*** తత్వం కలవాడిగా కనిపిస్తాడంటాడు. అలాగే తిలక్ కవిత్వం అభ్యుదయ, భావ కవిత్వాల మిశ్రమ రూపంగా... 'అమృతం కురిసిన రాత్రి' లాంటి కవితలను ఉదాహరణగా చూపుతాడు. అంటే అభ్యుదయకర వస్తువుకు భావకవిత్వపు శబ్ద సౌందర్యాన్ని జోడించిన రమ్యమైన శైలి అన్నమాట. ఇక యువతరం మీద తిలక్ భావాల ప్రభావం ఉంటుందని చెప్తూ, అనుభూతివాద కవిత్వంలో కూడా గుణాలతో పాటు దోషాలుంటాయని, వాటిని యువకవులు పరిహరించుకోవాలని వ్యక్తివాద ధోరణులను తొలగించి, కవిత్వానికి సామాజిక ప్రయోజన లక్ష్యం తప్పకుండా ఉండాలని కుందుర్తి ఆనాటి యువతరం కవులకు ప్రబోధించాడు. కుందుర్తి పీఠికల్లో ఈ పీఠిక వచన కవిత్వ ఉద్యమ ప్రచార సంబంధిగా సాహిత్య విమర్శ రంగంలో ప్రధాన పాత్ర వహించింది.

పైవిధంగా కుందుర్తి ఆంజనేయులు గారి రచనా వ్యాసంగంలో ప్రత్యేకించి వచన కవిత్వ ఉద్యమ ప్రస్థానంలో భాగంగా రాసిన పీఠికల్లో వారి విమర్శక ప్రతిభ చెప్పుకోతగినది. కుందుర్తి ఇతర కవుల కావ్యాలకు రాసిన పీఠికల్లో ఆ కవి కవిత్వ విశ్లేషణ – విమర్శ కంటె ఎక్కువగా తాను ఉద్యమంగా ముందుకు తీసుకు వెళ్తున్న వచన కవిత్వ సంబంధిత చర్చనే ఎక్కువగా చేసినట్లు తెలుస్తున్నది. వచన కవిత్వాన్నే శ్వాసించిన – ఇతర కవుల్లో వచన కవిత్వ రచనా స్ఫూర్తిని రగిలించిన మన కుందుర్తి వచన కవితా పితామహుడు.

**మూసీ**

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

# నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము

డా. గంగ్ర లక్ష్మణ రావు, విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

**(గత సంచిక తరువాయి)**

***మూర్ఖః ప్రయోజితామాత్యే త్రయి దోషా మహీపతి***
***అవమానాస్యార్థనాశస్య నరకే పతనం తథా - 36***

*(మూర్ఖో నియోజ్యమానే తు త్రయో దోషాః*
*అయశశ్చ అర్థనాశశ్చ నరకే గమనం తథా .... చాణక్య నీతిలో ఉన్నది)*

*పద్యానువాదం –*

*ఆ.వె. ప్రభువు మూర్ఖునకును పదవియిచ్చినగాని*
*మూడు దోషములతో ముప్పు గలుగు*
*చెడ్డపేరు వచ్చు సిరిసంపదలు పోవు*
*చివర నరకమునకె చేరి పోవు*

అర్థం – మూర్ఖుడైన వాడికి రాజు గొప్ప ప్రయోజనం యిచ్చినా రాజుకు అవమానతను, అర్థనాశమున్ను, పుణ్యరహితుడై రాజు నరకప్రాప్తుండగునన్న రీతి.

***పరోక్షే కార్య హంతారం ప్రత్యక్ష ప్రియవాదినం***
***వర్జయేత్సదృశం విత్తం విషకుంభ పయోముఖం -37***

*పద్యానువాదం –*

*తే.గీ. ముందుతీయగ మాటాడి మురియ జేయు*
*వెనుక కార్యమ్ము చెడగొట్టు వికట బుద్ధి*
*పైన యమృత భాండము లోన విషము*
*కపటులను జూసి ముందుజాగ్రత్త పడుము*

అర్థం – మూర్ఖుణ్ణి , లుబ్ధుణ్ణి, పక్షాపక్షం మాట్లాడే వాడిని , బల్లిదుండ గాని వాడిని, ఆకారం లేనివాడిని, అప్రమాణం అన్యాయం చేసేవాడిని అధికారిని చేయరాదన్నను యెట్లంటేని విషకుండ వలెనే లోపల విషముఖం పాలు గురిసినట్లు మాటలు విత్తం యిచ్చినట్లుండును.

***మృదు వాక్య రిపుంహంతి మృదునాయంతి దారుణి***
***అసాధ్యం మృదునాశంచ తస్మాత్ క్షత్ర క్షణే మృదు - 38***

*పద్యానువాదం –*

*తే.గీ. మంచి మాటల వైరి జయించవచ్చు*
*మంచి మాటల ధరణిగ్రహించవచ్చు*
*మంచి మాటల కెన్నసమానమేది*
*మంచి మాటల యుద్ధము మాన్ప వచ్చు*

అర్థం – మృదు వాక్యాలచేతనే శత్రువుల గెలువ వచ్చును. మృదు వాక్యాల చేతనే భూమిని తీసుకోవచ్చును. మృదు వాక్యాలకు అవమానత లేదు. అనుర యుద్ధము మృదు వాక్యాల చేతనే గెలువ వచ్చునన్న రీతి.

***యస్య యస్య హితో భావే తేన తేన హితో నరః***
***అనుప్రవిష్య మేధావిః ప్రమాత్మ వశం నివేత్ - 39***

*పద్యానువాదం –*

*తే.గీ. ఎవరి కెవ్వియు మేలౌనొ యవియె చేయు*
*పలువురకు నచ్చినట్లుగా పలుకు ప్రియము*
*మంచి వారికి తోడుగా మసలుకొమ్ము*
*సుజనులందరి మనముల చూరగొనుము*

అర్థం – యెవ్వరెవ్వరికి యెట్లు హితవో అట్లాగే నడిచేది. యెవ్వరెవ్వరికి యేమి ప్రియమో అదే పలికేది. బుధులైనవారికి ప్రయోజనమైన తీర్న సకలాత్మల వశం చేసేదన్న రీతి.

***యో ధ్రువాణి పరిత్యజ్య అధ్రువాణి నిషేవతే***
***ధ్రువాణి తస్యనశ్యంతి అధ్రువం నష్టమేవచ (హితోపదేశంలో ఉన్నది) -40***

*తే.గీ ఖచ్చితమ్మైన కార్యము కడకు ద్రోచి*
*నిశ్చయము గాని కార్యము నిజము జేయ*
*తగిన కార్యము నష్టమై మిగులు బాధ*
*చేయ దగినట్టి కార్యమే చేయ వలయు*

*అర్థం – యే పురుషుడైన నేమి ధ్రువమైన కార్యం విడిచి అధ్రువమైన కార్యం చేస్తే సుధృఢమైన కార్యం చెడును. అటుగాన దృఢమైన కార్యాలే చేస్తే ఉత్తమమనిన రీతి.*

***మాతా శత్రుః పితా వైరీ యేన బాలో న పాఠితః***
***సభామధ్యే న శోభంతి హంసబృంద బకాయివా - 41***

*తే.గీ. పిన్న నాటను విద్య నేర్పింపనట్టి*
*తల్లి దండ్రులు వైరులు తనయులకును*
*చదువు రానట్టి వారలు సభలయందు*
*హంసలందున కొంగలున్నట్లుగాదె.*

అర్థం – పిన్ననాడు చదివించని తల్లితండ్రులు శత్రువులు. (యెట్లంటే, యవ్వనమందు తీర్థయాత్ర సేవించక వార్ధకమ్మున నపేక్షగలిగి బుద్ధిమంతుడు పెద్దలకు దాసుడై చదివిన వాడై పూజ్యుడు.) కులము రూపు రేఖలు గలిగి విద్య లేనివాడు సభలో హంసల మధ్యమున కొంగవలె నుండు నన్న రీతి.

***చందనం శీతలం లోకే చందనాదపి చంద్రమా***
***చంద్ర చందనయోర్మధ్యే సాధుసంగస్సుశీతలం - 42***

*పద్యానువాదం –*

*తే.గీ . అల్ల శ్రీగంధమెంతయు చల్లదనము*
*చంద్రకిరణముల్ మరియింత చల్లదనము*
*చందనముకన్న వెన్నెల చలువకన్న*
*సాధు సజ్జన స్నేహము చల్ల నగును*

అర్థం – యీ లోకానకు శ్రీగంధమే చల్లనిది. యింతకు మీరి చల్లదనం వెన్నెలది. చంద్ర కిరణములకన్న గంధముకన్న సజ్జనులగు సాధు సంగతి లోకాలలో చల్లనన్న రీతి.

***గురవాయత్ర పూజ్యంతే ధాన్యం వా యత్ర సంజనితం***
***సంజ్ఞో తత్కాలయో యత్ర స్తదాదేశం చ న విభుం -43***

*పద్యానువాదం –*

*కం. గురువుల పూజల సేయుచు*
*తరుగని ధాన్యంపురాశి తగచేకూర్చన్*
*గురువుల దీవనతోడను*
*సిరియును దైవమ్ము నిలుచు శ్రీకరమగుచున్*

అర్థం – గురువులు యెట్లు పూజింపబడతారో భక్తిచేత యట్లు ధాన్యం సంగ్రహించేది. యెప్పుడైనా కాలం గుర్తెరిగి గురుకటాక్షమున్న చోట, ధాన్యం సంగ్రహించినచోట దైవం వున్నదన్న రీతి.

*(7 వ పత్రము)*

***త్యజేత్స్వామి సమత్తుంగం అత్యుగ్రం కృపిణం త్యజేత్***
***వ్యసనంచ విశేషజ్ఞస్తదా చ కృపిణం త్యజేత్ -44***

*పద్యానువాదం –*

*తే.గీ . అల్పు బుద్ధి గలుగు నధికారినైనను*
*వదలి దూరముగను మెదల వలయు*
*కరుణలేనియట్టి జ్ఞానినైనను గాని*
*విడిచి యున్న మేలు పుడమియందు*

అర్థం – మండలాధీశుండైన అల్పుండైన రాజును విడిచేది. ఒక దేశాధీశుడైనా కృపలేని వాన్ని విడిచేది. కృపాహీనులు విశేషజ్ఞాన మెరుగరు. కాన వీరిని విడిచేదనిన రీతి.

***యస్య యస్య సమాజాతో గుణవాన్ పూజ్యతే నరః***
***ధనుర్వంశ విషణ్ణోపి నిర్గుణం కిం కరిష్యతి -45***

*పద్యానువాదం –*

*తే.గీ . కులమదెట్టిదైన గుణవంతుడైనచో*
*ప్రజలచేత గౌరవమును పొందు*
*చందనమ్ముతోడ చక్కగా గట్టిన*
*యింట మంచి లేక నెవడు మెచ్చు*

అర్థం – యై కులములో పుట్టినను గుణము గల్గిన మనుష్యుడు పూజ్యుడు. శ్రీగంధం కట్టెలతో కట్టిన యిల్లైన గుణం లేకపోతే పూజ్యం లేదన్న రీతి.

***భయయా తోషణే భృత్యా బాంధవ వ్యసనాగమం***
***ఆపత్కాలేన మిత్రంచ భార్యాచ విభవక్షయేత్ -46***

*పద్యానువాదం –*

*ఆ.వె. భయము గల్గు వేళ బంటుబుద్ధిని జూడు*
*సుఖము వేళ చూడు చుట్టములను*
*కష్టసమయమందు కాంచుము మిత్రుని*
*కలిమి లేములగను కాంత గుణము*

అర్థం – భయమైనపుడు బంట్ల మనసు చూసేది. వ్యసనమైనపుడు బంధువుల మనసు చూసేది. ఆపద కాలమున చెలికాని మనసు చూసేది. భాగ్యమైనపుడు, దరిద్రమైనపుడు భార్య గుణం పరీక్షించేదన్న రీతి.

***తిష్ఠత్యేకేన పాదేన పరవాదేన పండితః***
***అనునిత్య పరస్థానం పూర్వమాయతనం త్యజేత్ -47***

*పద్యానువాదం –*

*తే.గీ. మొదటి వాదన నోడించి ముందు కేగ*
*పరుల గెల్వంగ వచ్చును వరుస గాను*
*ఎత్తినట్టిపాదమునిల్పబెట్టి వెనుక*
*పాదమును లేప మేలౌను పదము వేయ*

అర్థం – మొదలు పెట్టిన పాదం బలవంతముగ బెట్టి వెనుక పాదం యెత్తేది. అది యెట్లన్నను పూర్వ పక్షము చేసేటప్పుడు పండితుడైనవాడు పూర్వ వాక్యం ఘటిలజేశి రెండో వ్యాఖ్యానం జేశితే పూర్వోత్తరములు చెడవు. స్థలజ్ఞులు పూర్వము తావు పదిల పరచి రెండో తావుకు పోయిన మేలు, లేకపోతే పూర్వము తావు చెడునన్న రీతి.

***కులశీల గుణోపేత సత్య ధర్మ పరాయణ***
***వినుత ప్రేక్షణ దక్షారాజ్య రక్షో విధీయతే -48***

*(కులశీల గుణోపేతః సర్వ ధర్మ పరాయణః – ప్రవీణః పోషితే2ధ్యక్షో ధర్మాధ్యక్షో విధీయతేచాణక్యనీతి)*

*పద్యానువాదం –*

*తే.గీ . ఎట్టి కులమున బుట్టిన నేమిగాని*
*సత్య ధర్మమాచార ప్రసన్నుడగుచు*
*పరుల గెలువంగ జూసిన ప్రజలు మెచ్చు*
*అట్టి దక్షుడు రాజగు నవనియందు*

అర్థం – యే కులం వాడైన నేమి ఆచారము, ధర్మము, సత్యమున్ను పాటించుచు, పరుల జయించేటప్పుడు వినుతి పొందే రాజు దక్షుడన్న రీతి.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3 41 UGC CARE List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2025

# భైరవ కవి 'రత్న శాస్త్రం' – పరిశీలన

మెరుగు ఆంజనేయులు, ఫోన్ : 89 77 97 02 12

తెలుగులో వెలువడిన శాస్త్ర గ్రంథాలలో భైరవ కవిచే రచింపబడిన **"రత్న పరీక్ష" / "రత్న శాస్త్ర"**మనే గ్రంథం ఒకటి. సాహిత్యంలో పాటుగా శాస్త్ర పరిజ్ఞానంకల కొందరు కవులు శాస్త్ర గ్రంథాలు రచించారు. కాగా ప్రాచీన తెలుగు సాహిత్యంలోకి తొంగిచూస్తే తిక్కన (క్రీ.శ.1250–1320) కాలంలోని మూలఘటిక కేతనచే రచింపబడిన **"విజ్ఞానేశ్వరీయం"** ఎర్రన (క్రీ.శ. 1320–1400) కాలంలోని దోనయామాత్యునిచే రచింపబడిన **"సస్యానందము"** అయ్యల భాస్కర జంట కవులు (క్రీ.శ. 1550–1670) చే రచింపబడిన **"రెట్టమత శాస్త్రము"** అనే గ్రంథాలను శాస్త్ర సాహిత్య గ్రంథాలుగా పేర్కోనవచ్చును.

విధులకు శాసిస్తూ విషయాలను విషదీకరించేవి శాస్త్ర గ్రంథాలు. మనకవగతం గాని ఎన్నెన్నో విషయాలను బోధ చేస్తూ లోక శ్రేయస్సే పరమావధిగా శాస్త్ర గ్రంథాలు ఆవిర్భవించాయని భావింపవచ్చును.

**రత్న శాస్త్రములో జ్యోతిశ్శాస్త్ర అంశములు**

తెలుగు సంస్కృత భాషలలో ప్రావీణ్యం కల్గిన కవి భైరవ కవి క్రీ.శ.15వ శతాబ్దానికి చెందినవాడు. గౌతమ గోత్రజుడైన 'గౌరనామాత్యుని' కుమారుడు భ్రమరాంబికాదేవి అనుగ్రహంచే రచనాశక్తిని కల్గినట్లుగా రత్న పరీక్షయందు తెలిపినాడు,

భైరవ కవి 1. రత్నపరీక్ష (రత్నశాస్త్రం), 2. శ్రీరంగ మాహాత్మ్యము, 3. కవిరాజు గజాంకుశం అనే రచనలతోపాటు 'లక్షణ దీపిక' అనే ఛందోగ్రంథమును గూడా సంస్కృతములో రచించినాడు.

సంస్కృతములో "రత్నశాస్త్ర" మనే పేరుతో అగస్త్యునిచే రచింపబడిన గ్రంథమును తెలుగులో "రత్నపరీక్ష" గా అనువదించాడు. కాగా దీనిని తెలుగు సాహిత్యకారులు "రత్నశాస్త్రము"గా గూడా పిలుచుచున్నారు. ఇట్టి రత్న శాస్త్ర గ్రంథమును కవి తాను పూజించునట్టి బ్రాహ్మణుడైన "ముదిగొండ వీరేశ్వరుడు" అనునాతనికి అంకితమిచ్చినాడు.

**కం. భ్రమరాంబికా మహావర**
**సముదిత నిరవద్య హృద్య సాహిత్యకళా**
**క్రమ విమల ప్రతిభాసం**
**క్రమణుడు మతి శాలుయైన గౌతమ సుతుడన్**

**క: భైరవుండ నుభ య భాషా**
**పారీణుడ లోభి భవన భవ భూమవ్యా**
**పార వికాస దుష్కవి**
**ఘోర పిశాచములదల్చుకొని భైరవుండన్**

అని కవి పై రెండు పద్యములనే తనను గూర్చి తన రత్నశాస్త్ర గ్రంథము నందు తెలియచేశాడు. తన తండ్రియైన గౌరన కూడా



1. హరిశ్చంద్ర కథా (ద్విపద కథ) ను, 2. నవనాథ చరిత్రము, 3. నవగ్రహస్తుతులనే గ్రంథాలను రచించాడు. భైరవకవి ఒక లాక్షణికుడుగా ప్రసిద్ధి కలవాడు. ఈతని రచనాశైలి ధారాశుద్ధతో మార్ధవమును గల్గి మనోరంజకమైనదని చెప్పవచ్చును.

ఈ శాస్త్ర సాహిత్య గ్రంథములో జ్యోతిశ్శాస్త్ర సంబంధించిన అంశములుగానున్న నవరత్నాలను గూర్చి పూర్తి వివరణ యున్నది. వేనిని నవరత్నాలుగా పరిగణిస్తారో, ఏ రత్నానికి ఏ గ్రహం ఆధిపత్యం కల్గియున్నదో, రత్నాలకు చెందిన పుట్టుకతో పాటు గుణ దోషాలు వంటి సానుకూల విషయాలనెన్నింటినో ఈ "రత్న పరీక్ష" గ్రంథం తెలియ జేయున్నది. కాగా –

1. నవరత్నాలు – నవగ్రహాలు
2. నవరత్నాలు – వాని లభ్యత
3. నవరత్నాలు – వాని స్వరూప వివరణ
4. నవరత్నాల పరీక్ష పద్ధతులు
5. నవరత్నాల గుణదోషాది వివరణ.
6. నవరత్న ధారణ శుభాశుభ ఫలితములు అన్న జ్యోతిశ్శాస్త్ర సంబంధించిన రత్న ధారణకు ఉపకరించే ఆరు ప్రధాన అంశాలుగా గ్రంథమును విశ్లేషణ చేసినచో గ్రంథ సారాంశం క్షుణ్ణంగా బోధపడగలదు. గ్రంథ ప్రాముఖ్యం తెలుసుకొనవచ్చును.

కాగా ఈ శాస్త్ర గ్రంథంలోని జ్యోతిశ్శాస్త్రమునకు సంబంధించిన నవరత్న ధారణకుపకరించే ప్రధానమైన ఆరు అంశాలను క్రమంగా ఈ క్రింధి విధంగా పరిశీలించవచ్చును.

నవరత్నముల పుట్టుక, జాతి, వర్ణ, గుణదోషాదా భేదముల నుద్దేశించి ఆరు ప్రధానాంశాలుగా విశ్లేషించుకోవటంచే ఈ "రత్నపరీక్ష" గ్రంథ రచనా ఉద్దేశ ఫలితం కూడ సిద్ధిస్తుందని భావించవచ్చును.

**నవరత్నాలు – నవగ్రహాలు**

అలంకారప్రాయమైన రత్నాలు పలువిధాలుగా కనబడినను

జ్యోతిశ్శాస్త్ర దృష్ట్యా తొమ్మిది గ్రహాల ఆధిపత్యం గల్గినవి మాత్రమే నవరత్నాల పేరుతో లోకంలో ప్రసిద్ధిగాంచినవి అనడానికి ఈ గ్రంథం ఒక ప్రతీక.

**క. కురుపాద వజ్ర మౌక్తిక**
**వర మరకత శక్ర నీల వైదూర్య మనో**
**హర పుష్యరాగ విద్రుమ**
**నరసుత 'గోమేధకములు' నవరత్నంబుల్.**

అని పై పద్యముచే కెంపు, వజ్ర, ముత్యము, పచ్చ, ఇంద్రనీలం, వైదూర్యం, పుష్యరాగం, పగడం, గోమేధికం, అనే పేర్లతో పిలువబడిన ఈ తొమ్మిది రత్నములనే 'నవరత్నములని' చెప్పబడినవి పై నవరత్నములకు అదే వరుసక్రమంగా రవి, శుక్ర, చంద్ర, బుధ, శని, కేతు, గురు, కుజ, రాహువులనే నవగ్రహములు అధిపతులుగా గలవారిని తెలిపినాడు. పై నవగ్రహాలు – నవరత్నాల వివరణ దృష్ట్యా రచయిత సాహిత్యంతోపాటు జ్యోతిశ్శాస్త్ర పరిజ్ఞానం గూడా గలవారని తప్పక భావింపవచ్చును. కవి ఈ నవరత్న వివరణతోపాటు వాని ఉపరత్నముల గూర్చి తెలిపియున్నచో గ్రంథ పూర్ణత్వమునకు మరింత బాగుండేదనిపిస్తుంది.

**నవరత్నాలు – వాని లభ్యత**

అలంకరణలోను, గ్రహానుకూలతకై వ్యవహారంలో ధరించుచున్న ఈ నవరత్నాలు లభించే స్థానాలు తెలుసుకోవడం కూడా అతిముఖ్యం. ఏ ప్రాంతంలో ఏ రత్నం లభించగలదో తెలిపినచో నాణ్యతతో పాటు చౌకమైన ధరలలో వానిని పొందే అవకాశం ఉంటుంది. లేనిచో లోపభూయిష్టముతో పాటు ఎక్కువ ధరను వెచ్చించి సేకరించుటలో మోసపోయే అవకాశం కూడా కలదు. కవి రత్నాల లభ్యస్థానాల్ని పొందుపరుచుటచే భావి తరాల శ్రేయస్సును కాంక్షించిన అతని శ్రద్ధ అవగతమవుతుంది.

"వజ్రములు" విరాట, సింధూ, విదుర దేశములందు అధికంగా లభించుచున్నవని తెలిపాడు.

**క. జరధర ఫణి ఫణ కీచక**
**జలచర కరి మస్తకేక్షు శంఖ వరాహో**
**జ్జ్వల దంష్ట్ర శుక్తులుదరం**
**బుల ముత్యము లొదవు వర్ణములు వివిధములై**

పై పద్యములో "ముత్యాలు" మేఘాలందును, పాము పడగలలోన, వెదురు బొంగులలోన, చేపల తలలోను, చెరుకు గడలలోను, శంఖములలోనూ, అడవి పంది కోరలలోను, ముత్యపు చిప్పలలోను పుట్టుచున్నాయని వివరించాడు.

"పగడములు" సింహద్వీపములోను, సముద్రతీర ప్రదేశాలలోను, పగడపు దీవులలోను లభించునని తెలిపాడు. కాగా రచయిత ఇతర రత్నాల లభ్యత విషయాలేవి పొందుపరచలేదు. కారణమేమైనను ఇతరములైన వాని లభ్యత వివరాలు తెలిపినచో పాఠకులకు మరి వ్యాపారులకు కూడా వానిని పొందుటకు చక్కని బాటవేసినట్లుగా ఉండేది.

**నవరత్నాల స్వరూప వివరణ**

ప్రఖ్యాతిగాంచిన నవరత్నాలు ప్రకాశించే తీరు తెన్నుల ననుసరించి కవి వాటి రూపరేఖలు (రకములను) తెలియజేశాడు.

**1) పద్మరాగం / కెంపును గూర్చి.**

**క. ఉదయార్క బింబ సముజ్జ్వల ప్రభగల్గి**
**కరమొప్పు పద్మరాగంబు మొదట**
**అసమానదాడిమీ కుసుమ మంజరిఛాయ**
**గలిగి శోభిల్లు సౌగంధికంబు**
**సలలిత మత్తకోకిలలోచన ద్యుతి**
**నలరారు కురువింద మనెడుకెంపు**
**మండిత శశమాంస ఖండంబుగతి నున్న**
**మంద తేజంబగు మాంసగతిథి**

**ఆ. నలుపు నెర్రదనము మిళితమైనెగడెడు**
**డాలు గలగినదియు నీలగంధి**
**లాలు లేక గోమలంబును సంజ్ఞలం**
**గ్రాలు కెంపు చాల రంగులేక**

అంటూ పై పద్యములో కెంపు ప్రకాశించే (కనబడే) తీరు ననుసరించి అది ఏ రూపము పేరుతో పిలువ బడినదో తెలిపినాడు. ఉదయ రవిబింబంలా ప్రకాశించే కెంపును **'సౌగంధిక'** మని కోకిల నేత్రంవలె కానబడునది **'మాంసగంధి'** యని, నలుపు, ఎరుపులతో కనబడేది నీలగంధయని, తెల్లబోయినట్లుగా అగుపించేది. "లాలగంధి" యని చెపుతూనే, అశోక, మంకెన పూవులా ప్రకాశించేది మాత్రమే మిక్కిలి శ్రేష్ఠమైన **"పద్మరాగమణి"** కెంపుల గూర్చి వివరించినాడు.

**2) వజ్రమును గురించి**

**చ. అసమున జూడకుండి కరికాకృతిదెల్పగు విప్రజాతి పెం**
**పెసగెడు పల్లవంబుగతి నెర్రని ఛాయది భూపజాతి క్రొం**
**బసిమి తనర్చి కాంచన ప్రభంగన నొప్పగు వైశ్యజాతి యీ**
**వసువతి నీలకాంతిగల వజ్రము నాలవజాతియై చనున్....**

అనుచు పై పద్యమునందు మల్లెమొగ్గవంటి తెల్లని కాంతితో ప్రకాశించే వజ్రం బ్రాహ్మణజాతి వజ్రంగా, చిగురు వర్ణంగా ఎర్రగా కనబడునది క్షత్రియ వజ్రమని, బంగారు పచ్చతో ప్రకాశించేది వైశ్యజాతి వజ్రమని, నల్లనికాంతితో ప్రకాశించునది. శూద్రజాతి వజ్రమని వజ్రాల రకములను తెలిపాడు. నేటి కాలంలో నిత్య వ్యవహారంలో వీని విలువ అత్యధికమైయున్నది. కాన వీనిని గూర్చిన వివరణ తెలుపుట సంతసించదగిన విషయం.

**3) పచ్చ / మరకతమణి గురించి**

పచ్చను అది ప్రకాశించే తీరుననుసరించి ఎనిమిది రూపాలలో లభించునని వివరించాడు.

**సీ. లలిత మయూరకళా విస్పురణము**
**వర్ణింప నొప్పు శైవాలరుచిర**
**భాసురంగ గాజుపచ్చ తెరుంగున**
**రాజిత దూర్వాంకరముల పసను**
**మెరుఁగుడు పురుగు మే మెరయు చందంబున**
**గొమరువించిన పాల కొమ్మచాయ**
**జిగిదళుకొత్తు రాచిలుక రెక్కవన్నె**
**పొలుపారు దిరిసెంపు బువ్వవన్నె......**

**తే. క్రాలు నెనిమిది తెరుంగుల దాలుగలిగి**
**సకల దుర్మంత్రియంత్ర హృజ్ఞరశోక**
**ఘన తరోన్మాద మూర్ఛా వికార పైత్య**
**హరణకారణమగును శుద్ధమరకతంబు.**

అంటూ పై పద్యములో 1. నెమిలి పిట్ట రంగువలె ప్రకాశించును, 2. నాచువలె, 3. గాజుపచ్చ వలెను, 4. కరిమొలక రీతిగును, 5. మెరిసే పురుగు శరీర మెరుపు కాంతితో ప్రకాశించునవి, 6. పాలచెట్టు కొమ్మ రంగు, 7. రామ చిలుక రెక్కల రంగు, 8. దిరిసెన పూవు రంగులో ప్రకాశించు పచ్చలు అవ్విధంగా 8 రకాలుగా వ్యవహారంలో లభించు చున్నాయని తెలిపినాడు. తద్వారా పచ్చల ఎంపికలో మేలైన వానిని పొందుటకు చక్కని అవకాశం కల్గినది.

**4) నీలమును గూర్చి వివరిస్తూ**

శని గ్రహాధిపత్యం గల నీలములు ఎన్ని రకాలుగా లభించగలదో క్రింది పద్యమునందు తెలిపినాడు.

**ఆ. మొదలనింద్రనీలమును మహానీలంబు**
**నీలమణి యనంగ నిఖిల దిశల**
**వినుతికెక్క మూడు విధముల నొప్పెడు**
**రంగుగలుగు నీలరత్నమునకు**

అంటూ నీలములు 1. ఇంద్రనీలం, 2. మహానీలం, 3. నీలమణి అని మూడు రకాలుగా లభించుచున్నవి. అంతేగాక తలవెంట్రుక రంగును పోలినవి "ఇంద్ర నీలమణి", నెమలికంఠం కాంతిని పోలినది. "నీలమణి" అని వెదురుపువ్వు కాంతిని పోలినవి మహానీలిములని మూడు విధాల నీలముల గురించి విశదీకరించాడు.

**6) పుష్యరాగం గురించి**

గురు గ్రహాధిపత్యం గల పుష్యరాగమును గూర్చి వివరిస్తూ.....

**క. మకరంద బిందుసమరుచి**
**ప్రకటంబుగ బుష్యరాగరత్నము బృందా**
**రక నికరాచార్య ప్రియ**
**సుకృతశ్రీయొసగి నరులజూచు ధరిత్రిన్.**




అంటూ పై పద్యంలో తేనెచుక్కవలె ప్రకాశించేటువంటి రత్నమును పుష్యరాగంగా గుర్తించాలని కవి తెలిపినాడు. జ్యోతిశ్శాస్త్ర ప్రకాశం అతి ప్రాముఖ్యం గల గ్రహం గురుగ్రహం దీని రత్నమైన పుష్యరాగమును గూర్చిన వివరణ మరింతగా వివరించితే బాగుండేది.

**7) గోమేధికం**

రాహు గ్రహాధిపత్యం గల గోమేధికం గూర్చి

**క. గోమేధిక మణి నిర్మల**
**గోమూత్రఛాయ జాల కొమరైమేనన్**
**ప్రేమ ధరింపగ నురుజయ**
**ధామంబగు నిఖిలసౌఖ్య దాయక మగుచున్.**

అంటూ పై పద్యంలో పరిశుభ్ర గోమూత్ర ఛాయతో ప్రకాశించేది గోమేధికమని వివరించినాడు కవి. గోమేధికం పై రూపంలో తప్ప మరే రూపంగాను లభించదని తెలిపినాడు.

**8) పగడం గురించి**

కుజ గ్రహాధిపత్యం గల పగడం స్వరూపాన్ని గురించి వివరిస్తూ...

**క. దొండపండు ఛాయతో మచ్చరించుచు**
**నుసైపండుల రీతి మబ్బడంచి**
**పరికింప నరిపండ్ల బరపక జేసియు**
**దేవదారులపండ్ల తేజమణచి**
**వటఫల కాంతిని వదిలించి చెలరేగి**
**బింబాధరుల మోని బిట్టడంచి**
**శుక తుండముల శోభ సొమ్మపిల్లగజేసి**
**చందన కాష్ఠవు జాయదిట్టి**

**తే. మెరసి నిద్దంపుగెంపుల మిగులగదిసి**
**కోరి ధరియించు వారికి గొరతలేక**
**సర్వసౌభాగ్య ప్రశస్తవస్తు**
**భద్ర కారణ సంసిద్ధి విద్రుమంబు**

అంటూ పై పద్యములో దొండపండురంగు, ఉస్తి పండ్లరంగు, ఎఱ్ఱటి పండ్లు, దేవదారు పండ్లు, సుందరుల పెదవుల రంగు, చిలుకు

ముక్కు రంగు, రక్త చందన రంగు, మొదలైన రంగుల కాంతులతో ప్రకాశించే పగడాలు వ్యవహారంలో గలవని తెలిపినాడు.

నేడు వివాహ ఆలస్యములకు, దంపతుల ఎడబాటునకు కుజ గ్రహ దోషం కారణంగా జ్యోతిష్కులు సూచిస్తున్నారు. అట్టి దోష నివారణకై ఆ గ్రహాధిపత్యరత్నమైన పగడమును ధరించుటను సమస్య నివారణకై తరుణోపాయంగా చెబుతున్నారు. కాగా వీని వినియోగం మరింత ఎక్కువగా పెరిగింది. అట్టి వానిని గురించి క్లుప్తంగా నాటి కవి వివరించడం ఆనంద దాయికం.

**9) ముత్యమును గూర్చి**

ముత్యములు సుతారము, ఆణి, సుపాణి అనే రూపాలుగా దశవిధ దోషాలు లేకుండా లభించు చున్నాయని తెలిపాడు ఐతే ఇవి వరుసగా తేనెరంగు, బంగారుఛాయ, మహోజ్జ్వలమైన కాంతితో ప్రకాశించేవిగా ఉంటాయని వివరించాడు.

**నవరత్నాల పరీక్ష పద్ధతులు**

రత్నములు ధరించుటకు ముందు దోష రహితమైనవి ఎంపిక ఓచేసుకోవటంలో "రత్న పరీక్ష" ముఖ్యమైనది. లేనిచో మంచి ఫలితాలు పొందక దుష్ఫలితాలు కలిగే అవకాశం లేకపోలేదు. కావున శ్రేష్ఠ రత్నముకై రత్న పరీక్ష తప్పనిసరి. ఇక్కడ కవి రత్నములనెలా పరీక్షించాలో కొన్ని పద్ధతులను తెలిపినాడు.

క. **సలవణ గోమూత్రములో**
**బలుమురు నిడియముక దోనుబగిలిన ముత్యం**
**బులు కృత్రిమములు మించులి**
**మొలకల వలె నెత్తు ముత్యములు సహజంబుల్.**

అంటూ పై పద్యములో ఉప్పు కలిపిన గోమూత్రంలో ముత్యాలను నానబెట్టి ఆ తర్వాత వరి ఊకతో రుద్దినట్లైన ముత్యం పగిలితే అది కృత్రిమ ముత్యమని పగలకుండా మిక్కిలి కాంతి గల్గి ప్రకాశించినచో అట్టిది సహజమైన ముత్యమని ముత్యముల నెలా పరీక్షించాలి విపులీకరించాడు భైరవకవి.

"పచ్చ" రత్నముపై తెల్లని సున్నముపూసి చూసినట్లైతే ఆ పూతను దాటి లేత సూర్యుని ప్రకాశముతో పచ్చ కనబడినట్లైన అది సహజమైన శ్రేష్ఠమైన మరకతమణిగా గుర్తించాలని పచ్చలను పరీక్షించు తీరును వివరించాడు.

ఇనుపకడ్డిపై పెట్టి బలంగా సమ్మెటచే కొట్టగా పగలకున్నను, నీటిపై వేసిన మునగకుండా తేలినను, ఆకురాల్లచే రంపాలచే కోసినను గీతైనా పడకుండినను అట్టి వజ్రమును శ్రేష్ఠమైన, సహజ వజ్రంగా గుర్తించాలని వజ్ర పరీక్షను తెలిపాడు.

కవి ఇతరములైన కెంపు, పగడం, గోమేధికం, పుష్యరాగం, నీలం, వైడూర్యంల గూర్చిన పరీక్ష విధానాలను తెలియజేసియుంటే బాగుండేది. నేటి కాలంలో కృత్రిమ రత్నాలు మార్కెట్‌లోకి ఎక్కువగా వస్తున్నందున రత్నపరీక్ష ఎంపిక ప్రధానమైనది కనుక. ఈ గ్రంథ పూర్ణత్వమునకు ఇతర రత్నాల పరీక్ష ప్రధానమైనదని ఒక భావన.

**నవరత్నముల గుణ దోషాది వివరణ**

నవరత్నములందుగల దోషాలేమిటో వివరిస్తున్న ఆ దోష రత్నాల ధారణచే కలిగే అశుభ ఫలాలేమిటో కవి తెలిపాడు.

**1) కెంపు**

క. **పాలుపై బూసిన లీల నుండెడు మణి**
**లశున పటల మాదిలక్ష్మి జెరచు**
**బగిలిన గతినున్న పై నున్న ద్రాసంబు**
**కలహమెప్పుడు దానగలుగుచుండు**
**దునుకపోయినరీతి దోచుభిన్నంబది**
**చయ్యన బంధు పక్షంబు చెరచు**
**జిదురు పలైనయట్లో దవిన పటలంబు**
**ఘవశోకవనధిలో మునుగ జేయు**

తే. **జాలపొరలున్న జర్ఝర సంజ్ఞ యగును**
**గర్కశంబది ప్రాణసంకటమొనర్చు**
**నీల మనునది నల్లనై నెగడుడాలు**
**విడువ వలదట్టి దోషముల్ గలిగెనేని**

పై పద్యంలో 1. పాలు పూసినట్లు తెల్లగానున్నది పటల దోషము గల కెంపు అని, 2. కాంతిలో పగుళ్ళు కనబడిన 'త్రాస' దోషమని దాని ధారణచే కలహాలు పుట్టునని, 3. కాంతిలో ముక్కలు ముక్కలుగా నున్న 'భిన్న' దోషము దానిచే బంధు విరోధం కల్గును, 4. పొరలు పొగల్ను 'జర్ఝర' దోషమని తద్వారా ప్రాణపాయమని, 5. గడుసు బారియున్న 'కర్కశ' దోషమని అట్టి దానిచే మృత్యు భయం కల్గునని కెంపులోని దోషాలు అట్టివాని ధారణచే కల్గు దుష్ఫఫలితాలు తెలిపాడు.

**2) ముత్యం**

దోషం గల ముత్యాలెలా ఉంటాయో వాటి దుష్ఫలితాలేమిటో తెలిపాడు.

1. మూడు మూలలు గల ముత్యం 'దృశ్యం' దోషం కల్గినదిగా.
2. పక్కలలో నొక్కులు గల్గినది 'పార్శ్వకృశ' దోషం గల ముత్యం.
3. ఎక్కువ నీలంగా కనబడేది 'కాకపాణి' దోష ముత్యం.
4. బుడుగులతో అగుపించునది 'వికటపీఠ' దోషం.
5. మురికి గల్గిన కాంతి గలది 'జాఠరము' దోషం.
6. అతి ఎరుపు ఎర్రరంగు గలది 'విద్రుమ' దోషంగల ముత్యంగా.
7. పొగవర్ణం గలది 'ధూమ్రాంక' దోషం.
8. చేపకన్నువలెనున్న 'ముత్స్యాక్షి' దోషం.
9. చిప్ప రజను ముత్యం కదలకు అంటినచో 'శుక్తి స్పర్శ' దోషం గల ముత్యంగా.

10. పైన మూడు పొరలున్నచో 'త్రివృత్త' దోషం గల ముత్యంగా దోషాలు గల ముత్యాలగూర్చి వివరించి వానిని ధరించుటంతో సిరితొలగి మనోరోగాలు, ప్రబలుతాయని చెప్పినాడు.

**3) పచ్చలగూర్చి వివరిస్తూ**

మరకతమణులు పుప్పి, గార, కర్కశమను మూడు దోషాలు, కల్గియుండునన్నాడు. పుచ్చినట్లు కనబడినను 'పుప్పి' దోషంకలిగిగాను, పచ్చరంగు కనుపించకుండానున్నవి 'గార' దోషంకలవిగాను పచ్చలపై నున్నవు గచ్చు వేసినట్లు కనబడినను 'కర్కష'మను దోషం గలివిగా పచ్చల దోషాలను వివరించాడు. వీనిని ధరించుటచే పిచ్చి, మూర్చలు, రోగాలు కల్గుతాయని తెలిపినాడు.

**4) నీలమణి దోషాలు గూర్చి వివరిస్తూ**

గీత గల్గి పగిలినట్టుగా కనబడేనీలాలు 'త్రాస' దోషంగల నీలాలుగాను, నీలకాంతి పైకి కనుపించ లేకుండానున్నవి 'భిన్నము' అనే దోషంగలవి పగుళ్ళు గల్గిన నీలాలు 'పటల' దోషం కలవిగా యిసుక దాల్చినట్లుగా నున్నవి 'పాషాణగర్భ' దోషం నీలములోన మెత్తని మన్నున్నట్లు గలవి 'మృద్గర్భ' దోషం కలవిగాను. పైన రక్తపు ఎర్రటి మచ్చలున్నవి 'రక్తబాదు' దోషం గల నీలమణులుగా తెలిపినాడు.

అంతేగాక నీలములందు మలినం, విచ్ఛాయ, కుక్షర, కరంజి, వాలుకాస్పర్శ అనే 5 సామాన్య దోషాలున్నా నీలమణులు లభించు చున్నాయని వివరిస్తూ. త్రాస దోష నీలంచే కలహాలు, భిన్న దోషం కలవాటిచే బంధు విరోధం, పటల దోషంకల నీలాలచే అధిక శ్రమ, పాషాణ గర్భ నీలాలచే పుత్రనాశం మృద్గర్భ దోష నీలమణుల ధారణచే ప్రాణాపాయం వంటి చెడు ఫలితాలు సంభవిస్తాయన్నాడు.

**5) వజ్ర దోషాల గూర్చి తెల్పుచూ**

వజ్రమునందు నల్లరేఖలు నిలువుగా గాని అడ్డంగా గానీ ఉన్న అట్టివి "కాకపద" దోషం గల వజ్రాలు అని, కాంతి లేకుండా మందంగా నుండి, మురికితో కోణములు, అంచులు లేకుండా యున్నవి ముంద్రా దోషం గల వజ్రాలని దోషంగల వజ్రాలను గూర్చి తెలిపాడు. "కాకపద" వజ్రాలచే మరణం ముంద్ర దోషంగల వజ్రాలచే సిరి తొలగుట వంటి దుష్ఫలితాలున్నాయని వివరించాడు.

కాగా కవి పగడం, గోమేధికం, పుష్యరాగం, వైడూర్యం రత్నాలకు చెందిన దోషాల గురించి వివరించ లేక పోయాడు వివరించి యుంటే రత్న ధారకులు దుష్ఫలితాల పొందుటకు అవకాశం లేకుండా ఉండేది.

**నవరత్న ధారణ శుభాశుభ ఫలితాలు**

శ్రేష్ఠమైన దోష రహితమైన నవరత్నాలను ధరించుటచే ఎట్టి ఫలితాలు కలుగుతాయో వివరించాడు.




**క. కురువిందము ధరియించి**
**నరవింద హితుండు ప్రీతుడైయారోగ్యం**
**బిరవొంద నిచ్చునెప్పుడు**
**సిరులొంద సమస్త కార్య సిద్ధులొసంగున్**

అనుచూ పై పద్యములో కురువిందము లేదా శ్రేష్ఠమైన కెంపును ధరించినచో సూర్యానుగ్రహంకల్గి, ఆరోగ్యం, సంపదలు, కార్యసిద్ధి వంటి శుభ ఫలితాలు లభించునన్నాడు.

శ్రేష్ఠ ముత్యాలు ధరించుటచే కల్గు ఫలితాలు వివరిస్తూ, వెదురు బొంగు నుండి లభించిన ముత్యాలు ధరించుటచే స్త్రీ వశీకరణం, సకల శుభాలు కల్గునని, చేప తల నుండి జనించిన ముత్యాల్ని ధరించుటచే అగ్ని భయం నశించునని, ఏనుగు కుంభ స్థలాన్నుండి లభించిన ముత్యాలచే రాజ వశీకరణం కల్గునని, చెరుకు గడనుండి వచ్చిన ముత్యాలచే స్త్రీ, రాజ వశీకరణం వంటి శుభ ఫలితాలు సిద్ధిస్తాయని తెలిపినాడు.

**క. సురుచిర విద్రుమ రత్నము**
**ధరణిజులకు యోగ్యకరము ధాత్రిజనవశీ**
**కరమగు వనితలకు మనో**
**హరము జయప్రదము ప్రమదమార ధహినన్**

అంటూ పై పద్యములో ప్రకాశవంతమైన, శ్రేష్ఠమైన ప్రవాళము / పగడాల్ని ధరించుటచే సమస్త జనవశీకరణ, జయప్రదం వంటి శుభ ఫలితాలు కల్గుతాయని వివరించాడు.

"గోమేధిక"ము ధారణచే మిక్కిలి విజయం, సమస్త సౌఖ్యాలు సిద్ధించునన్నాడు.

"పుష్యరాగ"మును ధరించుటచే గురుగ్రహపాత్రులై గొప్ప సుకృతం కల్గి మిక్కిలి శుభ ఫలితాలు పొందుతారని తెలిపాడు.

**క. లాలితవిశుద్ధ దీప్తుల**
**గ్రాలెడు నీలంబు లొప్పుగా ధరియింపన్**
**బోలగ సంపద లొసంగున్**
**మేలొసగు శనైశ్చరుండు మృత్యువు తొలగున్**

అంటూ పై పద్యములో మంచి నీలమణిని ధరించుటచే శని గ్రహానుగ్రహంతో అప మృత్యు దోషం తొలగి, సమస్త ఐశ్వర్యములు కలిగి, సుఖం బొందెదరని తెలిపాడు.

దివ్యమైన "పచ్చల"ను ధరించటచే దృష్టి దోషముతో పాటు తేలు, పాము వాని విషములు తొలగి పోవును, అట్టి దానిని బ్రాహ్మణునకు దానమిచ్చినట్లైన నిత్య సంతోషము, గొప్ప పుణ్యం సంప్రాప్తించునని వివరించాడు.

"వైదూర్యము"లను ధరించుటచే స్త్రీలకు సుఖప్రసవం కల్గి నిత్య ఉత్సాహములు కల్గుతాయని, భూత, ప్రేత పిశాచాల భయాలతో పాటు శత్రు భయం నశించునని తెలిపాడు. మిక్కిలి శ్రేష్ఠమైన "వజ్రములు" ధరించుటచే శంకరుడు అనుగ్రహించి సకల శుభాలు చేకూర్చుతాడంటూ భైరవకవి శ్రేష్ఠమైన నవరత్నములను ధరించుటచే కల్గు శుభ ఫలితాల గూర్చి చక్కగా విపులీకరించాడు.

భైరవకవి రత్నశాస్త్ర కావ్యంలోని పై ఆరు ప్రధానాంశాలను క్షుణ్ణంగా పరిశీలించగా వీరు గొప్ప శాస్త్ర పాండిత్యం గలవారుగాను అందులోనూ జ్యోతిశ్శాస్త్ర ప్రావీణ్యంగల కవిగాను భావించుటలో అతిశయోక్తి ఏమీలేదని అనిపిస్తుంది.

శాస్త్ర గ్రంథాల ప్రధానలక్ష్యం వ్యక్తి శ్రేయస్సుగా భావించవచ్చును. రత్నశాస్త్రం ఆవిర్భావానికి మూలం మాత్రం జ్యోతిశ్శాస్త్రంగా పేర్కొనవచ్చును. జ్యోతిశ్శాస్త్ర సూచించే శాంతి ప్రకియల్లోని ఒక భాగమే రత్నధారణ ఆ రత్న ధారణమే కాలక్రమంగా రత్నశాస్త్రంగా రూపుదిద్దుకుంది.

ఈ రత్న పరీక్ష / రత్న శాస్త్ర గ్రంథ ప్రయోజనాన్ని అవలోకించితే దీని ద్వారా శ్రేష్ఠమైన రత్నాలను ఎంపిక చేసుకోనవచ్చును. ఏ రత్నం ధరించుటచే ఎట్టి ఫలితాలు సిద్ధించగలవో తెలుసుకొనవచ్చును. దోషరహిత రత్నాలేవో పరీక్షించి ఒక నిర్ధారణకు రావచ్చును. ఏవి అల్పమూల్య రత్నాలో ఏవి మిక్కిలి విలువైన రత్నాలో ఏ రత్నాలు ఎచ్చట ఉద్భవించనున్నాయో పలు విషయాన్ని గ్రంథం ద్వారా గ్రహించవచ్చును. గోచార రీత్యా జాతకరీత్యా ప్రతికూల ఫలాన్నిచ్చే గ్రహాన్ని గుర్తించి ఆ గ్రహరత్నాన్ని లేదా ఉపరత్నాన్ని శరీరంపై ఉంగరములో పెట్టుకొని ధరించుటచే ఆయా గ్రహ దోషములను నివారించుకొన వచ్చును. అనారోగ్యానికి ఏ గ్రహం కారణమో తెలుసుకొని రోగనివారణకై ఆధునికకాలంలో ఆ గ్రహరత్నాన్ని ధరించడం సంప్రదాయంగా కలదు. అనారోగ్య నివారణకు ఎడమ చేతికి, అభివృద్ధి కొరకై, కుడిచేతికి రత్నాలను ధరించే ఒక ఆచారం కూడా కలదు. అలా రత్నధారణచే పలు ప్రయోజనాలు కలవని తెలియబడుచున్నది. రత్నశాస్త్రం మూలంగా దోష నివారణలోని భాగంగా "జీమ్‌థెరపి" "స్టెల్లార్ హీలింగ్" వంటి వైద్య ప్రక్రియలు ఆధునిక కాలమందు విస్తరించుకున్నాయి.

❖ ❖ ❖ ❖ ❖

## వెలుతురు ఖడ్గం

### శోభన్‌బాబు బొలుగాని

నిద్ర రాకుంది
బయటి రొదలతో
ఫ్యాన్ వేశాను 1

ఉపమానాలు
చక్కని కవితకు
కొలమానాలు 2

సామాజికత
చేసిన పాపమేంటో
హైకూ గిట్టదు 3

వస్తువేమిటి
రాయడానికిక్కడ
పస్తులు తప్ప 4

యరత లేంటి
భజసల వైరులు
బడాయిజమై 5

జీవితమందు
పట్టు విడుపులను
శ్లేషగా మార్చు 6

ప్రకృతి తప్ప
వేరే ధ్యాస లేదుగా
హైకూ తల్లికి 7

వేరుకున్నాను
చిన్నప్పుడు పరిగె
పదాలిప్పుడు 8

ఆయా వాదాలు
అద్వైత మహా వృక్ష
ఫల పుష్పాలు 9

ఖరారౌ తుంది
ఊహల ఉరి శిక్ష
కమ్మ లేకుంటే 10



## కవితా స్రవంతి

### గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్, భాగ్యనగరం

ఆలోచనలు పారుతుంటే
విషయాలు వెంబడించాలి

భావాలు పుట్టకొస్తే
బయటపెట్టమని పురమాయించాలి

కలము పట్టుకుంటే
అక్షరాలు జాలువారాలి

కాగితం నిండితే
కవిత్వం వెలువడాలి

కవితలు స్రవిస్తుంటే
సాహితీలోకం సుసంపన్నంకావాలి

పాఠకులు చదివితే
హృదయాలు ఉప్పొంగాలి

మనసులు సంతసిస్తే
కవులు స్థిరస్థానంపొందాలి

కవులు వ్రాస్తుండాలి
కైతలు పుడుతుండాలి

కవిత్వం వర్ధిల్లాలి
సాహిత్యం సుభిక్షమవ్వాలి

కవులరాతలు
అమృతంచిందాలి
కవిశ్రేష్ఠులు
అమరులుకావాలి



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3 (47) హైదరాబాద్ జనవరి : 2025
UGC CARE List Approved Journal

# అత్యాధునిక కవితా రూపం 'నానీ'

**డా. వెల్దండి శ్రీధర్,** తెలుగు అధ్యాపకులు, నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్గొండ. ఫోన్ : 9866977741

**'వాక్యం రసాత్మకం కావ్యం'** అంటాడు విశ్వనాథుడు తన సాహిత్య దర్పణంలో. నిన్నటి మహా కావ్యం 18 పర్వాలైతే నేటి మహాకావ్యం 18 వాక్యాలే అంటాడు శ్రీశ్రీ. ఇప్పటి కావ్యం నాలుగు పాదాలే అంటాను నేను.

కవితాభివ్యక్తికి తెలుగులో అనేక రూపాలు కన్పిస్తాయి. అలనాటి కందం, ఆటవెలది, తేటగీతి, ద్విపద, ఆ తర్వాతి కాలంలో గురజాడ వారి ముత్యాల సరాలు, దాశరథి రుబాయీలు, డా. సి. నారాయణరెడ్డి గజళ్లు, ప్రపంచపదులు, ఆరుద్ర కూనలమ్మ పదాలు, గాలి నాసరరెడ్డి హైకూ, డా. ఎన్. గోపి నానీలు, నానీలను పోలిన నానోలు, రెక్కలు, కైకూలు, ట్రిమ్రీలు, చినుకులు, గవ్వలు, అణువులు, ముక్కానీలు, మొగ్గలు, ... ఇలా అనేక అభివ్యక్తి రూపాలు కనిపిస్తాయి.

డా. ఎన్. గోపి అద్భుత సృష్టితో 1997లో తెలుగు కవితా యవనిక పైకి బుడిబుడి అడుగులతో ప్రవేశించిన 'నానీ' ఇప్పుడు పాతికేళ్ల వయసు దాటి నిండు యౌవనంలోకి అడుగుపెట్టాడు. 'నానీ' అంటే నావీ, నీవీ వెరసి మనవి అని డా. ఎన్.గోపి నిర్వచనం. చిన్న పిల్లల్ని కూడా నానీలంటాం. కవిత్వంలో ఇవి కూడా అట్లాంటివే. హైకూకు 17 అక్షరాలున్నట్లు నానీకి 20-25 అక్షరాలుండవచ్చు. మాట ఎక్కడ విరిగితే అక్కడికి ఒక పాదంగా నాలుగు పాదాలుంటాయి. ఛందస్సు సర్ప పరిష్వంగాన్ని వదిలించుకొని, పద్యాల నడుములు విరగదన్ని, నిఘంటువుల్ని సమాధి చేసి, సామాన్య మానవున్ని మకుటధారిగా చేసి అత్యంత సహజంగా, సరళంగా, భావ వ్యక్తీకరణకు తోడ్పడే కవితా రూపం వచన కవిత్వం. ఇందులో మినీ కవిత్వానికి మరో వెసులుబాటు ఉంటుంది. దీర్ఘ కవితలో ఉండాల్సిన ఆలోచనా ధార, కొనసాగింపు, కథనాత్మక శైలి దీనికి అక్కరలేదు. Spontaneous over flow ఉంటే చాలు. కవి మెదడులో అనేక శకలాలుంటాయి. వాటికి కవిత్వపు రూపాన్ని ఆపాదించడమే నానీ. నానీ చూడడానికి చిన్నదిగానే ఉన్నా రాయడం చాలా కష్టం. నానీలో ఒక విరుపు, ఒక చరుపు, ఒక మెరుపు ఉండాలి. అప్పుడే పాఠకుడి హృదయంలోకి నేరుగా వెళ్తుంది. నానీలో గాఢత, సాంద్రత, చిక్కదనం, కవిత్వాంశ బలంగా ఉన్నప్పుడే కాల పరీక్షకు నిలబడుతుంది. నానీల ముఖద్వారం నుండి తెలుగు కవిత్వ రంగంలో అడుగుపెట్టి కవులుగా గుర్తింపు పొందినవారు ఎంతో మంది ఉన్నారు. ఇప్పటి దాకా దాదాపు 250 నానీల సంపుటాలు వెలువడి ఉంటాయి. సుమారు వేయిమంది కవులు నానీలు రాశారు. రసరాజు లాంటి పద్య కవులు కూడా నానీలు రాయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. దీనికి కారణం నానీలలో ఏదో మార్మికత, ఇంకేదో ఆకర్షణీయ గుణం ఉండటమే. నానీలలో ఏవో బీజాక్షరాలు పడ్డాయి




అందుకే అంతగా పాఠకలోకంలోకి దూసుకుపోతున్నాయని అనేవారూ లేక పోలేదు. వర్ధమాన వేగవంతమైన కాలానికి సరిగ్గా సరిపోయే రూపం నానీ. ఇప్పుడు ఏ పనైనా క్షణాల్లో జరిగిపోవాల్సిందే. నానీ చదవడానికి 10 క్షణాలు చాలు. అంటే అత్యాధునిక కాలానికి అత్యంతాధునిక కవితా రూపం నానీ. మరో విశిష్ట గుణం సరళమైన అర్థగ్రాహ్యత. విన్న వెంటనే లేదా చదివిన వెంటనే మెదడులో పేలిపోతుంది. విద్యుల్లతలా వెలుగులు విరజిమ్ముతుంది. అయితే అట్లాంటి నానీ బయటికి రావాలంటే హృదయపు గదుల్లో నానీ నానీ వెలువడితే తప్ప అలవడదు. ఏ కవిత్వమైనా ప్రజల నాలుకల మీదికి ఎక్కితే దాని జీవితం ధన్యం, చిరకాలం. అట్లాంటి గుణం నూటికి నూరు శాతం ఉన్న నానీలకే అంతటి ఖ్యాతి దక్కింది. ఎంతో మంది సాహత్య, సాహిత్యేతర రంగాలకు చెందిన వారు తమ ప్రసంగాల్లో అక్కడక్కడా నానీలను 'కోట్' చేస్తున్నారు.

నానీలలో సకల ప్రపంచం తొంగి చూస్తుంది. అంటే వస్తు వైవిధ్యత అంత విశాలం అన్న మాట.

**'చెరువులో**
**బంగళాలు మొలిచాయి**
**నీటి తల్లికి**
**ఇన్ని సమాధులా?'** అంటారు డా. ఎన్. గోపి. చెరువులను సమాధి చేసి బంగ్లాలకు పునాదులు తీయడం ఈ నానీలో కన్పిస్తుంది. భూ ఆక్రమణ ఎంతగా పెరిగి పోయిందో దీనిలో కవితాత్మకంగా చెప్పారు కవి. నగరీకరణ విస్తరించినా కొద్దీ చెరువులు కూడా నగరంలో కల్సిపోయాయి. అవి చెరువులైనా, శ్మశానాలైనా మనిషి స్వార్థం ముందు నిలబడలేవు. నీటికి సమాధి కట్టి కాంక్రీటు అరణ్యాన్ని నిర్మిస్తున్న మనిషి కుటిలత్వానికి, ఆక్రమణ బుద్ధికి నిలువెత్తు నిదర్శనం ఈ నానీ. అందుకే Hyderabad Disaster Response and Assets Monitoring and Protection (HY-DRA) లాంటివి వచ్చి కొంత మరమ్మత్తు చేస్తోంది.




**'దీపంతో**
**పోల్చక్కరలేదు**
**కిరోసిన్‌కి**
**అర్పించకుంటే చాలు'** అంటారు ఎస్సార్ భల్లం. ఇంటికి దీపం ఇల్లాలని ఇల్లాలిని దీపంతో పోల్చుతాం. కానీ తనకి అంత అత్యాశ ఏమీ లేదు కానీ కిరోసిన్ పోసి, అంటించి హత్యచేయకుండా ఉంటే చాలనే కోడలి దీనత్వం కనిపిస్తుందీ నానీలో. వరకట్న హత్యలు, అనుమానపు హత్యలు, పరువు హత్యలు నిత్యం మన సమాజంలో చూస్తూనే ఉన్నాం. ఏడడుగుల బంధంతో మెట్టినింట అడుగు పెట్టిన అమ్మాయిని మాటల ఈటెలతో పొడిచి చివరికు తన్ని మంటల్లో తగిలేసే కుటుంబాలెన్నో..

**'ఏడు పదులలోనూ**
**'యజ్ఞం' చేశాడు**
**కథానిలయం**
**తెలుగోడి డాక్యుమెంట్!'** అంటారు డా. ద్వా. నా. శాస్త్రి. 'యజ్ఞంతో తొమ్మిది' కథాసంపుటి ద్వారా తెలుగు పాఠక హృదయాలలో స్థిరస్థానం ఏర్పర్చుకున్న కాళీపట్నం రామారావు మాస్టారిని, కథానిలయాన్ని పట్టి చూపించిన నానీ ఇది. నిజంగానే కథానిలయం తెలుగు కథకుడి చిరునామా. తెలుగు కథను పుట్టినప్పటి నుంచి 'ప్రిజర్వ్' చేయడం యజ్ఞంతో సమానమే.

**'అదేం**
**చిత్రమో**
**పట్నమొచ్చి చూస్తేగానీ**
**పల్లె సౌందర్యం తెలియలే!'** అంటారు సోమేపల్లి వెంకట సుబ్బయ్య. పల్లె కౌగిట్లో జీవించినన్నాళ్లూ పల్లె సాదా సీదా చిత్రపటం. కానీ పల్లెను విడిచి ఉద్యోగం కోసమో, జీవిక కోసమో నగరాన్ని చేరిన తర్వాత పల్లె ఒక అద్భుత కళాఖండంలా కన్పిస్తుంది. సహజ సౌందర్యానికి, అమాయకత్వానికి, ఆప్యాయతకూ, అనురాగానికీ పచ్చని సంతకంలా కన్పిస్తుంది పల్లె. పల్లె అంటే ఆత్మీయత ముల్లె. అందుకే కవికి అంత సౌందర్యంగా కనిపిస్తుంది. పల్లెను తల్చుకొని మైమరచి పోనిదెవరు?, పల్లె అందంపై కవిత్వం రాయని కవి ఎవరు?

**'కాశ్మీర్ ఆపిల్**
**కొరికి చూద్దును కదా**
**గడ్డ కట్టిన**
**నెత్తురు'** అంటారు సుబ్బయ్య గారే. భారతదేశ చరిత్రలో జమ్మూ కాశ్మీర్ ఎప్పటికీ రగిలిపోయే రావణ కాష్టం. పచ్చని లోయలతో, ప్రకృతి సౌందర్యంతో అలరారే కాశ్మీర్ ఒక నెత్తుటి గడ్డ. తీవ్రవాదం, మతఛాందస వాదం, సరిహద్దు సమస్య ఇవన్నీ కలిసి కాశ్మీర్‌ను అతలాకుతలం చేశాయి. అదృష్టవశాత్తు ఈ మధ్య కాశ్మీర్ సమస్య పరిష్కరింపబడి ఒకింత శాంతి పవనాలు వీస్తున్నాయి అక్కడ.

**'వేర్లనోట్లో**
**గుక్కెడు నీళ్లు పోద్దాం**
**గ్లోబును**
**ఆకుపచ్చ ముత్యం చేద్దాం'** అంటారు యశశ్రీ రంగనాయకి. చెట్టును నరకడం మానవ కుసంస్కారానికి పరాకాష్ట. అందుకే కవయిత్రి గుక్కెడు నీళ్లు పోసి Blue Planet "Green Planet గా మార్చుదాం అంటుంది. చెట్టు మానవ జీవనాడికి తొలిమెట్టు. చెట్టూ, నీళ్లూ లేకపోతే జీవి మనుగడ ప్రశ్నార్థకం. అందుకే 'చెట్టును పెంచు చిరకాలం జీవించు' అనే సూక్తిని కడుపులో దాచుకున్న నానీ ఇది.

**'అమ్మకు**
**అక్షరాలు రెండే**
**చాకిరీకి**
**డిక్షనరీ చాలదు'**

త్సవటపల్లి సాయి వెంకన్న బాబు నానీ ఇది. తెలుగు సాహిత్యంలో అమ్మపై బోలెడు కవిత్వం వచ్చింది. అమ్మంటే అమలిన ప్రేమకు నిలువెత్తు సాక్ష్యం. అయితే అమ్మను మరో కోణంలో చూపించడం లోనే కవి గడుసుదనం దాగి ఉంది. అమ్మంటే జీవితాంతం జీతం లేని పనిమనిషి స్థాయికి దిగజార్చింది ఈ పురుష ప్రపంచం. ప్రేమను కలగలిపి ఆమె చేసే చాకిరీని వర్ణించడానికి డిక్షనరీ చాలదనడం గొప్ప అభివ్యక్తి.

**'శకుంతలా**
**దుష్యంతుడొస్తున్నాడు**
**ఈ సారి నువ్వే**
**ఉంగరం తొడగాలి'** ఎస్. రఘు నానీ ఇది. కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలం'లో దుష్యంతుడు శకుంతలను గాంధర్వ వివాహం చేసుకొని పోతూపోతూ గుర్తుగా వేలికి ఉంగరం తొడుగుతాడు. తర్వాత మర్చిపోయి కనీసం గుర్తు కూడా పట్టకుండా భార్యగా అంగీకరించడు. కానీ ఇప్పుడు కాలం మారింది. శకుంతలనే ఉంగరం తొడగమంటున్నాడు కవి. మారిన చైతన్యానికి నిదర్శనం ఇది.

**'హైటెక్ యుగం**
**అంతటా కంప్యూటర్లు**
**మనోవ్యథ తుడిచే**
**సాఫ్ట్‌వేర్ లేదు'** అంటారు డా. పత్తిపాక మోహన్. ప్రపంచమంతా కంప్యూటర్ మయం. అంతా ఒత్తిడి జీవితం. ఈ మనోవ్యధను తుడిచే సాఫ్ట్‌వేర్ ఏంటీ అని కవి ప్రశ్న. ఎంత ఆధునికత పెరిగినా, ఎంత టెక్నాలజీ పెరిగినా మానసిక ప్రశాంతత లేక పోతే మన ముందడుగులకు అర్థం లేదు. డబ్బు, వస్తు సంస్కృతి చుట్టే జీవితమనే భ్రమలో ఉన్నంత కాలం ఈ రోగానికి మందులేదు.

**'సీరియల్ల వరదలో**
**కాలం కొట్టుకు పోతోంది**
**ఇల్లాలు**
**టీవీలో కప్ప'** అంటారు 'మానేరు నానీ'ల్లో జిందం అశోక్. సగటు ఇల్లు ఇవాళ టీవీ చెప్పుచేతల్లోకి వెళ్లింది. మాటైనా, భోజనమైనా అడ్వర్టైజ్‌ల మధ్యనే చేసే దౌర్భాగ్యం. మనిషి టీవీలో కప్పగా మారాడు. మానవ పరిణామ క్రమంలో ఇదొక మరుగుజ్జు దశ.

**'డాక్టర్**
**ఎప్పుడూ రక్త పరీక్ష**
**మూత్ర పరీక్షేనా**
**చెమట పరీక్ష చెయ్యవేం'** అని ప్రశ్నిస్తారు డా. నలిమెల భాస్కర్ 'మట్టి ముత్యాలు' నానీల సంపుటిలో. శ్రమజీవన సౌందర్యాన్ని మరో కోణంలో తరచి చూడటం కనిపిస్తుందీ నానీలో. రక్త పరీక్ష, మూత్ర పరీక్ష చేస్తే ఏం తెలుస్తుంది. దేహంలోని షుగర్ లెవలో, బి.పి. లెవలో తెలుస్తాయి. కానీ అదే దేహం నుండి పుట్టిన చెమట చుక్కను హృదయమనే పరీక్ష నాళికలో వేసి పరీక్షిస్తే ఉత్పత్తి వర్గాల ప్రాధాన్యం, వారి సామాజిక స్థాయి ఏ లెవల్లో ఉన్నాయో తెలుస్తాయి. చెమట బిందువు పరీక్ష ద్వారా సమాజ ఆరోగ్య స్థితి, మనిషి దైన్య స్థితిని అధ్యయనం చేయవచ్చని తెలిపే నానీ ఇది.

**'ఖానే వాలేకా**
**నామ్ ఛోడో**
**ప్రతి గింజ మీదా**
**రైతు సంతకముంది'** అంటారు అదే నలిమెల భాస్కర్. తొడిగిన చెప్పు మీద దాన్ని తయారు చేసిన కార్మికుడి పేరు, తొడుక్కున్న అంగి మీద నేసిన నేత కార్మికుడి పేరు, ధాన్యపు గింజ మీద రైతు పేరు రాసి ఉంటాయా? ఉంటాయి. మనం మనసు పెట్టి, హృదయమనే భూతద్దం పెట్టి చూస్తే. కవి శ్రమ చేసిన వాడి వైపు నిలబడతాడు. పీడితుని వైపు నిలబడతాడు. అది ఈ నానీలో అసలు నిజం. శ్రమ చేసే వాడొకడు, కూర్చొని తినే వాడు మరొకడు. ప్రతి గింజా రైతు శ్రమ నుండి పుట్టిందే. మట్టిని ధాన్యంగా మార్చే 'ఆల్కెమీ' తెలిసిన మార్మికుడు రైతు. గింజదీ, రైతుదీ జన్మ జన్మల




బంధం. అందుకే ప్రతి గింజ మీదా రైతు తనదైన ముద్ర వేసే మార్కెట్‌లోకి పంపిస్తాడు. అయితే ఆ సంతకాన్ని 'ట్రేస్' చేసే పరిపక్వత మనిషికుండాలి.

**'ఇప్పుడు**
**రెండే ఫ్యాషన్లు**
**అమ్మాయిలకు డైటింగ్**
**ఆంబోతులకు డేటింగ్'** అంటారు వెల్దండి శ్రీధర్. ఇప్పుడు ప్రపంచమంతా వ్యక్తిత్వ వికాసం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, జీరో సైజ్ చుట్టూ తిరుగుతోంది. అలాగే డేటింగ్, విదేశీ సంస్కృతి చుట్టూ తిరగడం, దాన్ని మూఢంగా అనుకరించడం అలవాటయింది. ఇంతటి వస్తు వైవిధ్యంతో పాటు నానీల్లో గొప్ప తాత్వికత నిండిన నానీలు కూడా ఉన్నాయి. తాత్వికతను పులుముకొని దివ్యంగా వెలిగిపోయే నానీలు అనేకం.

**'కుండ ముక్కలైందా**
**కుమిలి పోకు**
**మట్టి మరో రూపం కోసం**
**సిద్ధమౌతుంది' - డా. ఎన్. గోపి.**

మనిషి పాత వస్త్రాన్ని త్యజించి, కొత్త వస్త్రాన్ని ధరించినట్లు ఆత్మ ఒక దేహాన్ని వదిలి మరో దేహాన్ని తొడుక్కుంటుందనే గీతా సారాన్ని తెలియజెప్పే నానీ ఇది.

**'జీవితం**
**నాకెంతో ఇచ్చింది**
**లాగేసుకున్నది కూడా**
**ఎక్కువే'** అంటారు ఎన్. అరుణ. జీవితంలో ఏదో సాధిద్దామని కుటుంబాన్ని, ఫ్రెండ్స్‌ని కూడా వదిలిపెట్టి ఎక్కడికో పరుగులు పెడుతాం. ఏ శ్రమలోనో రోజంతా గడిపేస్తాం. తీరా కొన్నేళ్లు మనకు సోయి లేకుండానే దొర్లిపోయిన తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే మనం సాధించినదాని కంటే కోల్పోయిందే ఎక్కువేమోననిపిస్తుంది. అందుకే జీవితాన్ని అర్థవంతంగా గడపడం కూడా ఒక కళేనంటుంది కవయిత్రి.

**'నిజానికి ఈ లోకం**
**పరాయి దేశం**

# పరవశించు మేను ప్రకృతి గాంచి

## నరసింహా రావు

సంధ్య సమయమందు చల్లగాలులు వీయ
కోకిలమ్మ గొంతు కూయుచుండ
స్వచ్ఛమైన గాలి శ్వాసించ లభియించ
పరవశించు మేను ప్రకృతి గాంచి.

పశ్చిమాద్రి జేరు పగలంత వెలుగిచ్చి
సప్త అశ్వ రథుడు చల్లబడగ
అరుణకాంతి యున్న ఆకాశము కనగ
పరవశించు మేను ప్రకృతి గాంచి.

పరుపు పరిచినట్లు పచ్చ పైరుల తోడ
కంటి చూపు మేర పంట యుండి
మనసు దోచు నట్టి మాగాణి చూడంగ
పరవశించు మేను ప్రకృతి గాంచి.

అడవి పూల సొగసు అందాలు విరజిమ్మ
వాటి తావి ముక్కు పుటల తాక
వాటిపైన వాలు భ్రమర ధ్వని వినగ
పరవశించు మేను ప్రకృతి గాంచి.

కూటి కొరకు వెళ్ళి గూటికి చేరంగ
పిట్ట జంట లన్ని చెట్టులెక్క
పాల పిట్ట చేయు కిలకిలారావాలు
పరవశించు మేను ప్రకృతి గాంచి.

ఏటి గట్టు చేరి ఇసుక తిన్నె నిలచి
పరుగు లెడుతు పారు నీరు గాంచి
కళ్ళు మూసుకొనుచు నీళ్ళు సద్దు వినగ
పరవశించు మేను ప్రకృతి గాంచి.

ఊరి బయట యున్న ఊడమఱ్ఱి పయిన
గూడు కట్టుకొనుచు కులుకుచుండి
పచ్చ గువ్వ జంట పలకరింపులు విన
పరవశించు మేను ప్రకృతి గాంచి.

నీవైనా నేనైనా

**వలస జీవులం'** వాసాల నర్సయ్య నానీ ఇది. ఇలాంటి చిన్న అద్దంలో కొండను ఇమిడ్చుకుని ఎంతో తాత్త్వికతను బోధించే నానీలు అనేకం.

భాష, భావం, వస్తువు, చమత్కారం, ధ్వని ఇవన్నీ కల్పితే నానీ. అయితే అక్షరాల్ని కుప్ప పోయడం సులభమే కానీ వాటిలో అసలైన కవిత్వాన్ని పోయడం చాలా కష్టం. అందుకే కొన్ని నానీలు పసలేని కూరలా తేలిపోతాయి. రూపం ఏదైనా కవిత్వం లేకపోతే వట్టి గులక రాళ్ల ధ్వనిగానే మిగుల్తాయి. అందుకే నానీ కవి కవిత్వపు పనిలో నిపుణుడై ఉండాలి. అప్పుడే మేలిమి పనితనంతో సరికొత్త భావజాలంతో, నూత్న పరిమళంతో నానీలు పాఠకుడి మదిలోకి అడుగులు వేస్తాయి.

ఎంతోమంది అనామకులచేత కలం పట్టించిన నానీలు గత పాతికేళ్ల నుండి తెలుగు సాహిత్య లోకాన్ని అలరిస్తున్నాయి. అంతే కాదు లబ్ద ప్రతిష్ఠులైన విమర్శకుల మన్ననలను పొందుతున్నాయి. **"తెలుగు సాహిత్యం అభివ్యక్తి సంక్షోభంలో పడిన సందర్భంలో కవిత్వాన్ని బతికించడానికి హోమియో గుళికల్లాగా నానీ ప్రక్రియ ముందుకు వచ్చింది"** అన్నారు కవి, విమర్శకులు సతీష్ చందర్. అలాగే **"నానీలు ఆధునికాంధ్ర కవిత్వంలో సరికొత్త ప్రయోగం. నానీలు ప్రయాణంలో దారి బత్తెం బతాణీలు కావు. అవధానుల అప్రస్తుత ప్రసంగాలు కావు. అవి వడిసెల రాళ్లు. అనుభూతి పారావతాలు. మహావృక్షాన్ని గర్భీకరించుకున్న మఱ్ఱి విత్తనాలు"** అంటారు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి. ఇలా తెలుగు కవిత్వ రంగంలోకి నిశ్శబ్దంగా ప్రవేశించి అనతి కాలంలోనే బలపడి శక్తి వంతమైన అభివ్యక్తి రూపంగా మారింది నానీ. అల్పాక్షరాల్లో అనల్పార్థం అనే మర్యాదకు అక్షరాక్షర సాక్ష్యం నానీ. అన్ని ఉద్యమాలకు, అన్ని వాదాలకు, అన్ని అస్తిత్వ పోరాటాలకు సరిపోయిన అత్యాధునిక కవితా రూపం నానీ. పాఠకుడి సమయాభావాన్ని దృష్టిలో పెట్టుకొని పురుడు పోసుకున్న నానీ అంతే వేగంగా సహృదయుడి హృదయ రాజ్యాన్ని గెల్చుకున్న రూపకారి. అందుకే పిల్లలు సైతం నానీలు రాస్తున్నారు. అది మంచిదే కదా! కవుల సంఖ్య పెరిగితే దుర్మార్గుల సంఖ్య తగ్గుతుంది అంటారు డా. ఎన్. గోపి.

ఇంగ్లీష్ మేడ్ ఈజీ లాగా పోయెట్రీ మేడ్ ఈజీయై కొంత మంది ఉబలాటపు కవుల చేతిలో పడి నానీ కొంత పల్చనైంది వాస్తవం. అందుకే నానీ రూపం అనేక విమర్శలకు కూడా గురైంది. అయితే ఎలక్ట్రానిక్ పరికరాలలో వస్తోన్న రూప విప్లవం లాగే కవిత్వంలో వచ్చిన ఈ నవీన రూప విప్లవాన్ని ఒప్పుకోవాల్సిందే. ఆరుద్ర అన్నట్టు **'ఎన్ని గజాలు రాసాడన్నది కాదు, ఎన్ని నిజాలు చెప్పాడన్నది ముఖ్యం'.**

❖ ❖ ❖ ❖ ❖

# ఏల్చూరి మురళీధర రావు గారి "వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాసఘట్టాలు"

**మాచవోలు శివరామ ప్రసాద్,** ఫోన్ : 9010384003

మురళీధరరావు గారు సాహిత్యంలో కృతభూరిపరిశ్రములు. ఆంధ్రభాషతోపాటు సంస్కృత ప్రాకృతాలలోనూ విశేషకృషి చేసినవారు. చక్కటి లక్షణ లక్ష్య పరిజ్ఞానం ఉన్నవారు. ఢిల్లీ శ్రీ వేంకటేశ్వర కళాశాలలో నాలుగు పదుల సంవత్సరాలు పాఠప్రవచనం చేసి బహుగ్రంథకర్తగా, పరిష్కర్తగా, గొప్ప పరిశోధనాపత్రాలు సమర్పించినవారుగా ప్రసిద్ధులు. విద్యాభ్యాసం మద్రాసులోనూ, ఆంధ్రదేశంలోనూ జరుపుకొని అంతర్జాతీయ ఖ్యాతి గడించినవారు.

సాహిత్యంలో సమస్యాత్మకంగా ఉన్న విషయాలే వీరి పరిశోధనాంశాలు. చెప్పే విషయాలన్నీ వినూత్నమైనవే. తలస్పర్శియైన నిరూఢపాండిత్యగరిమతో వీరు వ్రాసిన వ్యాసాలు క్రొంగ్రొత్తలై జిజ్ఞాస గల పండిత పాఠకులను మరింత ఆకర్షిస్తాయి.

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు ఆంధ్ర రచయితలు (1950) లో పూండ్ల రామకృష్ణయ్య గారిని గురించి వ్రాస్తూ – **"ఈయన బహుశ్రద్ధతో వెలువరించిన అముద్రిత గ్రంథ చింతామణి పత్రికలోని ప్రతిపత్రమును వేలకొలది విలువగలది"** అని (రూపాయకు విలువలున్న రోజులవి) వ్రాశారు.


మురళీధరరావు గారి **"వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాసఘట్టాలు మరికొన్ని విశేషాంశాలు"** చదువుతూ ఉంటే శాస్త్రి గారి ఈ మాటే గుర్తుకు వస్తున్నది.

మురళీధరరావు గారు 'నయాగరా' కవులలో ఒకరైన ఏల్చూరి సుబ్రహ్మణ్యం గారి తనయులు. పితృపాదుల అనుగ్రహంతో సంస్కృతాంధ్రాలలో గొప్ప పాండిత్యం సంపాదించారు. సాహితీకేదార కృషీవలులై రసవత్కావ్యాలెన్నో జుర్రుకొన్నారు. తేనెలొలుకే కవితలూ అల్లారు. శ్రీమద్భాగవతం, విష్ణుపురాణం సరళ వచనంలో అనువర్తించారు. దేవీ సప్తశతిని ఇంగ్లీషులోకి అనువదించారు. మూడు వందలకు పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. మూడు పదుల ఆంధ్ర, ఆంగ్ల గ్రంథాలకు పీఠికలు వ్రాశారు.

**'గణపవరపు వేంకటకవి (1650–1740) ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసము – సాహిత్య లక్షణ చిత్రకవిత్వానుశీలనము'** అనే అంశంపై పిహెచ్.డి సిద్ధాంత వ్యాసం ఢిల్లీ యూనివర్సిటీకి సమర్పించి, ఉత్తమ పరిశోధన అని పేరు తెచ్చుకొన్నారు.

వేంకటేశ్వర స్వామికి అంకితమైన ఏకాశ్వాస ప్రబంధం ఈ ప్రబంధరాజం. ఇది తెలుగు సాహిత్యంలో నిరుపమాన ఏకైక గ్రంథం. వేంకటేశ్వరుని లీలలు కథావస్తువు. పూర్వ లక్షణ గ్రంథాలన్నీ పరిశీలించి, తెలుగుకు సమగ్ర లక్షణ గ్రంథం లేదని 'సర్వ లక్షణశిరోమణి' అనే లక్షణ గ్రంథం వ్రాసి, దానికి ఉదాహరణ

**వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాస ఘట్టాలు – మరికొన్ని విశేషాంశాలు**
**సాహిత్య వ్యాస సంపుటి**
ఏల్చూరి మురళీధర రావు
వెల : 1000 /-
**ప్రతులకు :** అమేజాన్,
నవోదయ బుక్ హౌస్
కాచిగూడ, హైదరాబాద్.




ప్రాయంగా ఈ కావ్యం వ్రాయబడింది – అని కవి స్వయంగా చెప్పాడు. అది గమనించక వీరేశలింగం గారు ఇది గ్రంథచౌర్య బహుళం అని నిరసించారు. తర్వాతి విమర్శకులు ఈ భావాలను ఖండించారు గూడా.

పూర్వకవుల పద్యాలకు ఛాయలుగా పర్యాయ పదాలు ఎన్నుకొని పద్యాలన్నీ కూర్చాడీయన. ఇవి మొత్తం 882. ప్రతి పద్యంలోనూ రెండు, మూడు, కొన్నిట 30 వరకూ బంధాలున్న మహా ప్రౌఢ ప్రబంధం ఇది. రావుగారి ధారణాశక్తి అమేయం. వారు 480 పద్యాలకు మూలమైన తెలుగు ప్రబంధాల పద్యాలు పసిగట్టారు. అందుకు వారు పరిశీలించిన గ్రంథాల పేర్లూ, ఏ లక్షణానికి ఏ పద్యం ఉదాహరణో చక్కగా నిరూపించారు.

భారతకర్త కాక మరొక నన్నయ ఆంధ్రశబ్దచింతామణిని వ్రాసి ఉండవచ్చు అనీ, మానవల్లి ప్రచురించిన కుమారసంభవం కర్తృత్వం ఇంకా నిర్ధారణ కావలసిన విషయం – అనీ రావుగారి అభిప్రాయం.

మన తెలుగు భాష విస్తృతి, గాంభీర్యం, మాధుర్యం, దీని లోతుపాతులు చూడదలచిన వాళ్ళకు ఈ 'వ్యాస ఘట్టాలు మరికొన్ని విశేషాంశాలు' తప్పక అధ్యయనం చేయవలసిన, పలుమారు చదవవలసిన / చదివించే గొప్ప రచన.

'వ్యాసఘట్టాలు' అంటే గ్రంథులు (ముడులు) ఉన్న సందర్భాలు. భారతానికి లేఖకుడైన గణపతితో **"విన్న ప్రతి శ్లోకమూ అర్థం చేసుకొని వ్రాయాలి"** అని వేదవ్యాసమహర్షి అన్నాడట. చకచక వ్రాసేస్తూ ఉన్న పార్వతీ తనయుడి బుద్ధికి కొంచెం పనిపెట్టడానికి మహర్షి అక్కడక్కడా కొన్ని ఆలోచనాలభ్యాలైన అంశాలు చేర్చి పెట్టాడట. అవి గణేశుడి అవగాహనకు వచ్చే లోపల భావికవితాంశా లను మనసుకు తెచ్చుకొనేవాడట.

రావుగారి ఈ గ్రంథంలో నన్నయ, నన్నెచోడుడు, శ్రీనాథుడు, పిల్లలమర్రి పినవీరన, అన్నమయ్య, ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు, గణపవరపు వేంకటకవి వంటి ప్రాచీన కవులతోపాటు అబ్బూరి, విశ్వనాథ, శ్రీశ్రీ, ఆరుద్ర, కుందుర్తి, ఆచంట జానకీరామ్, బోయి భీమన్న, అనుమాండ్ల భూమయ్య మొదలైన ఆధునిక కవిపుంగవుల రచనలపై గూడా విశ్లేషణలున్నాయి.

చివరలో తపోనిధి కోరాడ రామచంద్రశాస్త్రి, అప్పాజోస్యుల సత్యనారాయణ గార్ల కావ్యాల ప్రశంస కనిపిస్తుంది. 750 పుటల ఈ మహాగ్రంథం తెలుగు పాఠకులను అలరిస్తూ ఉన్నది.

పీఠికలో వ్యాసఘట్టాలనబడే భారత శ్లోకాలకు పరిష్కారాలు చేసిన పలువురు ప్రాచీన పండితుల వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఎన్నో తాళపత్ర రూపంలో నిలిచిపోయిన రచనలు పరీక్షించారు. ఇందుకోసం ఓపికగా ఎన్నెన్నో తాళపత్ర గ్రంథాలయాలు దర్శించారు.

గ్రంథ గ్రంథులు కొన్నిటిని రావుగారు సూచించారు. చమత్కారమైన ఒక ప్రహేళిక :

**రంగత్తురంగమధిరోహతి రంగనాథే**
**గోత్రారిరాత్త కుతుకః కులిశం భిభర్తి**
**ఖేదం చ మోద ముపయాతి నగేంద్రకన్యా**
**కృష్ణాజినేన పరిముహ్యతి మౌళిమీశః.** ఇది మహావ్యాఖ్యాత మల్లినాథ సూరి రచన.

దీన్ని రావుగారు వ్యాఖ్యానిస్తూ, ఎంత సరళంగా తెలుగు చేశారో చూడండి.

**రంగనాథుండు రంగత్తురంగమెక్కఁ**
**గులిశమును దాల్చె గోత్రారి కుతుకమొప్ప**
**ఖేదమోదంబులందె నగేంద్రకన్య**
**మౌళిఁ గృష్ణాజినంబున మాటె శివుడు.**

ఇందులో రంగనాథుడనే రాజు ఒక్కడే నవీనుడు. మిగిలిన వారందరూ పౌరాణిక వ్యక్తులు.

రంగనాథుడు దిగ్విజయ యాత్రకు గుర్రం ఎక్కాడు. ఇంద్రుడు వెంటనే వజ్రాయుధం తీశాడు. పార్వతీ దేవికి ఖేదమూ, మోదమూ ఒకేసారి కలిగాయి. శివుడు తన కృష్ణాజినం అడ్డువేశాడు.

ఒకదానికొకదానికి పొంతన లేని అంశాలతో ఒక అతిలోక భావనల కూర్పు ఇది. రంగనాథుడి అశ్వధాటికి రేగిన **"ధూళి"** ఇక్కడి కీలకం. ఇది స్ఫురించకపోతే అంతటి మహావిద్వాంసుణ్ణీ తెలివితక్కువవాడుగా జమకడ్తాం. ఇదంతా అతిశయోక్తే. ఐనా, ఎంత దివ్యంగా ఉందో!

గిట్టల దెబ్బకు ధూళి మిన్నంటి, దిగి సముద్రంలో పడి, సంద్రాన్ని జలరహితం చేసింది. మైనాకుడు పైకి తలయెత్తాడు ఇంతకాలం వజ్రాయుధానికి భయపడి ఉండి.

ఈ కొండ తలెత్తుతున్నదే? ఏ ఉపద్రవం తెస్తుందో అని త్రిలోకరక్షాభార ధూర్వహుడు దేవేంద్రుడు వెంటనే కత్తి దూశాడు.

ఇపుడు పార్వతమ్మకు దుఃఖం కలిగింది. మా అన్నయ్యను ఈ సహస్రాక్షుడు తునుమాడుతాడో యేమో? ఏ అమంగళం వినవలసి వస్తుందో ఈ వేళ అని.

ఇంత కష్టంలోనూ ఒక తృప్తి ఆమెకు! నా సవతి ఈ దుమ్ముకు కళ్ళు కనబడక కిందపడి పోతుంది. ఇంక నాకీ సవతి పీడ ఉండదు అని. ఆ సర్వజ్ఞుడు ఈ బుద్ధిని పసికట్టలేడా? గంగను నెత్తిన పెట్టుకొన్నది విడిచిపెట్టడానికా? తన అంగవస్త్రం కృష్ణాజినం అడ్డు వేశాడు. గంగమ్మకు ఇబ్బంది కలగకుండా.

ఈ శ్లోకం అల్లమరాజు సుబ్రహ్మణ్య కవి తన **'చాటుధారా చమత్కార సారం'** లో ఉదాహరించి వివరించాడని రావుగారు చెప్పారు.

"ధారుణి రాజ్యసంపద మదంబున" – అనే నన్నయ గారి పద్యం విననిదెవరు? సినిమాలలోనూ అది ప్రతిధ్వనించింది. ఆ పద్యం మూలాలు ఎక్కడ ఉన్నాయో వెతికారు రావుగారు. ఈ ప్రౌఢి నన్నయ గారికి భట్ట నారాయణుడి వేణీసంహార నాటక స్ఫురణ వల్ల వచ్చింది.

**చంచద్భుజ భ్రమిత చండ గదాభిఘాత**
**సంచూర్ణితోరుయుగలస్య సుయోధనస్య**
**స్త్యానావనద్ధ ఘనశోణిత సిక్తపాణి**
**రుత్తంసయిష్యతి కచాంస్తవ దేవి! భీమః.**

కవుల పలుకుబడుల మూలాలు వెతకడం, నిర్ధారణ చేయడం ఒక వినోదం. అందుకు అనారత అధ్యయన సంపద అవసరం. రావుగారు నిజంగా మహాసంపన్నులు. ఎన్నెన్ని రచనలు సూక్ష్మేక్షికతో అవలోకించారో సామాన్యుల ఊహకు అందదు. వందల వేల పండితుల నామధేయాలు మనలను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి ఈ రచనలో.

**బుక్స్ ఆఫ్ ఆల్ టైం** లో చేర్చదగిన గ్రంథం ఇది.

ఒక మహాకవిని చదవడానికి ఎంతెంత పరిజ్ఞానం అవసరమో ఈ పుస్తకం చూచి అంచనా వేయవచ్చు. నన్నయ రచన లోతులు, మెలకువలు తెలియడానికి ఎంత భాషాపరిజ్ఞానం గడించాలి? మహాకవుల కవితాతపస్సులలో పునీతులు కావడానికి ఎంత అర్హత ఉండాలి?

నన్నయ భారతాన్ని 'పాండవ చరితమ్' పేర ఒక ప్రాచీన కవి సంస్కృతీకరించాడు. అది అలభ్యం. ఐనా, కొన్ని శ్లోకాలు ఆ కవిదే ఐన లక్షణ గ్రంథం 'వృత్త మౌక్తికమ్' లో లభిస్తున్నాయి అని వాటి వివరాలిచ్చారు రావుగారు. ఆ కవి లాక్షణిక చక్రవర్తి కవిశేఖరుడు చంద్రశేఖర భట్టు.

మనకు తెలిసి కాళహస్తి కవి వసుచరిత్రకు చేసిన సంస్కృతీకరణం

చూచి, అది తెలుగుకు గర్వకారణంగా తలపోసేవాళ్ళం. ఈ గ్రంథమూ లభిస్తే ఎంత పుణ్యం చేసుకొన్నవాళ్ళమో.

భాషా ప్రౌఢిమలో శిర:స్నానం చేరిన శ్రీనాథుడి రచనలు ఆనందించడానికి ఎంత పరిశ్రమ కావాలి? శ్రీనాథుడు 1376 ప్రాంతంలో నూనూగు మీసాల నూత్న యౌవనంలో **'శాలివాహన సప్తశతి'** రచించాడు. అందులో కొన్ని పద్యాలు మాత్రమే అక్కడక్కడా లాక్షణికులు ఉదాహరించి లభించాయి. **"వారణసేయ దావగొనవా"** అనే శ్రీనాథుడి పద్యం మొదటిసారి వెలికి తీసింది మానవల్లి రామకృష్ణకవి.

నన్నెచోడ కుమార సంభవంలో (5-89 వచనంలో) **"రతి మతి నడల నూర్మడించినం దావగొనక"** అనే చోట **"దావ"** పదానికి వివరణ చేస్తూ మానవల్లి వారు పై పద్యం టీకలో ఉదాహరించారు. **"దావగొనక"** అంటే **"నిలువలేక"** అని అర్థం చెప్పారు.

హాలుడి 'గాథాసప్తశతి' దీనికి మూలం. ఆ ప్రాకృత శ్లోకం స్పృశించని లాక్షణికుడు లేడు. కానీ మన గాథాసప్తశతి ప్రతులలో ఈ శ్లోకం కనబడదనీ, ఆల్బ్రెష్ట్ వెబర్ జర్మన్ భాషానువాదంతో 1881 లో ప్రచురించిన ప్రతిలో ఈ ప్రాకృత శ్లోకం ఉన్నది అంటూ శ్లోకం ఆకరం చెప్పారు రావుగారు. ఈ శ్లోకం రామణీయకత, భిన్న భిన్న వ్యాఖ్యలలోని సారస్యం ఈ సంపుటిలో చదివి తీరాలి.

ఇందులో 'తావి గొనవా' అనే పాఠం (దావకు బదులు) సముచితంగా ఉంటుందని రావుగారు సప్రమాణంగా చెప్పారు.

ఈ పద్యం "శ్రీనాథుని సప్తశతి 4ఆ" లోనిది అని మానవల్లి వారు సూచించారు గానీ, ఆయన శాలివాహన సప్తశతి ప్రతిని చూచి చెప్పినట్లు ఆధారాలు లేవనీ, ఆంధ్రా యూనివర్సిటీలోని **'ఛందోగ్రంథము'** అనే వ్రాతప్రతిలోనూ, తిరుపతి ఓ.ఆర్.ఐ. లోని **'బాలబోధచ్ఛందము'** లోనూ ఉన్నది అని చెప్పారు.

మానవల్లివారు నన్నెచోడుణ్ణి పలువురు కవులు అనుసరించారని కొన్ని పద్యాలూ, ఆయా కావ్యాల పేర్లూ సూచించారు. అవి కొన్ని ఆ కావ్యాలలో/ తాళపత్రాలలో నేడు లభ్యం కావడం లేదు అని రావు గారి అభియోగం .

మానవల్లి వారు తొలిసారిగా 'క్రీడాభిరామము'ను ప్రచురించారు. అందులో ఉండవలసిన నాందీ పద్యం అలభ్యమనీ, అందుచేత అధర్వణుని భారత విరాట పర్వం మొదటి ఆశ్వాసం నుండి గ్రహించిన ఈ పద్యం చేర్చాను అని చెప్పారు.

ఆ పద్యం ఇది :

**అంబరసీమఁ దారలు జటాటవి మల్లెవిరుల్, భుజాంతరా**
**ళంబున హారసంతతు లిలాస్థలిఁ బువ్వుల వర్షముల్ ప్రసూ**
**నంబులు సత్కృతాంజలి ననందగి మౌక్తికతుల్య మౌళి గం**
**గాంబుకణంబు లుట్టిపడ నాడెడు శంభుడు మిమ్ముఁ బ్రోవుతన్.**

ఇది శివ స్తుతి. అధర్వణుడు జైనుడని ప్రసిద్ధి. అతడు శివుణ్ణి స్మరించడం జరగదు, విరాట పర్వంలో శివస్తుతికి సందర్భం లేదు అంటారు రావు గారు.

ఇది తంజావూరు లైబ్రరీలో పెదపాటి జగన్నాథ కవి 'ప్రబంధ రత్నాకరము' (సంకలనం) లో ఉదాహరించి ఉన్నది అనీ, అది 'భరతము' లో దామరాజు సోమయ్య రచనగా అందులో చెప్పబడింది కానీ, చక్కగా పరిశీలిస్తే ఇది శ్రీనాథుని శాలివాహన సప్తశతి లోనిది – అని నిర్ధారణ ఔతుంది అని అన్నారు రావుగారు.

ఇలాంటి ఎన్నో గొప్ప విషయాలు తెలియజేసినందుకు పాఠకలోకం మురళీధరరావు గారికి ఎంతో ఋణపడి ఉంది.


ఈ మహా గ్రంథం అజో విభో కందాళం ఫౌండేషన్ వారు జూన్ 2024 లో హైదరాబాదులో ప్రచురించారు.

# ప్రామాణిక కవి జీవిత చరిత్ర : వంగూరి 'వేమన'

**డా. కొల్లు వెంకటేశ్వర రావు,** ఫోన్ : 986648 5039

తెలుగు వారందరికీ తెలిసిన కవి వేమన. పరిచయం అక్కర్లేని ప్రజాకవి. విభిన్న సందర్భాల్లో మన వేమన ఈ సంగతిని ఎప్పుడో చెప్పిందు గద అని తలపుకు వచ్చేకవి. అయినప్పటికీ వేమన జీవితం, రచనలు నేటికీ చర్చనీయాంశాలే! వేమన చాటుకవి ప్రవృత్తితో, తాను చూసిన విషయాలకు స్పందించి కవిత్వం చెప్పిన కవి. తన కాలం నాటి కవితా ధోరణులకి భిన్నంగా కవిత్వం సృజించిన, అనేక వైరుధ్యాలను కలిగిన కవి వేమన. కారణాలేవైనా 19వ శతాబ్దం నాటికి వేమన పద్యాలు మన పండితులనే కాక, సి.పి.బ్రౌన్, క్యాంబెల్ వంటి ఆంగ్లేయాధికారులను ఆకర్షించాయి. ఆలోచింపజేసాయి. 20వ శతాబ్దారంభం నాటికి కట్టమంచి రామలింగారెడ్డి, వంగూరి

**వేమన**
**వంగూరి సుబ్బారావు**
వెల : 150 /-
పుటలు 176
**ప్రతులకు :** ఎమెస్కో
హైదరాబాద్



సుబ్బారావు, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి, నార్ల వెంకటేశ్వరరావు, శ్రీశ్రీ, ఆరుద్ర, బంగోరె, ఎన్.గోపి వంటి ఎంతోమంది వేమన గురించి, ఆయన రచనల గురించి పరిశోధన చేసి ఎన్నో వ్యాసాలు, గ్రంథాలు రాశారు. ఇట్టి గ్రంథాల్లో తొలి దశలో వెలువడ్డ శాస్త్రీయరచన. వంగూరి సుబ్బారావు గారి **'వేమన సంపూర్ణ జీవిత చరిత్రము, బోధనలు'** ఆంధ్ర వాఙ్మయ నిర్మాతలు అన్నపేరుతో కొందరు ప్రసిద్ధ కవులు జీవిత చరిత్రలను ప్రకటించాలనే సంకల్పంతో వంగూరి సుబ్బారావు రాసిన పుస్తకం ఇది. 1922వ సంవత్సరంలో వెలువడిన ఈ పుస్తకం ఇంత కాలానికి ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, ఎమెస్కో వారి కృషిఫలంగా వెలుగులోకి రావటం విశేషం.

సంపాదకుడు పేర్కొన్నట్లు **"తెలుగు సాహిత్యంలో ఇంత వాద వివాదాలకు, చర్చలకు కారణమైనవాడు. అబాల గోపాలంచే మహాకవిగా కీర్తిపొందినవాడు, కవియో, యోగియో, కవియోగియో, అర్థంకానివాడు, అన్నీ అయినవాడు మరొకడు లేడు.''** ముందుమాటలో ఘట్టమరాజు సూచించినట్లు వంగూరి సుబ్బారావు కృతులు "చన్నకాలంలో గొప్ప సంచలనం కలిగించినా, ఉన్నకాలంలో చడీ చప్పుడు చేయకుండా మిన్నకుండిపోవడం వర్తమానయుగ తెలుగు సాహిత్య దౌర్భాగ్యంగానే భావించవలసి ఉంటుంది" బహుభాషా సాహిత్యఅధ్యయనఘటికులు ఘట్టమరాజు అశ్వత్థనారాయణ 'మూసీ' మాసపత్రికలో వేమన పుస్తకాన్ని విపులంగా పరిచయం చేయటం ద్వారా మరోమారు సాహితీ లోకానికి సుపరిచితమయినది. ఎమెస్కో వారి ప్రచురణ (మే, 2024) వలన వంగూరి సుబ్బారావు పరిశోధన కృషి శతాబ్దం దాటాకనైనా ఈ కాలం వారికి చేరువైంది. 176 పేజీలు కలిగిన 'వేమన' గ్రంథంలో 18 అధ్యాయాలు ఉన్నాయి. తొలిసారి 1922లో ముద్రితమైన వేమన జీవిత చరిత్రకి మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి వేపా రామేశం పరిచయ వాక్యాలు రాశాడు. వంగూరి సుబ్బారావు ఐదు పేజీల పీఠికలో వేమనపై పరిశోధన గ్రంథం రాయడానికి గల కారణాలను సవివరంగా తెలిపాడు. శతక వాఙ్మయానికి వేమనని సార్వభౌముడిగా పేర్కొన్నాడు. **"16వ శతాబ్ది నుండియు నీతని కవిగా పండితులు కూడా స్తుతించుచున్నారు. తెలుగు వాఙ్మయమున కనేక విధముల మహోపకార మొనరించిన బ్రౌనుదొరగారి 1825 సంవత్సరపు ప్రయత్నములు మొదలు నేటివరకీతని చరిత్రకై మనవారు పెనుగులాడుచునే యున్నారు. వేమన్నను గౌరవించుట కనేక కారణములున్న మాట సత్యము. ఈతని యోగిగా, మతసంస్కర్తగా, రసాయన శాస్త్రజ్ఞునిగా, దిగంబరిగా యింకాననేక విధములుగ గౌరవించుచున్నారు. ఈతని చరిత్రకు ప్రయత్నించినంత మంది భాషా సేవకులింకొక తెలుగు కవి చరిత్రకై ప్రయత్నింప లేదనుట సత్యేతరము కాదు. కాని ఈతని చరిత్రము కవుల చరిత్రమునందు, కవి జీవితములందును గూడ గఱవైనది. మనవారీతని యోగిగా, బూజించినంత కవిగా బూజింపలేదాయని నా భయము. కావున మీరీతడు కవీంద్రుడా? యోగీంద్రుడా? ఏ కారణముచే నెక్కువగా మన గౌరవమునకు గృతజ్ఞతకు నాస్పదమగుచున్నాడు అని తెలిసికొనవలెను. మనమొక వ్యక్తినెందులకు గౌరవింపవలయునో తెలియకుండా గౌరవించుట మూఢభక్తియగును."** ఈ ఉద్దేశంతో తన పరిశోధనాంశానికి సంబంధించి పూర్వ పరిశోధనలను, అభిప్రాయాలను శాస్త్రీయంగా చర్చిస్తూ, వేమన తన దృక్పథాన్ని, అభిప్రాయాలను వివరించే పని చేశాడు వంగూరి సుబ్బారావు. వేమనకు సంబంధించి విషయ సేకరణ, విశ్లేషణలకు కొనసాగింపుగా అనేక అంశాలను కొత్తగా చెప్పాడు. పలు సందర్భాల్లో కవిత్వం గురించి, విమర్శ గురించి నిర్ధారణ వ్యాఖ్యలు చేశాడు.

**'వేమన సంపూర్ణ జీవిత చరిత్రము, బోధనలు'** లోని విభాగాలు. 1. వేదాంతము కవిత్వము, 2. వేమన చరిత్రము, 3. స్థల నిర్ణయము, 4. కాల నిర్ణయము, 5. కులము, 6. కుటుంబము, 7. వేమన కాలమునందలి స్థితి, 8. మతములు, గురువు, 9. వేమన్న భాష, 10. వేమన్న కవిత, 11. పద్య పతనము, 12. వేమన పోలిక కవులు, 13. వేమన్న నీతులు, 14. వేమన్న జీవిత విధానము, 15. చరమదశ. ఈ అధ్యాయాలన్నిటిలోనూ వేమన గురించి మౌలికమైన ఆలోచనలు చేసి సరళ సుందర భాషలో చెప్పడం వంగూరి ప్రత్యేకత. కవి జీవిత విమర్శకుడికి కావలసిన విస్తృత అధ్యయనం, తులనాత్మకత విశ్లేషణ దృష్టి పరిపూర్ణంగా కలిగినవాడు. వంగూరి తన రచనలో తాను రాసిందే ఆఖరని భావించలేదు. గ్రంథాన్ని చదివి మంచిచెడ్డలు విమర్శించి, దోషాలు చూపువారికి ఎల్లప్పుడు కృతజ్ఞుడిగా ఉంటానన్న వివేకి. వంగూరి సుబ్బారావు వేమన కాలం నాటి సామాజిక, రాజకీయ పరిస్థితులన్నింటినీ పరిశీలించాడు. తన రచనకు ముందుగా వేమన సాహిత్యంపై వచ్చిన రచనలన్నింటిని అవసరమైనప్పుడు, ప్రస్తావించే మేల్తర పద్ధతిని ప్రతి అధ్యాయంలోనూ పాటించాడు. ఈ పద్ధతిని నేటి సాహిత్య పరిశోధకులందరూ అనుసరించవచ్చు.

వేమన భాష, కవిత్వం, మతం విషయాలలో వంగూరి సుబ్బారావు ఎన్నో వైరుధ్యాలను, అతిశయోక్తులు లేకుండా వివరించాడు. 10వ అధ్యాయం వేమన కవితలో ఎటువంటి శషభిషలు లేకుండా వేమనను తత్త్వకవిగా వివేచించాడు. అంతేకాదు వంగూరి దృష్టిలో వేమన హేతువాది, ప్రజాకవి, సంస్కరణవాది, రసవాది, యోగి. కె.కె. రంగనాథాచార్యులు అన్నట్లు **'తన కాలపు సామాజిక, మత పరిస్థితుల నుంచి పుట్టిన కవిగా వేమన తెలుగుదేశపు సామాజిక చరిత్రను, ఆ నేపథ్యంలో సాహిత్యాన్ని అంచనా కట్టడానికి ఎంతో ఉపకరిస్తాడు'** ఇటువంటి చారిత్రక స్పృహతోనే వంగూరి సుబ్బారావు వేమన వైవిధ్యతకి కారణాన్ని చూపడానికి, ఎంతో శ్రమకోర్చి వేమన జీవిత చరిత్రని సమగ్రంగా సంతరించాడు.

వేమన దృక్పథాన్ని తెలుసుకోవడానికి ప్రధానంగా ఉపకరించి నవి అతని ఉపమలే. వంగూరి దృష్టిలో వేమన ఉపమలు ప్రకృతి నుండి సరాసరి తీసుకున్న అనుభవాలే కానీ, అలంకార శాస్త్రాలు చదివి కూర్చుకున్నవి కావు. ఈతడు ఉపమలలో, కాళిదాసంత వాడనిని, గొందఱు నవ్వుదురు కాబోలు. అట్టి వారుపమాలంకార తత్త్వమునే యెఱుగని వారగుదురు. సాధర్మ్యమునందింకనింత కంటె మంచి యుపమవేయుటకు ప్రయత్నించినను మహాకవులకు గూడ నెక్కడ నసాధ్యముగానుండునో. విమర్శకులకు, గూడ నెచ్చట యుపమను తృప్తికరముగ మార్చలేమని యంగీకరించవలసి వచ్చునో – అచ్చట మహాకవి శిల్పము కలదని గ్రహింపవలెను అన్న వంగూరి వాక్యాలు సర్వదాశిరోధార్యాలు.

విశ్వశ్రేయస్సును కాంక్షించిన కవి వేమన. **విశ్వదాభిరామ వినురవేమ** అన్న మకుటం గురించి చాలా క్లుప్తంగా వంగూరి చర్చించారు. విశ్వ మానవ కోటి కోరికల్ని తీర్చడం అన్న సామాన్య ధర్మాన్ని విశ్వసించాడు. వేమన కాలం గురించి ఎన్నో పరిశీలనల ద్వారా ఆయన క్రీ.శ. 1412లో పుట్టి క్రీ.శ. 1480లో మరణించి ఉండునని, 68 సం॥లు జీవించి ఉంటాడని వంగూరి తెలిపాడు. వేమన ఎంత కఠినంగా తిట్టినా బ్రాహ్మణులు కాని, శైవులు కాని, వైష్ణవులు కాని అతని సిద్ధాంతాలలోని వేదాంతమును, ఉపనిషత్సారమును సులభంగా ఖండించలేకపోయినారని వంగూరి అభిప్రాయం. అంతేకాదు **"అతని ఆత్మ స్వాతంత్ర్యమెంత పరిశుద్ధమైనదో దానిని బాదుచేయుట కాతని యాగ్రహజనిత వాక్యపరంపర యంత యపరిశుద్ధమైనది. పరమసత్యము కూడ, గోప సమ్మేళనమున భయపడవలసి వచ్చినది"** అని చెప్పాడు. దానిని వేమన విశిష్ట గుణంగా, అందువల్లనే ఆయన సజీవ సాహితీస్రవంతిలో కొనసాగుతున్నాడని గ్రహించొచ్చు.


వేమనను సర్వజ్ఞుడు, తుకారామ్ వంటి వారితో పోల్చి తులనాత్మకంగానూ అంచనా వేశాడు. వేమన పద్యాలను అనేకమంది అనుకరించటమే వేమన గొప్పతనాన్ని వెల్లడిచేసే అంశమని అందుకు తార్కాణాలు చూపాడు. నిరంకుశ ప్రవర్తనకల కవి వేమనని, తానే బ్రహ్మమని సంపూర్ణ విశ్వాసంతో జీవితాన్ని గడిపినవాడని వంగూరి సుబ్బారావు నిశ్చితాభిప్రాయం. ఈ గ్రంథ ప్రాసంగికతను గుర్తించి ప్రచురణకు ప్రేరేపించినవారు, ప్రచురించినవారు ఎంతైనా అభినందనీయులు.

# "బతుకు బండి" – దళిత కథల ఒడి

**డా. ముత్యంపేట గంగాధర్,** ఫోన్ : 9704 11 8352

"బతుకు బండి" అనే కథల సంపుటి రాసిన రచయిత దేవి యాదగిరి. పెద్దపల్లి జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన దేవి లచ్చమ్మ–లింగయ్య గార్లకి మూడవ సంతానంగా జన్మించాడు. అణగారిన వర్గంలో పుట్టి అంచలంచెలుగా శిఖరాగ్రంలా ఎదిగాడు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ, సమాజానికి తన సాహిత్యాన్ని పరిచయం కూడా చేశాడు. కవిగా దేవి యాదగిరి మొదటి పుస్తకం 'కొలిమి' కవితా సంపుటి. రెండో పుస్తకం 'బతుకు బండి' కథాల సంపుటి. ఈ సంపుటి లోని కథలు, వ్యథలు. మురికి మనుషులలోని ముత్యంలాంటి మనసు గల్ల వారి కథలు. ఇషం, కువారం లేని విశ్వాసం గల పల్లె జనుల జీవితాలు. నిజానికి ఈ కథలు రచయిత తాను అనుభవంలో నుండి వచ్చినవి కావొచ్చు. రచయిత దళిత వర్గం వాడే కావటం మూలాన కథలు పరిపుష్టమైన వస్తువు, శిల్పం, ఎత్తుగడను కలగలుపుకొని ఉన్నాయి. ఎందుకంటే తాను స్వయంగా ప్రతి పాత్రలో పరకాయ ప్రవేశం చేసి సంఘటనలకు సందర్భానుసారంగా రక్తి కట్టించారు. ఈ సంపుటిలో 12 కథలు ఉన్నాయి. ప్రతి కథలో సమకాలిన సజీవ సంఘర్షణకు భవిష్యత్తు భరోసాకు సృజనాత్మకమైన పునాది అన్వయింపులు ఉన్నాయి. ఒక పేద రైతు ఆవేదన, మట్టి మనుషుల ఉత్పత్తి నుండి శ్రమ నుంచి ఆర్థిక స్వేచ్ఛ లాగేసుకునే అగ్రవర్ణాల దుశ్చర్యలను, చెమటనే

**బతుకు బండి**
**దేవి యాదగిరి**
వెల : 120 /-
పుటలు - 140
**ప్రతులకు :** దేవి పబ్లికేషన్స్
ప్రతులకు :
రచయిత
98660 69151




అభరణంగా ధరించిన వర్గంపై అంతర్లీనంగా జరిగిన దోపిడిని యాదగిరి చక్కగా వివరించాడు. ముఖ్యంగా రచయిత కథల్లో పాత్రలతో పలికించిన భాషా ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాండలికంలో భాషింప చేశాడు. సన్నివేశానికి తగినట్లు జాతీయాలు, సామెతలు పక్కాగా ప్రాంతీయ మాండలికాలను స్పృశించారు. సహజంగా రచయిత కవి కావున కథలో కూడా అలంకార వర్ణనలతో పరిస్థితులకు తగినట్లు రంగరించాడు. కథల సంపుటిలో మొదటి కథ 'బాడుగ'. నారాయణ అనే షావుకారు మాలవాడలోని సన్నకారు రైతులకు ఉద్దెర ఖాతాలపై దుకాణం సామాన్లు ఇస్తూ ఉంటాడు.

రైతుల దగ్గర తక్కువ ధరతో కొన్న దినుసులను సిటీ మార్కెట్ కు రవాణా చేయడానికి కచ్చురం బండ్లు ఉన్న వాళ్ళని బాడుగకు రమ్మనే వాడు. వారికి డబ్బులు ఇవ్వకుండా అతని దుకాణం లోనే అవసరమైన వస్తువులు తీసుకోమనేవాడు.ఇంకా అప్పులు ఇస్తానని ఆశ చూపి అమాయకులను మోసం చేసే విధానం ఇందులో చూపించాడు.

'బతుకు బండి' కథలో నీలమ్మ రామయ్య భార్యాభర్తలు వీరికి ఒక కొడుకు పేరు సత్యం. అదే ఊరిలోని షావుకారి అంజయ్య ఇతని భార్య గయ్యాలిది. మరో పాత్ర మానవత్వం గల వ్యక్తి అయిన కాపు రాజవ్వ వితంతువు. రాజవ్వ ఇంటి వద్దనే వడ్లు జోకే స్థలం. ముఖ్యంగా ఈ కథలో చిన్న రైతుల పరిస్థితి తెలుపుతుంది. ఆరుగాలం కష్టించి పనిచేసిన రైతులను షావుకారులు చేసే తప్పులెక్కలతో నిండా మునిగిన అమాయక శ్రమజీవుల దీనగాథ. ఎన్ని కష్టాలు పడ్డ కన్న కొడుకు సత్యమును చదివించుకోవాలనే ఆరాటం, రామయ్య చదువుకోక ఎంత నష్టపోయాడో తెలిసిన విధానం కనిపిస్తుంది. షావుకారి భార్య ఎదుటివారిని నిందించే లక్షణం, ఎక్కువ తిట్లు తిట్టడం, ఎక్కువ కులం అనే అహంకారంతో పెద్దరికం మాటలను మనం ఈ కథలో చూడవచ్చు.

'సిల్కడు' ఈ కథలో అమాయక వ్యక్తి, అసుకలిత బ్రహ్మచారి సిల్కడు. అందవిహీనంగా ఉండడంవల్ల అతన్ని అసహ్యించుకొని తప్పుగా, తక్కువ చేసి మాట్లాడడం తర్వాత తక్కువ చేసి మాట్లాడిన వ్యక్తిని తన బామ్మర్ది కళ్ళు వనంలోకి తీసుకువెళ్తే బాగా తాగి పడిపోవడం. అతన్ని ఆ సిల్కడే ఎత్తుకు వచ్చి వారి బామ్మర్ది ఇంట్లో పడుకోబెట్టడం, సిల్కని మంచి మనసు గురించి చెప్పడం .వ్యక్తి అందంగా ఉండడం కాదు మనసు, హృదయం అందంగా ఉండి నిస్వార్థంగా ఉన్న వారే మంచి గుణం కలవారు అని తెలియజేసినటువంటి ఇతివృత్తం గలది. వ్యక్తిని చూసి అంచనా వేయకూడదు అని తెలిపిన మానవత కథ.

'తల్లి నిన్ను తలంచి' సమాజంలో ఆడవారి పై ఎలాంటి లైంగిక వేధింపులకు గురి అవుతున్నారో తెలియజేసిన కథ. 'ఒక వర్షం కురిసిన సాయంత్రం' కథలో గ్రామీణ ప్రాంతంలో చదివే పిల్లల తీరు చిన్న కుటుంబాలలో చదువును ఎంతగా ప్రేమిస్తారో చూపించాడు. 'భూదేవి' రెండు కుటుంబాలు ఆగమైన జీవన విధానాలు ఈ కథలో వివరించాడు. 'పడి లేచిన కెరటం' అచ్చయ్య తన మక్క సేనులో పిట్టల కావలి ఉంటాడు. ఒడిసెల గుండుతో పిట్టలను కొడుతున్న సమయంలో వాళ్ళ ఊరిలోని పూజారి సేను లోకి వచ్చేటప్పుడు రాయి తాకి వెనుకకు పడితే బండమీద పడి తల పగిలి చనిపోతాడు. కులం తక్కువ అమాయక అచ్చయ్యను కేసులో ఇరికించి పోలీసు వాళ్ళు, లాయరు అందరూ కేసు పెట్టి హింసకు గురి చేస్తారు. బ్రాహ్మణులు కానీ లాయర్ అత్యధికంగా మాట్లాడి అచ్చయను నిర్దోషిగా విడిపిస్తాడు.

'సీసీ రోడ్' సీసీ రోడ్ అంతరంగం ఈ కథ. విమర్శనాత్మక గలది. సిమెంటు రోడ్ వేయడం నుండి మొదలు పెడితే కాంట్రాక్టర్ కార్పొరేటర్లు, ఉద్యోగులు లంచాలు తీసుకొని నాణ్యతలేని సీసీ రోడ్డు వేయడం అవి తొందరగా చెడిపోవడం. అలాగే సీసీ రోడ్డును ఆనుకొని ఉన్న ఇండ్లవారు దానిని ఏ విధంగా వాడుకుంటారో రచయిత చూపించాడు. అయితే వారి వాడలో దొంగలు పడటం వారిని దొరకపట్టి కొట్టి పోలీసులకు అప్పజెప్తారు. మరి నాణ్యతలేని రోడ్ వేసినందుకు వారికి సహకరించిన వారిని ఎంత కొట్టాలి వారిని ఏ విధంగా శిక్షించాలి అనేది ఈ కథలో అంతరంగం.

'కడలి అలజడిలో ఒక అల' ఇందులోని ఇతివృత్తం కులాంతర వివాహానికి సంబంధించింది. 'కార్తీక్' మాదిగ కులానికి చెందిన వ్యక్తి. యూనివర్సిటీలో చదువుతూ విద్యార్థి సంఘంలో అధ్యక్షుడిగా ఉంటాడు. అక్కడే చదివే అమ్మాయి 'కీర్తన' రెడ్డి కుల వర్గానికి చెందిన అమ్మాయి. వీరు ఇరువురు ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి కీర్తన అన్నయ్య "మధుసూదన్ రెడ్డి" ఒప్పుకోకపోవడం గ్రామాలలో కుల వివక్షత ఎంత ఉన్నదో కనులకు కట్టినట్టు చూపించాడు.

'సర్వము తానైనవాడు' కథలో తక్కువ కులం, అస్పృశ్యత, అంటరానితనంలను సారాంశం పై నడిపించినాడు రచయిత. సహాయం చేసినప్పుడు ఏ కులం అడ్డు రాలేదా అని ప్రశ్నించే చక్కని ఎత్తుగడ, శిల్పం గల కథ 'చితికిన బతుకులు'. వడ్డెర కులం వారి వృత్తి, జీవన విధానాలు తెలియజేసిన గాథ ఇది.

'ఎతను చెప్పుకుంటే కథలు అవుతాయి' అన్నట్లు శ్రామిక, శ్రమజీవనం గ్రామీణ జీవన, అంటరాని వర్గాల అవేదనలను, అస్పృశ్యతను ఏవిధంగా ఉన్నాయో వివరించాడు. వ్యవసాయాన్ని, విద్యారంగాన్ని కొన్ని వర్గాల అసమానతలను ఆర్థిక పరిస్థితులకు వివరించాడు. పల్లెటూరి జీవితాలనే కాదు హైటెక్ జీవితాలను సైతం కూడా కథలో పరిచయం చేశాడు దేవి యాదగిరి. కథలను చదువుతుంటే హృదయ విదారకంగా, కర్షకులు జీవన ఘోష కనిపిస్తుంది. నాటి సామాజిక ఆర్థిక, కులవైశ్యమాల పరిస్థితులను అర్థం చేసుకునే విధంగా ఉండి మళ్లీ మళ్ళీ చదవాలని అనిపించే రీతిలో కథలు ఉన్నాయి. ఈ కథా సంపుటిలో శిల్పం, ఎత్తుగడ, మాండలిక భాష శైలి పాఠకునికి జిల్లా యాసను పరిచయం చేస్తూ, మంత్ర ముగ్దుల్ని చేస్తాయి. బతుకు బండి కథాల సంపుటి ఉత్తమ కథల సంపుటులలో శిఖరాగ్ర స్థానంలో నిలిచింది.ఇలాంటి మరిన్ని కథలు రాసి పాఠకులను చైతన్యం తేవాలని, మాండలిక భాషతో మైమరిపించాలని ఆశిస్తున్నాను.

❖ ❖ ❖ ❖ ❖

# వైభవంగా సాగిన శ్రీ బి.ఎన్. శాస్త్రి పురస్కార ప్రదానోత్సవ సభ

**డా. మంత్రి శ్రీనివాస్,** కవి, అనువాదకులు, ఫోన్ : 8328 333 720

మట్టి పొరల్లో కూరుకుపోయి కనుమరుగవుతున్న చారిత్రక ఆధారాలనబడే శాసనాలను వెలికితీసి వాటి హృదయ పాఠాలను సశాస్త్రీయంగా లోకానికి పంచిన పరిశోధకులు మాన్యులు శ్రీ బి.ఎన్. శాస్త్రి.

కవిగా, నవలాకారులుగా, మూసీ మాసపత్రిక సంపాదకులుగా ఆయన చేసిన సేవలు సాహితీలోకంలో చిరస్థాయిగా నిలిచాయి. ఆయన 92 వ జయంతి సందర్భంగా వేద సంస్కృతి పరిషత్, మూసీ మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యవంలో శ్రీ బి.ఎన్.శాస్త్రి పురస్కార ప్రదాన సభ అంగరంగ వైభవంగా జరిగింది. ఏటా డిసెంబర్ పదవ తారీఖున జరిగే ఈ పురస్కార సభకు సురభారతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదిక అయింది. శాస్త్రిగారి స్మరణలో ప్రధానం చేయబడుతున్న ఈ పురస్కారాన్ని 2024కు గాను వేదాంత వేద్యులు, కవనమూర్తి మహామహోపాధ్యాయ శ్రీమాన్ ఎస్.వి. రంగరామానుజా చార్యులు అందుకున్నారు. ఈ పురస్కార సభలో భాగంగా సాహితీ దిగ్గజం డా.శ్రీరంగాచార్య సాహిత్యాన్ని-వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించిన **సాహితీ శ్రీరంగం** అమూల్యమైన గ్రంథం లోకార్పణం జరిగింది.

ఈ విశిష్ట సభకు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు, జాతీయవాదకవి, దేశభక్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా, నడుస్తున్న విజ్ఞాన సర్వస్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, ప్రస్తుత సంచాలకులు సంస్కృత భారతి ఆచార్య పెన్నా మధుసూదన్, తెలుగు అధ్యాపకులు కట్టా గిరిజారమణ శర్మలు వక్తలుగా విచ్చేశారు.

జ్యోతి ప్రకాశనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ప్రసంగిస్తూ బి.ఎన్. శాస్త్రిగారి శోధనా ప్రయాణాన్ని, సాహితీ లోకానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. దేశ చరిత్రను, జిల్లాల సర్వస్వ సంపదను నమోదు చేసి ఎవ్వరూ చేయలేని కార్యాన్ని సుసంపన్నం చేసినవారుగా బి.ఎన్.శాస్త్రిగారి కృషిని గుర్తు చేసుకున్నారు. మూసీ మాసపత్రికను స్థాపించి సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక వైభవాన్ని లోకానికి తెలియజేశారన్నారు. వారి అనంతరం వారి కార్యాన్ని పుత్రికారత్నం, జామాతలు కొనసాగిస్తుండడం విశేషమన్నారు. అధ్యక్ష ప్రసంగానంతరం పురస్కార ప్రదానం ఎంతో ఘనంగా జరిగింది. అతిథులందరి అభినందనల వెల్లువలో శ్రీమాన్ ఎస్.వి.రంగరామానుజాచార్యులు బి.ఎన్.శాస్త్రి పురస్కారాన్ని అందుకున్నారు. తదుపరి సాహితీ శ్రీరంగం గ్రంథావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతను, గ్రంథకారకులను అతిథులు, నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.



సభా ప్రయాణంలో తదుపరి ముఖ్య అతిథి ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ బి.ఎన్. శాస్త్రిగారి ఖ్యాతిని, చారిత్రక పరిశోధకులుగా, గ్రంథకర్తగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సామాజిక సేవతో పాటు జ్ఞానప్రసారం చేస్తూ పరమాత్మ సేవలో తరిస్తున్న శ్రీమాన్ ఎస్.వి. రంగరామానుజాచార్యులు గారిని ఈ అవార్డుతో సత్కరించుకోవడం ఎంతో ముదావహమన్నారు. శ్రీరంగాచార్య గారు గురువుగా తాను శిష్యుడుగా తన విద్యాభ్యాసం నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు.

పురస్కార గ్రహీత తన స్పందనను వ్యక్తం చేస్తూ బి.ఎన్. శాస్త్రి గారి సాహిత్యం, పత్రికా నిర్వహణ, శాసనశోధన గురించి తెలుసుకొని తాను అబ్బురపడ్డానన్నారు. పత్రికా నిర్వహణకు సదా తమ ఆశీస్సులు ఉంటాయన్నారు.

అనంతరం డా. శ్రీరంగాచార్య మాట్లాడుతూ మూసీ మాసపత్రిక ఆధ్వర్యంలో తాను చేసిన సాహితీ సృజన మీద ఒక అమూల్యమైన గ్రంథాన్ని వెలువరించి సంపాదకులు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించారన్నారు. శాస్త్రిగారితో తన అనుభవాలను అందరితో పంచుకున్నారు. గ్రంథంలోని వ్యాసకర్తలను ఆశీర్వదించారు.






అనంతరం మూసీ మాసపత్రిక సంపాదకులు, తెలుగుశాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యక్షులు ఆచార్య కమలాకర శర్మ మాట్లాడుతూ శ్రీ బి.ఎన్. శాస్త్రి గారి జయంతిని పురస్కరించుకుని మహామహోపాధ్యాయ, వేద స్వరూపులు, సాహితీవేత్త, పత్రికా సంపాదకులు శ్రీమాన్ ఎస్.వి. రంగారామానుజాచార్యులు గారిని ప్రతిష్ఠాత్మక బి.ఎన్. శాస్త్రి అవార్డుతో సత్కరించుకోవడం తమకు ఎంతో సంతోషమన్నారు. పత్రికకు డా.శ్రీరంగాచార్య గారు అందిస్తున్న సహకారం అమూల్యమైనదన్నారు.

వక్తలు ఆచార్య పెన్నా మధుసూదన్ ప్రసంగిస్తూ భారతీయ సాహిత్యం ప్రపంచానికి ఒక నూతన ఒరవడిని నేర్పిందని, సాహిత్య మూలాలలోకి వెళ్లి దేశ సాంస్కృతిక వారసత్వాన్ని తదుపరి తరాలకు పంచే బాధ్యత నేటి కవుల మీద ఉన్నదన్నారు. మూసీ మాసపత్రిక కవులను ప్రోత్సహిస్తూ ఆ మహోన్నత బాధ్యతను వహిస్తున్నదన్నారు.

**'సాహితీ శ్రీరంగం'** గ్రంథాత్మను ఆవిష్కరిస్తూ తెలుగు అధ్యాపకులు కట్టా గిరిజారమణ శర్మ డా. శ్రీరంగాచార్య వ్యక్తిత్వాన్ని, సాహితీ సుగంధాన్ని అందరికీ పంచారు.

కార్యక్రమంలో భాగంగా అతిథులను, వ్యాసకర్తలను ఘనంగా సత్కరించుకుంది సభ. అశేషసంఖ్యలో హాజరైన ఆహూతులు, కవులు, వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, సాహితీ ప్రియులు, విద్యార్థులు పాల్గొన్న ఈ సభకు ఢిల్లీ విశ్వవిద్యాలయం సహాయాచార్యులు, కవి, విమర్శకులు డా. అట్టెం దత్తయ్య స్వాగతం పలుకగా, కవి, అనువాదకులు, విమర్శకులు డా. మంత్రి శ్రీనివాస్ ముగింపు వచనాలు పలికారు. కార్యక్రమం అనంతరం అందరూ మధురమైన అల్పాహారాన్ని స్వీకరించి, తేనేటి విందును ఆస్వాదించారు.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2025

# 'దివాకర్ల వేంకటావధాని జీవితం – సాహిత్యం ' పై సదస్సు

**డా. మంత్రి శ్రీనివాస్,** కవి, అనువాదకులు, ఫోన్ : 8328 333 720

తెలుగు సాహిత్యానికి పునాదులు వేసిన సాహితీ వేత్తల్లో ఆచార్య దివాకర్ల వేంకటావధాని ఒకరు. ఆయన ప్రయాణంలో అధికభాగం తెలుగుశాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా సాగింది. ఆయన సాహితీసేవను స్మరిస్తూ సాహిత్య అకాడమీ,తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం సంయుక్త నిర్వహణలో దివాకర్ల వేంకటావధాని జీవితం–సాహిత్యం ఒకరోజు జాతీయ సదస్సు ఆర్ట్స్ కళాశాల రూమ్ నెంబర్ 121లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమ ప్రారంభ సమావేశం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సమావేశానికి తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య సాగి కమలాకరశర్మ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా, కీలకోపన్యాసకర్తగా ప్రసిద్ధ తెలుగు, సంస్కృత పండితులు ఆచార్య శలాక రఘునాథ శర్మ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కన్వీనర్ తెలుగు సలహా మండలి, సాహిత్య అకాడమీ ఆచార్య సి. మృణాళిని స్వాగతోపన్యాసం చేస్తూ తెలుగు సాహిత్య మూలస్తంభాల్లో ఒకరైన దివాకర్ల వేంకటావధాని గురించి ఈ సదస్సు నిర్వహించుకోవడం నేటికి తరాలకు మార్గదర్శనం చేస్తుందన్నారు. ఆయన కవనం నుండి వెలువడిన సాహిత్యం ఈనాటికి ఎందరినో ప్రభావితం చేయడమే కాకుండా దారిదీపం వలే నిలుస్తున్నదన్నారు. సాహిత్య అకాడమీ వారు ఈ సదస్సుకు సహాకారాన్ని అందించడం పట్ల కన్వీనర్ గా ఎంతో ఆనందపడుతున్నా నన్నారు. దివాకర్ల శిష్యరత్నాలలో ఒకరుగా వారితో గల అనుభవాలను అందరితో పంచుకున్నారు. అధ్యక్షులు సాగి కమలాకరశర్మ మాట్లాడుతూ వేంకటావధాని గారు ఆచార్యులుగా ఎంతటి ఘనులో సాహితీ సత్యాలను నిగ్గుదేల్చి తన గ్రంథాల మాధ్యమంగా వివరించిన దిగ్గజమన్నారు. గౌరవ అతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. కాశీం ప్రసంగిస్తూ సాహితీ విస్తరణకు, కాలానుగుణంగా సాహితీ మార్పులకనుగుణంగా సాహిత్య కృషి చేసినవారు దివాకర్ల అన్నారు. సాహితీ విమర్శకు కొత్త కోణాలను జోడించినవారన్నారు.

ముఖ్య అతిథి, శలాక రఘునాథశర్మ కీలకోపన్యాసం చేస్తూ అధ్యాపకత్వానికి నిలువెత్తు సంతకంగా దివాకర్ల వారిని చెప్పుకోవచ్చని, విద్యార్థుల పట్ల ఆయన ఎంతో వాత్సల్యాన్ని చూపేవారన్నారు. తెలుగు, సంస్కృత సాహిత్యాన్ని అనర్గళంగా బోధించగా తన్మయత్వం వినేవారమని, ఆయన జీవితం–సాహిత్యం మీద ఈ సదస్సు నిర్వహించుకోవడం ఆయనకు అందించిన ఘనమైన నివాళిగా చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా శలాక వారిని ఘనంగా సత్కరించుకున్నారు.


మొదటి సమావేశం తెలుగు శాఖ ఆచార్యులు డా.ఎస్ రఘు





అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వక్తలుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య, కవి, విమర్శకులు గంధ్ర లక్ష్మణరావు, తెలుగుశాఖ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు డా. జి. అరుణకుమారి గార్లు పాల్గొని ప్రసంగించారు.

అధ్యక్షులు దివాకర్ల వారి అపూర్వ సాహితీ సంపదను, ఆచార్యులుగా వారి నిరుపమాణ సేవలను గుర్తుచేసుకొని వక్తలను సభకు పరిచయం చేశారు. అనుమాండ్ల భూమయ్య దివాకర్ల వేంకటావధాని కవిత్వంలోని వైవిధ్యమైన అంశాలను సంక్షిప్త సుందరంగా అందరికీ పంచారు. 'మధువనం' కావ్యంలోని పాత్ర చిత్రణను సహజ సుందరంగా ప్రతిబింబించిన దివాకర్ల కవి హృదయాన్ని హృద్యంగా వినిపించారు. మరోవక్త డా. అరుణకుమారి వేంకటావధాని కవన కుసుమం 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము'లో పొందుపరుచుకున్న విశేష అంశాల మీద ప్రసంగించారు. వారు మాట్లాడుతూ కాలానుగుణ మార్పులు, వాటికనుగుణంగా ప్రామాణికంగా సాహిత్య చరిత్రను రాసి ప్రాథమిక సమాచార రూపంలో ఈ గ్రంథాన్ని దివాకర్ల అందించారన్నారు. ఆయా యుగాల విభజన అందుకు కారణమైన అంశాలను గురించి చెబుతూ తెలంగాణ సాహితీకారుల వివరాలు, సాహిత్యాన్ని ఈ గ్రంథంలో








విశ్లేషించిన తీరును సవివరంగా ప్రస్తావించారు. జ్ఞాన పరిపక్వతకు, సాహిత్య సృష్టికి వాఙ్మయ చరిత్ర ఎంతగా ఉపయోగపడుతుందో సోదాహరణంగా వివరించారు.

తర్వాత గంగ్ర లక్ష్మణరావు 'అధ్యాపకులుగా దివాకర్ల' అన్న అంశంమీద ప్రసంగించారు. నిరాడంబరంగా ఉంటూ అధ్యాపనాన్ని ఆరాధనా భావంతో ఉండి అందరికీ అమూల్యమైన జ్ఞానాన్ని బోధించిన గురువు దివాకర్ల వారన్నారు. ఆయన మాటల్లో, పాఠాల్లో గంభీర్యతతో పాటు మాధుర్యం తొణికిసలాడేదన్నారు. వ్యాకరణ పాఠాలు ఎంతో సులభంగా చెప్పేవారన్నారు. పుస్తకం లేకుండా తానే ఒక పుస్తకమై పాఠం చెప్పేవారన్నారు. ఆయన పద్య పఠనం విన్నవారు ఆనందడోలికల్లో మునిగిపోయేవారని, పద్య పఠనం లో ఆయనకు ఆయనే సాటి, ఆయనదొక ప్రత్యేక శైలి అన్నారు. వారు తదుపరి తరాలకు రోల్ మాడల్ అన్నారు. అంతిమంగా అధ్యక్షులు డా.ఎస్.రఘు సమావేశంలో ప్రస్తావనకొచ్చిన అపూర్వమైన అంశాలను ప్రస్తావించి ముగింపు వాక్యాలు పలికారు.

మధ్యాహ్నం మధురమైన భోజనం తర్వాత రెండవ సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశానికి తెలుగుశాఖ ఆచార్యులు డా.ఏలె విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు, జాతీయకవి, దేశభక్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి






రాములు, కవి, పండితులు,అధ్యాపకులు సంగనభట్ల నరసయ్య వక్తలుగా పాల్గొన్నారు.


సంగనభట్ల వారు మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యం అనేది అధ్యయనం చేయకుండా తెలుగు సాహిత్యం మీద అధికారాన్ని సాధించలేమన్నారు. దివాకర్ల వారు వేసిన బాటలు అందుకు ఉపకరిస్తా యన్నారు. వేంకటావధాని 'కావ్యలహరి ప్రసంగాల'ను గురించి మాట్లాడుతూ కావ్యానికి అవతారిక అన్నది ముఖ్యమని, అది చదివితే కావ్యాత్మ అర్థం అవుతుందని దివాకర్ల వారు అవతారికలకు ఇచ్చిన ప్రాముఖ్యతను వివరించారు. కావ్య పరంపరలో భాగంగా తెలుగు రాజుల కవి పోషణ గురించి, కవులు రాసిన కావ్యాల్లోని వైవిధ్యమైన అంశాలను సవివరంగా వివరించారు.

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సుకవి దివాకర్ల వారి 'సాహిత్య సోపానాలు' మీద ప్రసంగిస్తూ కావ్య రచన, కావ్య ప్రయోజనాలను గురించి దివాకర్ల వారు తెలిపిన సశాస్త్రీయ అంశాలను ప్రస్తావించారు. తరువాత ఆచార్య పిల్లలమర్రి రాములు ప్రసంగిస్తూ దివాకర్ల వారు ఆంధ్ర మహాభారతం మీద వారు చేసిన పరిశోధన భావితరాలకు దారిదీపంలా నిలుస్తుందని, భారతంపై పరిశోధన చేయాలని తపించేవారికి మార్గాన్ని చూపుతుందన్నారు. ఆంధ్ర వాఙ్మయ ఆరంభ దశను ప్రస్తావిస్తూ దివాకర్ల వారు తన సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్న అచ్చతెలుగు పదాలను ఉటంకించి వాటి ఉపయోగాలను సవివరంగా వివరించిన విధాన్ని శోధనాత్మకంగా సభకు వినిపించారు.


పొద్దున పదిగంటలకు ప్రారంభమైన ఈ సదస్సు ఆసాంతం అనర్ఘళమైన ప్రసంగాలతో దివాకర్ల వారి సాహిత్య పరిమళంతో నిండిపోయింది. అతిథులకు ఘనంగా సత్కరించుకుంది సదస్సు. అంతిమంగా డా.ఎస్. రఘు సభా సమీక్షను వినిపించి ఈ సభకు ముగింపు వచనాలు పలికారు. ఈ సదస్సుకు పలువురు సాహితీవేత్తలు, రచయితలు, పరిశోధకులు, ఎం.ఏ విద్యార్థులు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వ'కృతి'







**రామాయణ కల్పవృక్షం లోకానుశీలనం**
సంపా : డా. గంట్ర లక్ష్మణ రావు
వెల : 200/-
**ప్రతులకు :** విశ్వనాథ సాహిత్య పీఠం,
ధరమ్ కరమ్ రోడ్, అమీర్ పేట,
హైదరాబాద్ - 16.
ఫోన్ : 98491 95959





**శాంభవీ!!**
రచన : ఎరుకలపూడి సుబ్రహ్మణ్య శర్మ
వెల : 100/-
**ప్రతులకు :** రచయిత, సచ్చిదానందపుర,
కర్ణాటక - 577 139
ఫోన్ : 929 041 0049




**గంగ దర్వాజ (తెలంగాణ సంస్కృతి మురిపాల ముచ్చట్లు)**
డా. మట్టా సంపత్కుమార్ రెడ్డి
వెల : 200/-
**ప్రతులకు :** మట్టా కవిత, వాఙ్మయి ప్రచురణలు,
ఇం.నెం. 9-9-295, రాంనగర్, కరీంనగర్ - 505 001. ఫోన్ : 98494 70792




**శ్రీ లక్ష్మీనరసింహ శతకము**
డా. గంట్ర లక్ష్మణ రావు
వెల : 110/-
**ప్రతులకు :** శ్రీమతి గంట్ర విజయ, 10-3-537,
వివేకానందపురి, కరీంనగర్ - 505001,
ఫోన్ : 98493 28036





**సాహితీ శ్రీరంగం**
**(శ్రీరంగాచార్య సాహిత్యం - వ్యక్తిత్వం)**
సంపా : ఆచార్య సాగి కమలాకర శర్మ
వెల : 250 /-
**ప్రతులకు :** మూసీ తెలుగు మాస పత్రిక, ఇం.నెం.
2-2-1109/బికె, ఎల్ఐజి - 10, బతుకమ్మ కుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 13.
ఫోన్ : 934 797 1177

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**


**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,**
**బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,**
**హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**




**శబ్ద బ్రహ్మ చిన్నయసూరి**
ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న,
డా. గుమ్మా సాంబశివరావు
వెల : 160/-
**ప్రతులకు :** టి. శోభనాద్రి, డోర్ నెం. 48-12-1, యూనియన్ బ్యాంక్ బిల్డింగ్, శ్రీనివాస నిలయం, రింగ్ రోడ్ కార్నర్, గుణదల, విజయవాడ - 5. ఫోన్ : 95154 61626




**కీలుగుర్రం (బాలగేయాలు)**
డా. ఎన్. గోపి
వెల : 40 /-
**ప్రతులకు :** పత్తిపాక ఫౌండేషన్,
5-4-47, పత్తిపాక వీధి,
సిరిసిల్ల - 505 301




**క్షీణయుగం కాదు... ఉషోదయ యుగం**
డా. ఆచార్య ఫణీంద్ర
వెల : 300/-
**ప్రతులకు :** యువభారతి, తెలంగాణ సారస్వత పరిషత్ భవనములు, తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001. ఫోన్ : 93913 73684

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 3

UGC CARE List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2025

# మహితత్త్వం

సముద్రమథనంతో హాలాహలామృతాలు లభించాయి
జయసంహిత కుట్రకపటాలను,
ధర్మవిజయాలనూ ఆవిష్కరించింది
నేటి మానవ జీవితపు ఆగడాలను,
విజయాలను నామది తూర్పారబడ్తోంది
అభిమానం,ఆత్మీయత అవలోకనం,
ఆకాంక్షలూ పుష్కలంగా ఉన్నాయి
ఆస్తికత్వం,నాస్తికత్వం రెండూ జీవజాల మనుగడలో
ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో ఊరేగుతున్నాయి.
సిద్ధాంతాలు రాద్ధాంతాలు తరతరాల మనుగడకు
సోపానాలు కావడం లేదే !
కరుకుగానే ఉంది మానవజాతికి నేనందించే గుణపాఠం
నాదైన అభేదసాకారం
ఆకలితో అలమటిస్తూ చస్తూంటే
శ్రీమంతుల ఆకతాయి సుఖభోగ లాలస
నన్ను ఆలోచనల్లో పడేస్తున్నది
స్వేచ్ఛ! అది హద్దులు తప్పితే విచ్చలవిడితనమే కదా!
అదే ఆడించేది, శాసించేది! శ్వాసించేది !
మృత్యు గుహనూ చూపించేది !
ఒక రోగం ఎన్నో రోగాలకు పూర్వ వేదికౌతున్నది
మందున్న రోగం చెప్పేది ఒక్కటే !
అది మానవ మానస రోగాలను పరీక్షలుచేసి
చంపమంటోంది
మసకబారుతున్న మానవత్వమల్లెలను బుద్ధి
నీరము బోసి విరగబూయించమంటోది
స్థాలిక పురాజీవనశైలి సింహావలోకనం చేయమంటున్నది
కాలానుసరణంలో మేలుబంతికై
గమనంలో పరిగణన చేయాలని చెప్తున్నది
నీచుట్టు అగ్ని పేర్చుకొని కూర్చుంటున్నావు
నిన్నది కాల్చివేస్తుందని తెలిసినా
నీ తెంపరితనమె నిన్నిట్లు చేయిస్తున్నది
నిన్ను నీవే నిర్మూలన చేసుకుంటున్నావ్
అది మీకో లెక్కకాదని నాకూ తెలుసులెండి
జాతస్యహిధృవోమృత్యువుకు
నేనేమీ అతీతం కాదుకదా ఈ ప్రకృతిజీవజాలంలో!
నాకున్న లక్ష్యగమనంలో
నన్ను ముందుకెళ్ళనీయకుడా
మీ అస్త్రశస్త్రాలతో నిస్సారం చేయకండి
నా బ్రతుకుకై మీ మీ పటిమను జూపండి
మీకిచ్చే నిర్దేశనిర్వహణలో స్పర్థ పూనండి
కష్టకాలపు మానవదైవాలను తలదాల్చండి
విజ్ఞానకుసుమాల సౌరభాల గుబాళింపుకు వారసులవ్వండి
వెన్నెల జీవితాల తోటలకు ఆనుభావికులవండి
విజయం సార గ్రాహకులదే
కాలాన్ని-నిర్లక్ష్యం చేస్తే
మేధో తత్త్వమే మీ లక్ష్య మైతే
భూప్రపంచ జీవకేంద్ర భూరుహపు
ఆకులు మారకులు చిగురాకులూ
కాలం ఒడిలో శాశ్వత నిద్రకు గురైతే
నేనేమీ ఏడ్వను!
మీ కర్మ ఖర్మ కు ఏడ్చేదీ మీరే !





డా. ఒజ్జల శరత్ బాబు
ఫోన్ : 99635 33937

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



## ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

**State Bank of India, Nallakunta Branch,**

**A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083**

**రండి... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.**

# వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Manohari, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.2-2-1109/BK, LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma

Scanned with OKEN Scanner